
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 239

SUNDAY Special | ఆదివారం 14-5-2023



సన్‌రైజర్స్ ఆశలు గల్లంతు!

సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మళ్లీ నిరాశే ఎదురైంది. లక్నోతో జరిగిన కీలక మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. - 12లో



ప్రభ్‌సిమ్రన్ 'హీరో'చితం

ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ సత్తా చాటింది. 31 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. - 12లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఉక్రెయిన్‌కు జర్మనీ భారీ సాయం

ఉక్రెయిన్‌కు యుద్ధ సామగ్రి సహా రూ.24 వేల కోట్ల విలువైన అదనపు సైనిక సాయం అందించాలని జర్మనీ నిర్ణయించింది.

వివరాలు 2లో ▸



36 వేల టీచర్ల నియామకం రద్దు

పశ్చిమబెంగాల్‌లో అక్రమంగా ఉద్యోగాలు పొందిన 36 వేల మంది టీచర్ల నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.


వివరాలు 14లో ▸



రూ.12 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

కేరళ తీరంలో అక్రమంగా తరలిస్తున్న రూ.12 వేల కోట్ల విలువైన 2.500 కిలోల డ్రగ్స్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది.

వివరాలు 2లో ▸



అత్యంత తీవ్ర తుపానుగా 'మోకా'

బంగాళాఖాతంలోని తీవ్ర తుపాను.. అత్యంత తీవ్ర తుపానుగా కాక్స్‌బజార్(బంగ్లాదేశ్)-క్యాక్‌ఫ్యూ(మయన్మార్) మధ్య తీరాన్ని దాటనుంది.

వివరాలు 2లో ▸

కన్నడ సీమలో

చేతికే ఫుల్ పవర్


అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం.. 224 స్థానాల్లో ఏకంగా 136 హస్తగతం

65 సీట్లతో బీజేపీకి దారుణ ఓటమి.. ఏకైక దక్షిణాది రాష్ట్రమూ చేజారింది

పుట్టి ముంచిన ప్రభుత్వ వ్యతిరేకత.. పని చేయని మోదీ మేజిక్

14 మంది మంత్రుల పరాజయం.. కేవలం 19 సీట్లతో కుదేలైన జేడీ(ఎస్)

మొత్తం స్థానాలు **224** | మెజారిటీకి కావాల్సింది **113**



▸ బొమ్మై ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత ముందు మోదీ మేజిక్ పని చేయలేదు. హిందూత్వ కార్డు, రిజర్వేషన్ రాజకీయాలు, బజరంగ్ బలీ నినాదాలు ఓట్లు రాల్చలేదు. ఫలితంగా కర్ణాటకలో అధికార పార్టీ ఇంటిబాట పట్టే నాలుగు దశాబ్దాల ఆనవాయితీ ఈసారీ కొనసాగింది. కాంగ్రెస్ పార్టీకి రాహుల్ జోడో యాత్ర జోష్, మల్లికార్జున మంత్రాంగం, రాష్ట్ర నేతల సమిష్టి కృషి కలిసొచ్చాయి. ఫలితంగా కన్నడ సీమ కాంగ్రెస్ హస్తగతమైంది. హంగ్ ఊహాగానాలకు, హోరా హోరీ తప్పదన్న విశ్లేషణలకు చెక్ పెడుతూ ఏకంగా 136 స్థానాలను కైవసం చేసుకుంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో సొంతంగా స్పష్టమైన మెజారిటీ సాధించింది. కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీపై విపక్షాల ఉమ్మడి పోరుకు నేతృత్వం వహించేందుకు నైతిక బలాన్ని కూడగట్టుకుంది. బీజేపీ కేవలం 65 స్థానాలకు పరిమితమై పరాజయం చవిచూసింది. 2018తో పోలిస్తే తగ్గింది కేవలం 0.2 శాతం ఓట్లే అయినా ఏకంగా 39 సీట్లు కోల్పోయింది! ఈ ఓటమితో దక్షిణాదిన ఏకైక రాష్ట్రం కూడా కమలం పార్టీ చేజారింది. ఇక ఇంటి పోరుతో చీకాకు పరిచిన జేడీ(ఎస్) కేవలం 19 సీట్లతో చతికిలపడింది. ఈ గెలుపుతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి. 6లో







సిద్ధు, శివకుమార్.. ఇద్దరిలో సీఎం ఎవరో!

- నేడు సీఎల్పీ భేటీలో ఎంపిక
- అధిష్టానానిదే తుది నిర్ణయం
- డీకేకు పెద్దల ఆశీస్సులు.. సిద్ధూకు పార్టీ నేతల మద్దతు

6లో



విద్వేషంపై ప్రేమ సాధించిన విజయమిది

విద్వేషంపై ప్రేమ విజయం సాధించిందని కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

కలసి ఉంటే కలదు జయం!

- ఎన్నికల్లో కలసికట్టుగా పోరాడి గెలిచిన కాంగ్రెస్
- కలిసొచ్చిన ఖర్గే అనుభవం.. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ దోస్తీ

- వివరాలు 6లో

వాడిపోయిన కమలం

- కర్ణాటకలో బీజేపీ ఓటమికి ఎన్నో కారణాలు..
- కాషాయ పార్టీ పట్ల దళితులు, ఆదివాసీలు, ఓబీసీల విముఖత

- వివరాలు 10లో

'కింగ్‌మేకర్' కలలు భగ్నం

- ఎన్నికల్లో చతికిలపడిన జేడీ(ఎస్)
- కేవలం 19 స్థానాలకు పరిమితం
- దెబ్బతీసిన దేవెగౌడ కుటుంబ వివాదాలు.. ఇద్దరే విజయం

- వివరాలు 10లో

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ రహితంగా తిరుమల



తిరుమలలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భక్తునిపైనా ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. తిరుమలను ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చడానికి టీటీడీ చేస్తున్న కృషిలో భక్తులంతా భాగస్వాములు కావాలని కోరారు.

వివరాలు 3లో ▸

పాక్ నుంచి జాలర్ల విడుదల



బతుకుదెరువు కోసం 2018లో ఏపీ నుంచి గుజరాత్‌కు చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల్లో 22 మంది, 2019లో మరొకరు అరేబియా సముద్రంలో పాకిస్తాన్ కోస్ట్‌గార్డ్‌కు చిక్కారు. ఆ తర్వాత సీఎం అయిన వైఎస్ జగన్ వీరి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురాగా.. పాక్ నుంచి 20 మందిని విడుదల చేశారు. తాజాగా మరో ముగ్గురికి కూడా విముక్తి లభించింది.

వివరాలు 14లో ▸

రుషికొండలో బ్లూ ఫ్లాగ్ రెపరెపలు



భారత్‌లో 12 బీచ్‌లకు అరుదైన గుర్తింపు లభించింది. అందులో ఏపీ నుంచి రుషికొండ బీచ్ ఎంపికయ్యింది. డెన్మార్క్‌కు చెందిన సంస్థ 33 అంశాలను పరిగణనలోకి తీసుకుని రుషికొండ బీచ్‌ను 'బ్లూఫ్లాగ్' జాబితాలో చేర్చింది.

వివరాలు 5లో ▸

రేపటి నుంచి ఈఏపీసెట్



ఏపీఈఏపీ సెట్ నిర్వహణకు ఉన్నత విద్యా మండలి ఏర్పాట్లు చేసింది. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ఈ నెల 15 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. 47 పట్టణాల్లో 136 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వివరాలు 14లో ▸



పవన్ శ్వాస, ధ్యాస బాబే

బాబు చేత.. బాబు వల్ల.. బాబు కోసం

చంద్రబాబు బాటలోనే పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం

టీడీపీ అధినేత ఆదేశిస్తే.. పవన్ ఆచరిస్తాడంతే

బాబుతో రాజకీయ వివాహ బంధానికి ప్లాట్‌ఫాం కావాలి

అందుకోసమే రైతుల పేరిట రెండు రోజుల పర్యటన

పదేళ్ల రాజకీయ జీవితమంతా బాబుకు జీ హుజూర్

ప్రజలు వాస్తవాలు గమనించాలని మంత్రి అంబటి బహిరంగ లేఖ



ఒక రాజకీయ పార్టీ ఎలా వ్యవహరించకూడదో చెప్పాలంటే 'జనసేన'ను మించిన ఉదాహరణ మరొకటి దొరకదు. ఒక నాయకుడు ఎలా ఉండకూడదో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను చూపిస్తే చాలు. ఎదగాలన్న కసి, లక్ష్యం ఏ కోశానా కనిపించవు. కేడర్‌ను కూడగట్టుకుని పార్టీని బలోపేతం చేద్దామన్న ఆలోచనే రాదు. టీడీపీని బలోపేతం చేయాలన్న తపన మాత్రం పవన్ ప్రతి అడుగులోనూ స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు-పవన్ కళ్యాణ్ బంధం ప్రేమ జంటను మరిపిస్తోంది. నాడు విడివిడిగా పోటీ చేసినా, నేడు కలిసి పోటీ చేయాలనుకుంటున్నా అంతిమ లక్ష్యం చంద్రబాబుకు మేలు జరగాలన్నదే. 'మాది వన్ సైడ్ లవ్' అంటూ మొన్న చంద్రబాబు బాధ పడిపోవడం చూడలేక పవన్ కళ్యాణ్.. అన్నీ వదిలేసి.. నమ్ముకున్న వారిని గంగలో ముంచి.. ఆయన వేలు పట్టుకుని నడవడానికి పడుతున్న పాట్లు చూస్తుంటే రాజకీయ విశ్లేషకులు సైతం విస్తుపోతూ ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు.. పవన్ కళ్యాణ్ తీరును తీవ్రంగా తప్పు పడుతూ, ఆయన ఎత్తులు, జిత్తులు గమనించాలని కోరుతూ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు.

పవన్ రాజకీయం చంద్రబాబు కోసమే..

- లేఖ పూర్తి పాఠం 4వ పేజీలో

విజయానికి చేయూత

స్వయం ఉపాధితో పెరిగిన అక్కచెల్లెమ్మల ఆత్మ గౌరవం

చేయూత, ఆసరా పథకాలతో పేద మహిళల బతుకుల్లో వెలుగు

- సొంత కాళ్లపై నిలదొక్కుకున్న 7.76 లక్షల మంది మహిళలు
- నగరాలు, పట్టణాల్లో చిరు వ్యాపారాలకు శ్రీకారం
- అదనపు రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తున్న మెప్మా
- పట్టణాల్లో 5,32,393 మంది చేయూత లబ్ధిదారులు
- వీరిలో 2,56,959 మంది స్వయం ఉపాధిలో రాణింపు
- 14,75,883 మంది ఆసరా లబ్ధిదారుల్లో 5,19,400 మంది చిరు వ్యాపారాలు
- ఈ విజయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చలవేనని లబ్ధిదారుల ఆనందం

సాక్షి గ్రాండ్ రిపోర్ట్



నర్సీపట్నంలో కిరాణా షాపు నడుపుకుంటున్నాం. మా ఇంట్లో నలుగురుంటారు. కుటుంబ పోషణకు ఈ దుకాణమే ఆధారం. గతంలో చాలీచాలని ఆదాయంతో ఇబ్బందులు పడేవాళ్లం. కరోనా సమయంలో వ్యాపారం చేయడానికే లేదు. బతుకు కష్టమే అనుకున్నాం. కానీ రాష్ట్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు రుణ సాయం అందించి ఆదుకుంది. గతంలో మాలాంటి వారికి ఎలాంటి సాయం ఉండేది కాదు. మైక్రో ఫైనాన్స్‌లో తీసుకున్న అప్పు చెల్లించలేక నరకం చూశాం. ఈ ప్రభుత్వంలో పథకాలు వరంలా ఆదుకుంటున్నాయి. మెప్మా అందించిన రుణ సాయంతో పాటు, చేయూత డబ్బులతో దుకాణాన్ని విస్తరించుకున్నాం. ఇప్పుడు రోజుకు రూ.800 నుంచి రూ.1000 ఆదాయం వస్తోంది. – కొల్లాన లక్ష్మి, నర్సీపట్నం

- వివరాలు 2లో

రొయ్యల కోసం రోబోటిక్

- సౌర విద్యుత్‌తో ఆక్వా చెరువుల్లో రొయ్యలకు మేత అందించేలా రూపకల్పన
- లో ఓల్టేజ్, హై ఓల్టేజ్ సమస్యల నుంచి రక్షించేలా ఆటోమేటిక్ స్టెబిలైజర్లు
- విద్యుత్ నష్టాలను తగ్గించే రియల్ టైమ్ లోడ్ మానిటరింగ్ వ్యవస్థ
- మొబైల్ ఫోన్‌తోనే ఆపరేట్ చేసేలా ప్రత్యేక యాప్
- భారతదేశంలోనే తొలి ఆక్వా రోబో తయారు చేయించిన ఆక్వా రైతు

సాక్షి, అమరావతి: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న ఓ ఆక్వా రైతు రొయ్యల పెంపకంలో రోబోను వినియోగిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని చినఅమిరం గ్రామానికి చెందిన వత్సవాయి లక్ష్మీకుమార్‌రాజు మద్రాస్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన ఆయన ఆ కొలువును వదిలి రొయ్యల సాగు చేపట్టారు. కృష్ణా జిల్లా నందివాడ మండలం అరిపిరాల గ్రామంలో దాదాపు 700 ఎకరాల్లో రొయ్యలను పెంచుతున్నారు. వాటికి ఆహారం అందించేందుకు ఆక్వా రోబో (బాట్)ను తయారు చేయించుకుని వినియోగిస్తున్నారు. ఇది సౌర విద్యుత్ తానే తయారు చేసుకుని పని చేస్తుంది. విద్యుత్ ఆదా కోసం అనేక సాంకేతిక విధానాలను, పరికరాలను వాడుతున్నారు. ఈ మొత్తం వ్యవస్థను ఒక ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా అరచేతిలోనే నడిపిస్తున్నారు. ఆక్వా రంగంలో భారతదేశంలోనే తొలి రోబో ఇదే కావడం విశేషం.

కూలీల అవసరం లేకుండానే..: చెరువులోని రొయ్యలకు మనుషులే ఆహారం (ఫీడింగ్)

మిగతా 2వ పేజీలో ▶



చెరువులో రొయ్యలకు మేత వేస్తున్న ఆక్వా రోబో(బాట్) మూవింగ్ ఫీడర్

రేపటి తరం కోసం 'మిషన్ లైఫ్'

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు
- ఏడు కేటగిరిల్లో కార్యక్రమాల నిర్వహణకు ఏపీ నోడల్ ఏజెన్సీగా 'ఏపీఎస్ఈసీఎం'
- బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవర్

13లో



పెట్టుబడి పెట్టు.. ఈబీ-5 వీసా పట్టు

అమెరికాలో కొనసాగేందుకు భారతీయుల తాజా మంత్రం

- కనీస పెట్టుబడి ఎనిమిది లక్షల యూఎస్ డాలర్లు
- ఎక్కువగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు
- ఈబీ-5 వీసాల్లో రెండోస్థానంలో భారతీయులు
- 2016 నుంచి 400 శాతం పెరిగిన ఈ వీసాల జారీ

14లో

క్లుప్తంగా...

16న నిజాంపట్నంలో సీఎం పర్యటన

- వైఎస్సార్ మత్స్యకార భరోసా సొమ్ము జమ
- వరుసగా ఐదో ఏడాది సాయం



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16వ తేదీన బాపట్ల జిల్లా నిజాంపట్నంలో పర్యటించనున్నారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఖాతాల్లో వేట నిషేధ భృతిని కంప్యూటర్‌లో బటన్ నొక్కి జమ చేయనున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి నిజాంపట్నం చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని, మత్స్యకార భరోసా లబ్ధిదారులకు నగదు జమ చేసిన తర్వాత తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. గత నాలుగేళ్ల మాదిరిగానే వరుసగా ఐదో ఏడాది కూడా వేటపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున సాయం అందిస్తున్నారు.

హైకోర్టుకు వేసవి సెలవులు

- 15 నుంచి జూన్ 12 వరకు
- అత్యవసర కేసుల విచారణకు వెకేషన్ కోర్టుల ఏర్పాటు

సాక్షి, అమరావతి: హైకోర్టుకు ఈనెల 15 నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. హైకోర్టు కార్యకలాపాలు తిరిగి జూన్ 13న ప్రారంభమవుతాయి. ఈ సెలవుల్లో అత్యవసర కేసుల విచారణ నిమిత్తం వెకేషన్ కోర్టులు ఏర్పాటయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటుచేశారు. రెండు దశల్లో ఈ వెకేషన్ కోర్టులు పనిచేస్తాయి. హైబ్రిడ్ (భౌతిక, ఆన్‌లైన్) విధానంలో కేసులను విచారిస్తారు. మొదటి దశ వెకేషన్ కోర్టులు మే 16 నుంచి 26 వరకు పనిచేస్తాయి. రెండో దశ కోర్టులు మే 27 నుంచి జూన్ 12 వరకు పని చేస్తాయి. ఈ వెకేషన్ కోర్టుల్లో హెబియస్ కార్పస్ పిటిషన్లు, బెయిల్, ముందస్తు బెయిల్ పిటిషన్లు, సెలవులు పూర్తయ్యేంత వరకు వేచి చూడలేనటువంటి అత్యవసర వ్యాజ్యాలు మాత్రమే దాఖలు చేయాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టంచేసింది. అలాగే, సర్వీసు సంబంధిత కేసులు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చట్టానికి సంబంధించిన కేసులను అత్యవసరం అయితే తప్ప విచారించబోమని పేర్కొంది. అలాగే, సీఆర్‌పీసీ సెక్షన్ 482, అధికరణ 226 కింద ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లను కొట్టేయాలంటూ దాఖలుచేసే వ్యాజ్యాలను ఈ వేసవి సెలవుల్లో విచారించబోమని తెలిపింది.

వెకేషన్ కోర్టుల్లో జడ్జిలు వీరే..

ఇక మొదటి దశ వెకేషన్ కోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఉంటారు. ఇందులో జస్టిస్ భానుమతి, జస్టిస్ రవీంద్రబాబు ధర్మాసనంలో.. జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ సింగిల్ జడ్జిగా కేసులను విచారిస్తారు. మొదటి వెకేషన్ కోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేయాలనుకునే వారు మే 16వ తేదీన దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తులు మే 18న విచారణ జరుపుతారు. అలాగే, మే 30న వ్యాజ్యాలు దాఖలు చేస్తే జూన్ 1న విచారణ ఉంటుంది. జూన్ 6న పిటిషన్లు దాఖలు చేస్తే వాటిపై న్యాయమూర్తులు జూన్ 8న విచారణ జరుపుతారు. రెండో వెకేషన్ కోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జస్టిస్ దుప్పల వెంకటరమణ, జస్టిస్ వి.గోపాలకృష్ణరావు ఉంటారు. ఇందులో జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ గోపాలకృష్ణరావు ధర్మాసనంలో.. జస్టిస్ దుప్పల వెంకటరమణ సింగిల్ జడ్జిగా కేసులను విచారిస్తారు. జూన్ 8న విచారణ జరిపే ధర్మాసనానికి న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య నేతృత్వం వహిస్తారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై. లక్ష్మణరావు నోటిఫికేషన్ జారీచేశారు.

లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసుల పరిష్కారం

రాష్ట్రవ్యాప్తంగా 94,179, హైకోర్టులో 89 కేసులు

సాక్షి, అమరావతి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లలో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. ఈ అదాలత్‌లలో 94,179 కేసులను పరిష్కరించి, రూ.47.53 కోట్లు పరిహారం అందజేశారు. మొత్తం 94,179 కేసుల్లో 83,576 పెండింగ్ కేసులు కాగా, 10,603 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో ఉన్న అన్ని న్యాయస్థానాల్లో 369 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టులో కూడా లోక్ అదాలత్ జరిగింది. న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ బి.శ్యాంప్రసాద్‌లు బెంచ్‌లను నిర్వహించారు. వారు 89 కేసులు పరిష్కరించి, రూ.3.61 కోట్లు పరిహారంగా అందజేశారు. ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ ఏవీ శేషసాయి మార్గదర్శకత్వంలో లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించామని న్యాయ సేవాధికారసంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులకు, కక్షిదారులకు, ఇతర అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

అడవి ఒడిలోకి.. పులి పిల్లలు



ఆత్మకూరు ప్రాంతంలో ఇన్‌సిటు ఎన్‌క్లోజర్ ఏర్పాటుకు నిర్ణయం

- త్వరలో అందులోకి వాటిని వదిలేందుకు ప్రణాళిక
- ఎన్‌క్లోజర్‌లో అవి జంతువుల్ని వేటాడితే పూర్తిగా అడవిలోకి వదిలే అవకాశం
- పులి పిల్లల కోసం భారీ ఆపరేషన్ చేపట్టనున్న అటవీ శాఖ
- ఇలాంటి ఎన్‌క్లోజర్‌లున్న బాంధవ్‌గఢ్, కన్హా టైగర్ రిజర్వులను పరిశీలించిన అధికారులు

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ ప్రాంతంలో రెండునెలల క్రితం తల్లి నుంచి వేరుపడి దొరికిన పులి పిల్లల్ని తిరిగి అడవిలో వదిలేందుకు రాష్ట్ర అటవీ శాఖ భారీ ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర జూపార్క్‌లో ఆ నాలుగు పులి పిల్లల్ని ఉంచి సంరక్షిస్తున్నారు. ఎన్‌టీసీఏ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) మార్గదర్శకాల ప్రకారం.. ప్రస్తుతం వాటికి ఆహారం అందించడంతోపాటు శిక్షణ ఇస్తున్నారు. వాటిని ఏడాదిన్నరలోపు తిరిగి అడవిలోకి పంపాల్సి వుంది. దీనికిముందు వాటిని అడవిలో సహజంగా జీవించే పులుల్లా తయారుచేసేందుకు అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. ఇలా అడవి నుంచి బయటకు వచ్చిన పులి పిల్లల్ని తిరిగి అడవిలోకి పంపిన అనుభవం ఉన్న మధ్యప్రదేశ్‌లోని కన్హా, బాంధవ్‌గఢ్ టైగర్ రిజర్వులను తిరుపతి జూ క్యూరేటర్ సెల్వం, ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాజెక్టు) ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ మరికొందరు అధికారుల బృందం పరిశీలించి వచ్చింది. కన్హా రిజర్వులో 36 హెక్టార్లు, బాంధవ్‌గఢ్ రిజర్వులో 26 హెక్టార్లలో ఇన్‌సిటు ఎన్‌క్లోజర్‌లు ఏర్పాటుచేసి తప్పిపోయి దొరికిన పులి పిల్లలకు శిక్షణ ఇచ్చారు. ఆత్మకూరు ప్రాంతంలోని నల్లమల అడవిలోనే ఇలాంటి ఎన్‌క్లోజర్ ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. ఎన్‌క్లోజర్ ఎలా వేశారు, ఎలా నిర్వహించారు, ఎంత ఖర్చయింది, అలాంటి ఎన్‌క్లోజర్‌ను ఇక్కడ ఏర్పాటుచేయడానికి ఏం చేయాలనే దానిపై ఈ బృందం ప్రభుత్వానికి ఒక నివేదిక ఇవ్వనుంది. దాన్నిబట్టి త్వరలో ఎన్‌క్లోజర్ ఏర్పాటుచేయనున్నారు.

50 జంతువుల్ని వేటాడి తింటేనే పూర్తిగా అడవిలోకి..

ఆత్మకూరు అటవీ ప్రాంతంలో వంద హెక్టార్లలో నాలుగు పులి పిల్లల కోసం ఇన్‌సిటు ఎన్‌క్లోజర్ ఏర్పాటుచేయనున్నారు. నీటి వసతి బాగా ఉండి, వేటాడేందుకు అనువైన జంతువులున్న చోటును అన్వేషిస్తున్నారు. ఆ చోటును గుర్తించిన తర్వాత అక్కడ ఎన్‌క్లోజర్ ఏర్పాటుచేసి 2, 3 నెలల్లో వాటిని అందులోకి వదిలిపెట్టాలని భావిస్తున్నారు. ఎన్‌క్లోజర్‌ను మూడు భాగాలుగా ఏర్పాటుచేయాలని చూస్తున్నారు. మొదట నర్సరీ ఎన్‌క్లోజర్‌లో ఉంచి చిన్న జంతువుల్ని వేటాడే అవకాశం కల్పించాలని, ఆ తర్వాత దశల్లో చిన్న, పెద్ద ఎన్‌క్లోజర్లలో కొద్దిగా పెద్ద జంతువుల్ని వేటాడేలా చేయాలనేది ప్రణాళిక. అదే సమయంలో అడవిలో ఎలుగుబంట్లు, ఇతర జంతువుల బారిన అవి పడకుండా కూడా జాగ్రత్త తీసుకోవాల్సి వుంటుంది. పులి పిల్లలు ఏడాదిన్నరలో ఈ ఎన్‌క్లోజర్లలో కనీసం 50 జంతువుల్ని చంపి తింటే వాటికి వేట వచ్చినట్లు నిర్ధారించుకుని అడవిలోకి వదిలేస్తారు. జంతువుల్ని చంపలేకపోతే వాటిని తిరిగి జూకి తరలిస్తారు. సాధారణంగా ఈ వేటను తల్లి పులులు పిల్లలకి నేర్పుతాయి. కానీ, ఆ పనిని ఇప్పుడు అటవీ శాఖ చేస్తోంది. ఈ పనిని బాంధవ్‌గఢ్ టైగర్ రిజర్వులో విజయవంతంగా చేయడంతో అక్కడికెళ్లి అధ్యయనం చేశారు. అక్కడిలాగే నల్లమలలో ఇన్‌సిటు ఎన్‌క్లోజర్‌లు తయారుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం భారీగా ఖర్చయ్యే పరిస్థితి ఉండడంతో అందుకోసం ఓ దాతను ఒప్పించారు. ఈ ఖర్చును భరించేందుకు ఆ దాత ముందుకు రావడంతో త్వరలో ఎస్వీ జూపార్క్‌లో పెరుగుతున్న పులి పిల్లలు నల్లమలలో ఇన్‌సిటు ఎన్‌క్లోజర్‌లోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు.. జూపార్క్‌లోని నాలుగు ఆడ పులి పిల్లలు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాయి. మూడు కేజీల బరువు ఉన్నప్పుడు దొరికిన వాటి బరువు ఇప్పుడు 14–15 కేజీలకు పెరిగినట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు.

అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నాం

పులి పిల్లల్ని తిరిగి అడవిలోకి పంపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నాం. త్వరలో ఇన్‌సిటు ఎన్‌క్లోజర్ ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నాం. అందులో పులి పిల్లలు వేటాడితే అడవిలో వదులుతాం. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని కావడంతోపాటు మనం ఇంతకుముందు ఎప్పుడూ చేయని పని. అందుకే అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, పీసీసీఎఫ్, ఏపీ అటవీ శాఖ

గగన్‌యాన్.. క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం
ఆపరేషన్ విజయవంతం



మహేంద్రగిరిలో గగన్‌యాన్ క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం ఆపరేషన్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వచ్చే ఏడాది చివరి నాటికి గగన్‌యాన్ ప్రయోగాన్ని నిర్వహించాలని భావిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రపొల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ)లో క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టం ఆపరేషన్‌ను శనివారం విజయవంతంగా నిర్వహించింది. ఈ మేరకు ఇస్రో శనివారం తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. క్రూమాడ్యూల్ సిస్టంను 602.94 సెకన్లపాటు మండించి పరీక్షించారు. ఈ పరీక్ష సమయంలో క్రూమాడ్యూల్‌లోని పారామీటర్లు అన్నీ శాస్త్రవేత్తలు ఊహించిన విధంగా పనిచేశాయి. దీంతో గగన్‌యాన్ ప్రయోగానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లైంది. క్రూమాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టంలో భాగంగా మొత్తం 14 రకాల పరీక్షలను నిర్వహించారు. వీటిని విజయవంతంగా పరీక్షించడంతో గత కొన్నేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న గగన్‌యాన్ ప్రయోగానికి ఇస్రో సన్నద్ధమవుతోంది. అయితే ముందుగా రెండు, మూడుసార్లు మానవ రహిత గగన్‌యాన్ ప్రయోగాన్ని నిర్వహించాకే మానవ సహిత ప్రయోగానికి సిద్ధమవుతామని ఇస్రో పేర్కొంది. ఇందులో భాగంగా పలు రకాల పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

తోకముడిచిన టీడీపీ అధికార ప్రతినిధి

- మార్గదర్శి అక్రమాలపై చర్చకు రాలేనన్న జీవీ రెడ్డి
- ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు మెసేజ్
- అభాసుపాలవుతాననే భయమే కారణం!

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో రామోజీరావు చేసిన అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన టీడీపీ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి తోకముడిచారు. ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో చర్చకు రాలేనంటూ చేతులెత్తేశారు. ఈ మేరకు ఉండవల్లికి మెసేజ్ పంపారు.

మార్గదర్శి చిట్స్ బ్రాంచిల్లో అనేక అవకతవకలు బయట పడటంతో సీఐడీ అధికారులు ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్‌ను విచారించిన విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి మీడియా సమావేశం పెట్టి మార్గదర్శిలో అక్రమాలు లేవని, దీనిపై తాను ఎక్కడైనా, ఎవరితోనైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మార్గదర్శి అక్రమాలపై సుదీర్ఘకాలం నుంచి పోరాటం చేస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆయన సవాల్‌ను స్వీకరించారు. రామోజీ ఫిల్మ్ సిటీలోగానీ, హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయంలోగానీ రామోజీరావు సమక్షంలో ఈ చర్చను ఏర్పాటు చేయడం సాధ్యమేనా అని ప్రతి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఆదివారం చర్చ జరగాల్సి ఉంది. కానీ ఈ చర్చకు రాలేకపోతున్నట్లు జీవీ రెడ్డి చల్లగా జారుకున్నారు. తీరిక లేని పనుల కారణంగా తాను చర్చలో పాల్గొనే అవకాశం లేదని ఉండవల్లికి మెసేజ్ పంపారు. ఆర్భాటంగా సవాల్ విసిరిన జీవీ రెడ్డి చర్చలో పాల్గొనే సమయానికి వెనక్కి తగ్గడానికి అభాసుపాలవుతాననే భయమే కారణమని స్పష్టమవుతోంది.

వచ్చే 3 రోజులు ఎండ మంటే

- పలు జిల్లాల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
- తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం
- ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిక



సాక్షి, అమరావతి: వచ్చే 3 రోజులు రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే పలుచోట్ల సాధారణ ఉష్ణోగ్రతలకంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం నుంచి ఎండ తీవ్రత ఇంకా పెరగనుంది. ఆదివారం కోస్తా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలోని 136 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 173 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం నంద్యాల జిల్లా గోస్పాడులో అత్యధికంగా 42.2, తూర్పుగోదావరి జిల్లా నందరాడ, ముగ్గళ్లలో 41.9, బాపట్ల జిల్లా అమృతలూరులో 41.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

అత్యంత తీవ్ర తుపానుగా 'మోకా'!

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అతి తీవ్ర తుపాను అత్యంత తీవ్ర తుపానుగా బలపడింది. ప్రస్తుతం ఇది గంటకు 22 కిలోమీటర్ల వేగంతో ఉత్తర ఈశాన్య దిశగా కదులుతోంది. శనివారం రాత్రికి పోర్టుబ్లెయిర్‌కు వాయవ్యంగా 610 కి.మీలు, బంగ్లాదేశ్‌లోని కాక్స్‌బజార్‌కు దక్షిణ నైరుతి దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్య దిశగా పయనిస్తూ కాక్స్‌బజార్ (బంగ్లాదేశ్) – క్యాక్‌ప్యూ(మయన్మార్)ల మధ్య సిట్‌వే వద్ద ఆదివారం మధ్యాహ్నం అత్యంత తీవ్ర తుపానుగా తీరాన్ని దాటనుంది. ఆ సమయంలో గరిష్ఠంగా గంటకు 210 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ శనివారం రాత్రి ప్రత్యేక బులెటిన్‌లో వెల్లడించింది.

రొయ్యల కోసం రోబోటిక్

▶ మొదటి పేజీ తరువాయి

అందించడం సర్వసాధారణంగా జరుగుతుంటుంది. అది అనేక ఇబ్బందులతో కూడుకోవడంతోపాటు ఆహారం సకాలంలో అందేది కాదు. దీంతో మార్కెట్‌లో ఆటోమేటిక్ ఫీడర్ల కోసం వెతికారు. కానీ.. అవి కూడా ఒకేచోట ఫీడింగ్ చేసేవి. దానివల్ల రొయ్యలన్నిటికీ ఆహారం సమానంగా అందేది కాదు. దీంతో చెరువు మొత్తం తిరిగేలా యంత్రాన్ని తయారు చేస్తే బాగుంటుందనే ఆలోచనకు వచ్చారు లక్ష్మీకుమార్‌రాజు. నెక్ట్ ఆక్వా సంస్థతో తన ఆలోచనను పంచుకున్నారు. ఆ సంస్థ ఐఐటీ గ్రాడ్యుయేట్లతో ఏర్పాటైంది. వారికి ఈ ఆలోచన నచ్చి నాలుగేళ్ల పాటు అరిపిరాలలోనే ఉండి పరిశోధన చేశారు. రకరకాల ప్రయత్నాల తరువాత చివరకు మూవింగ్ రోబోను తయారు చేశారు. చెరువులో తాడుతో (గైడెడ్) లైన్‌లా కట్టి దాని సాయంతో రెండేళ్లుగా ఈ రోబోను నడుపుతున్నారు. దీని ఆపరేటింగ్ మొత్తం మొబైల్‌తోనే జరుగుతుంది. ఎన్ని కేజీల ఆహారం.. ఏ సమయంలో.. ఎన్నిసార్లు అందించాలనేది ముందుగానే ప్రోగ్రామింగ్ చేసుకోవచ్చు. దాని ప్రకారం కచ్చితంగా అంతే ఆహారాన్ని ఆయా సమయాల్లో ఈ రోబో రొయ్యలకు అందిస్తుంది. ముఖ్యంగా ఈ రోబోకి అవసరమైన విద్యుత్‌ను దానిపైనే అమర్చిన సౌర పలకల ద్వారా తానే తయారు చేసుకుంటుంది.

క్షణక్షణం.. అప్రమత్తం

కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ (సీటీ) లేదా పవర్ మానిటర్ (బ్లాక్ బాక్స్)అనే పరికరంతో విద్యుత్ సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. ఇది ఆటోమేటిక్ పవర్ ఫ్యాక్టర్ కంట్రోలర్‌గా పనిచేస్తూ విద్యుత్ నష్టాలను, విద్యుత్ బిల్లులను తగ్గిస్తుంది. ఎన్ని ఏరియేటర్స్ (రొయ్యలకు ఆక్సిజన్ అందించే పరికరాలు) పని చేస్తున్నాయనేది నిరంతరం చూస్తుంటుంది. ఏరియేటర్స్ ఆగితే వెంటనే చెబుతుంది. మూడు మొబైల్ నంబర్లకు ఫోన్ అలర్ట్ వెళ్లిపోతుంది. నిజానికి ప్రతి పరిశ్రమలో ఆటోమేటిక్ పవర్ ఫ్యాక్టర్ కంట్రోలర్స్ వాడుతుంటారు. వీటిని ఆక్వాలో వాడటం అనేది చాలా అరుదు. మోటార్లు ఆగిపోతే వెంటనే సరిచేసి ఆన్ చేయాలి. లేదంటే రొయ్యలు చనిపోతాయి. ఇందుకోసం రైతులు రాత్రివేళల్లో చెరువుల వద్ద కాపలాగా పడుకోవాల్సి వస్తోంది. అలాంటి సమయంలో విద్యుత్ ప్రమాదాల బారినపడి రైతులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరుగుతున్నాయి. ఈ సమస్యలను పవర్ మానిటర్ తీరుస్తోంది. ఎన్ని ఏరియేటర్స్ ఆన్ చేస్తే అన్నే కెపాసిటర్లు ఆన్ అయ్యేలా చూస్తుంది. అవి ఆగిపోతే కెపాసిటర్లను ఆపేస్తుంది. జనరేటర్ పనితీరును కూడా ఇది పర్యవేక్షిస్తుంది. దీనివల్ల డీజిల్ దొంగతనాన్ని అరికట్టవచ్చు. స్మార్ట్ స్టార్టర్ కంట్రోలర్ అనే పరికరం ద్వారా మొబైల్‌తోనే ఏరియేటర్స్‌ని ఆన్ చేయవచ్చు. అవి ఎంతసేపు పనిచేయాలనేది ప్రోగ్రామింగ్ చేసుకోవచ్చు. సాంకేతిక సమస్య ఏదైనా ఏర్పడితే మొబైల్‌కి సమాచారం వచ్చేస్తుంది. ఇలా చేయడం వల్ల మోటారు కాలిపోకుండా కాపాడుతుంది.

విద్యుత్ బిల్లులు ఆదా




విద్యుత్ వ్యవస్థకు సాంకేతికతను జోడించి మా చెరువుల్లో వినియోగిస్తున్నాం. పర్యావరణ హితం కోరి 15 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను వాడుతున్నాం. పవర్ మాంక్స్ సాఫ్ట్‌వేర్ ద్వారా చెరువుల మొత్తం ఎంత విద్యుత్ వినియోగం జరుగుతోంది, సరఫరా ఎలా ఉంది, ఎక్కడైనా సాంకేతిక, భౌతిక ఇబ్బందులు ఉన్నాయా అనేది రియల్ టైమ్ (ఎప్పటికప్పుడు) సమాచారాన్ని టీవీ (మానిటర్)లో కనిపించేలా సెన్సార్లు ఏర్పాటు చేశాం. దీనివల్ల 95 శాతం కంటే ఎక్కువగా విద్యుత్ వినియోగం సక్రమంగా జరుగుతోంది. ప్రతి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై నెలకు కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ విద్యుత్ ఆదా అవుతోంది.

– వత్సవాయి లక్ష్మీకుమార్‌రాజు, ఆక్వా రైతు

విజయానికి చేయూత



నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని పెద బొడ్డేపల్లికి చెందిన బంగారు లక్ష్మికి భర్త లేడు. తన ఇద్దరు పిల్లలను పెంచేందుకు ఎన్నో కష్టాలు పడింది. బతుకుదెరువు కోసం ఇల్లిల్లూ తిరిగి కూరగాయలు అమ్ముకున్నా పెద్దగా ఫలితం లేకపోయింది. జగనన్న ఇచ్చిన చేయూత పథకం సొమ్ము రూ.18,750కి తోడు కొంత పొదుపు రుణం తీసుకుని ఇంటి వద్దే కిరణా దుకాణం ప్రారంభించింది. మెప్మా ఇచ్చిన ప్రోత్సాహంతో ఇప్పుడు రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు సంపాదిస్తోంది.



నర్సీపట్నంలో ఉంటున్న పెదపూడి అరుణకుమారి, లక్ష్మి తోడికోడళ్లు. వీరి భర్తలు ఎన్నో ఏళ్లుగా రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు తయారు చేస్తుంటారు. ప్రభుత్వం వీరికి చేయూత, ఆసరా, రైతు భరోసా కింద ఇచ్చిన నగదును వర్క్‌షాప్‌లో పెట్టుబడిగా పెట్టారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న వీరికి బ్యాంకు రూ.5 లక్షలు రుణంగా మంజూరు చేసింది. పొదుపు నుంచి కొంత మొత్తం అప్పుగా తీసుకున్న వీరు వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. 'మా పని రైతులతో ముడిపడింది. ఆర్డరు రాగానే డబ్బులు ఇవ్వరు.. ముందు పెట్టుబడి పెట్టాలి. అందుకు ప్రభుత్వం ఇచ్చిన సాయం ఉపయోగపడింది. ప్రభుత్వం నుంచి ఇంతగా సాయం గతంలో ఎప్పుడూ అందలేదు' అని తెలిపారు. ఇలా ఒక్క నర్సీపట్నంలోనే ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందినవారు 10,071 మంది ఉంటే, వారిలో 4,067 మంది చిరు వ్యాపారాలతో ఉపాధి పొందుతున్నారు.

విశాఖ, నర్సీపట్నం నుంచి నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి:

అసలే పట్టణాలు.. ఆపై అదనపు ఖర్చులు.. ఇంట్లో ఇద్దరు ముగ్గురు సంపాదిస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి.. ప్రతి ఖర్చుకు ఓ లెక్క.. అవసరమైన వస్తువు కొనాలంటే మరో అవసరాన్ని వాయిదా వేసుకోవాలి.. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తూ అడుగులు ముందుకు వేశారు. ఇందులో భాగంగా అమలు చేస్తున్న 'వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా' పథకాలను మహిళా లబ్ధిదారులు సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వం 'చేయూత'గా ఇస్తున్న రూ.18,750కు తోడు, పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్నారు. వయసు పైబడిందని, కుటుంబానికి భారంగా మారామని కుంగిపోతున్న మహిళలు సైతం ఇప్పుడు సంపాదన మార్గంలో పయనిస్తున్నారు. దాంతో సగటున ఒక్కో మహిళ నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేలకు పైగా సంపాదిస్తోంది. పెద్ద చదువులు లేకపోయినా తోచిన చిరు వ్యాపారం చేస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇప్పుడా మహిళల కళ్లల్లో కుటుంబానికి అండగా నిలబడగలిగామన్న సంతృప్తి కనిపిస్తోంది. ఒక్క గ్రేటర్ విశాఖపట్నంలో చేయూత, ఆసరా లబ్ధిదారులు 2,83,440 మంది ఉంటే, వారిలో 90,491 మంది ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో స్వయం ఉపాధి మార్గాల ద్వారా కుటుంబానికి అండగా ఉన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో మారిన రాతలు

రాష్ట్ర ప్రభుత్వం 45 ఏళ్లు దాటిన పేద మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 ఆర్థిక సాయం అందిస్తోంది. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఈ తరహా ఆర్థిక సాయం పొందిన మహిళలు 5,32,393 మంది ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.998,23,68,750 చొప్పున మూడేళ్లలో దాదాపు రూ.3 వేల కోట్ల సాయం అందించింది. 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా సంఘాల్లోని మహిళలు చెల్లించాల్సిన బ్యాంకు అప్పును ప్రభుత్వమే చెల్లిస్తుందని ఇచ్చిన హామీ మేరకు ఆ సాయాన్ని 'ఆసరా' రూపంలో చెల్లిస్తున్నారు. ఇలా పట్టణ ప్రాంతాల్లోని 1,54,921 స్వయం సహాయక సంఘాల్లో 14,75,883 మందికి గత మూడేళ్లల్లో రూ.3,300 కోట్లు చెల్లించారు. పట్టణ ప్రాంతాల్లోని మొత్తం 20,08,276 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) అధికారులు స్థానిక యూఎల్బీలో స్వయం ఉపాధి మార్గాలపై సదస్సులు, సమావేశాలు నిర్వహించారు. ఆసక్తి గల వారికి వ్యాపార నిర్వహణ, స్వయం ఉపాధి మార్గాలపై శిక్షణనిచ్చారు. అవసరమైన వారికి మెప్మా రుణాలు ఇప్పించింది. ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో 2,56,959 మంది, ఆసరా లబ్ధిదారుల్లో 5,19,400 మంది మొత్తం 7,76,359 మంది చిరు వ్యాపారాలు, స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకున్నారు. సమర్థవంతమైన సీఎం జగన్ పాలన వల్లే అక్కచెల్లెమ్మలు ఈ విజయం సాధించారని, ఆర్థికంగా నిలదొక్కుకుని తల రాతలు మార్చుకున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

జగనన్న చలవతో నిలదొక్కుకున్నా



నా భర్త చనిపోయాడు. ఉన్న ఒక్క బిడ్డను పోషించుకునేందుకు నాకు వచ్చిన టైలరింగ్‌ను వృత్తిగా ఎంచుకున్నాను. ఆర్డర్లు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో 'చేయూత' వరంగా మారింది. వచ్చిన రూ.18,750కు తోడు మెప్మా రుణం తీసుకుని ఎస్‌పీడీ సెంటర్‌లో పళ్ల దుకాణం ఏర్పాటు చేసుకున్నా. ఈ వ్యాపారంలో రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు ఆదాయం వస్తోంది. నా కాళ్లమీద బతకగలనన్న భరోసా కలిగింది. వ్యాపారాన్ని ఇంకా విస్తరిస్తాననే నమ్మకం ఉంది. ఇదంతా జగనన్న చలవే.

– మళ్ల అన్నపూర్ణ, ఎస్‌పీడీ గౌరీనగర్, విశాఖపట్నం

ఆత్మవిశ్వాసం పెరిగింది



గతంలో నేను కూలి పనులకు వెళ్లేదాన్ని. ఇప్పుడు సత్తువ తగ్గిపోయింది. పనులకు పిలవడం లేదు. కుటుంబానికి భారం అవుతాననుకున్నాను. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. చేయూత డబ్బులతో రోడ్డు పక్కన కూరగాయల దుకాణం ఏర్పాటు చేసుకున్నా. ఇప్పుడు నేను రోజూ రూ.400 సంపాదిస్తున్నా. ఎంతో ఆత్మవిశ్వాసంగా ఉన్నా. ఇదంతా జగనన్న ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహమే.

– కరణం లక్ష్మి, ఎస్‌పీడీ గౌరీనగర్, విశాఖపట్నం

కేరళలో రూ.12 వేల కోట్ల డ్రగ్స్ పట్టివేత

కొచ్చిన్: భారత సముద్ర జలాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.12 వేల కోట్ల విలువైన సుమారు 2,500 కిలోల మెథాంఫెటమైన్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బోర్డ్(ఎన్‌సీబీ) స్వాధీనం చేసుకుంది. కేరళ తీరంలోని భారత సముద్ర జలాల్లో సంచరిస్తున్న ఓ ఓడ నుంచి ఈ మత్తు పదార్థం ఉన్న 134 సంచులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌సీబీ డిప్యూటీ డైరెక్టర్(ఆపరేషన్స్) సంజయ్ కుమార్ సింగ్ శనివారం మీడియాకు తెలిపారు. అఫ్గానిస్తాన్ నుంచి అక్రమంగా తరలించే డ్రగ్స్‌ను పట్టుకునేందుకు ఆపరేషన్ సముద్రగుప్త్ పేరుతో నేవీ, ఎన్‌సీబీ కలిసి చేపట్టిన ఆపరేషన్‌లో ఒక పాకిస్తానీని అదుపులోకి తీసుకున్నామన్నారు. అఫ్గానిస్తాన్ నుంచి డ్రగ్స్‌తో బయలుదేరిన భారీ ఓడ ఒకటి మక్రాన్ తీరం వెంబడి పాక్, ఇరాన్‌ల మీదుగా డ్రగ్స్‌ను చిన్న పడవల్లోకి పంపిణీ చేసుకుంటూ వస్తోందని చెప్పారు. మట్టన్‌చెర్రీ వద్ద ఈ ఓడను అడ్డగించినట్లు వెల్లడించారు. భారత్, శ్రీలంక, మాల్దీవులకు డ్రగ్స్‌ను చేరవేయడమే స్మగ్లర్ల లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు 3,200 కిలోల మెథాంపెటమైన్, 500 కిలోల హెరాయిన్, 529 కిలోల హషీష్‌ను పట్టుకున్నట్లు తెలిపారు.

ఉక్రెయిన్‌కు జర్మనీ భారీ సాయం

బెర్లిన్: ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు, విమాన విధ్వంసక వ్యవస్థలు, మందుగుండు సామగ్రి సహా సుమారు రూ.24 వేల కోట్ల విలువైన అదనపు సైనిక సాయం అందించాలని జర్మనీ నిర్ణయించింది. ఉక్రెయిన్‌కు మద్దతు విషయంలో తాము నిజాయితీతో ఉన్నామని రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ తెలిపారు. రష్యాతో యుద్ధం మొదలయ్యాక మొట్ట మొదటిసారిగా జెలెన్‌స్కీ ఆదివారం జర్మనీకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ క్రమంలోనే జర్మనీ తాజా నిర్ణయం వెలువరించడం గమనార్హం. రష్యా ఇంధనంపై ఆధారపడిన జర్మనీని ఉక్రెయిన్ మొదటి నుంచి అనుమానిస్తోంది. అయితే, ఏంజెలా మెర్కెల్ స్థానంలో ఒలాఫ్ షోల్జ్ చాన్సెలర్‌గా బాధ్యతలు చేపట్టాక ఉక్రెయిన్–జర్మనీల మధ్య సంబంధాలు బలపడుతూ వస్తున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు ప్రస్తుతం ఇటలీలో ఉన్నారు.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌తో మారిటైం వర్సిటీ ఎంవోయూ

రూ.20 కోట్లతో డ్రెడ్జర్ సిమ్యులేటర్స్ ఏర్పాటు



ఎంవోయూలు మార్చుకుంటున్న ఐఎంయూ డీన్ శివకోలుండ్, డీసీఐ ఎండీ కెప్టెన్ దివాకర్

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ మారిటైం యూనివర్సిటీ(ఐఎంయూ), డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ), సాగరమాల సంయుక్తంగా విశాఖ క్యాంపస్‌లో రెండు డ్రెడ్జర్ సిమ్యులేటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఐఎంయూ డీన్, డైరెక్టర్ శివ కోలుండ్ తెలిపారు. తమ విద్యార్థులకు శిక్షణ, ఇతర పరస్పర ఆసక్తి ఉన్న రంగాలకు సంబంధించిన కోర్సులను అందించేందుకు ఐఎంయూ వైజాగ్, డీసీఐలు శనివారం పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ డ్రెడ్జింగ్ కోర్సులు, ట్రైనీల కోసం అవసరమైన డ్రెడ్జ్ సిమ్యులేటర్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఐఎంయూలో హైడ్రోగ్రాఫిక్ సర్వే కోర్సును కూడా ప్రారంభిస్తామని తెలిపారు. డీసీఐ ఎండీ కెప్టెన్ దివాకర్ మాట్లాడుతూ ఐఎంయూ ప్రవేశపెడుతున్న కోర్సులు డ్రెడ్జింగ్ పరిశ్రమకు అత్యవసరమన్నారు. ఎంవోయూలో భాగంగా రెండు డ్రెడ్జర్ సిమ్యులేటర్స్ ఇన్‌స్టాల్ చేసేందుకు స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఒక్కో సిమ్యులేటర్ రూ.10 కోట్లు చొప్పున రూ.20కోట్లు సాగరమాల నిధులు వెచ్చించే దిశగా కృషి చేస్తున్నామని వివరించారు.

లైంగిక వేధింపుల కేసులో ఐదుగురు ఉపాధ్యాయులకు రిమాండ్

రాజవొమ్మంగి (అల్లూరి సీతారామరాజు జిల్లా): విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఐదుగురు ఉపాధ్యాయులను అరెస్టు చేసినట్లు జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. వీరిని శనివారం అడ్డతీగల జేఎఫ్‌ఎం కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు. జడ్డంగి ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థినులను ఉపాధ్యాయులు చదల సన్యాసిరెడ్డి, గుమ్మిడి నాగరాజు, పల్లాల గోపాలరావు, మఠం శాంతిబాబు, జీడెం సత్యనారాయణలు లైంగికంగా వేధించేవారు. విద్యార్థినుల వాంగ్మూలం ఆధారంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ సమగ్ర విచారణకు ఆదేశించారు. లైంగిక వేధింపులు వాస్తవమని తేలడంతో డీఈవో సలీంబాషా ఐదుగురిని సస్పెండ్ చేశారు. పోలీసులు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు.

‘ఎంబీబీఎస్’ విద్యార్థులకు ఆఖరి అవకాశం

ఫస్టియర్ పరీక్షలు రాసేందుకు ఐదోసారి చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ బ్యాక్‌లాగ్ పరీక్షలు రాసేందుకు జాతీయ వైద్య మండలి 2019–20 బ్యాచ్ విద్యార్థులకు ప్రత్యేక అనుమతి (మెర్సీ అటెంప్ట్) ఇచ్చింది. దీంతో 2019–20 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాసేందుకు చివరి అవకాశం దక్కినట్టైంది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన వినతులు, కోవిడ్–19 నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకున్న జాతీయ వైద్య మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈమేరకు జాతీయ వైద్య మండలి కార్యదర్శి పుల్కేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

• తెలంగాణ

హైదరాబాద్ మార్కెట్లోకి కాసాగ్రాండ్ హాస్‌ఫోర్డ్

సాక్షి, హైదరాబాద్: లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాపర్టీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని దక్షిణ భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లలో ఒకటైన కాసాగ్రాండ్ హైదరాబాద్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. రూ.320 కోట్ల టర్నోవర్‌తో మొదటి కాసాగ్రాండ్ హాస్‌ఫోర్డ్, విలాసవంతమైన బ్రిటిష్ స్టైల్ విల్లా కమ్యూనిటీని నగరంలోని ఔటర్ రింగ్‌రోడ్డులో ప్రారంభించింది. ఈ సందర్భంగా కాసాగ్రాండ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ మాట్లాడారు. రియల్ ఎస్టేట్ మార్కెట్‌తో వాణిజ్య వస్తువులకు డిమాండ్ పెరుగుతుందన్నారు. కాసాగ్రాండ్ ఎల్లప్పుడూ విలువలను కొనసాగిస్తుందని హామీనిచ్చారు. ఇళ్లను యజమానులకు సకాలంలో అందించడమే తమ ధ్యేయన్నారు.

ప్లాస్టిక్ రహితంగా తిరుమల



జస్టిస్ ఎన్వీ రమణకు క్యాలెండర్‌ను అందజేస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి



తిరుమల ఘాట్ రోడ్డులో చెత్తను ఏరుతున్న సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ

- భక్తులంతా భాగస్వాములు కావాలి
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపు
- సుందర తిరుమల – శుద్ధ తిరుమల కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీం మాజీ సీజే

తిరుమల/తిరుచానూరు(చంద్రగిరి): తిరుమలలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భక్తుడిపైనా ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. తిరుమలను ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చడానికి టీటీడీ చేస్తున్న కృషిలో భక్తులంతా భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం కోసం శనివారం టీటీడీ నిర్వహించిన సుందర తిరుమల–శుద్ధ తిరుమల కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొన్నారు. తిరుమల నుంచి తిరుపతికి వచ్చే ఘాట్ రోడ్డులోని ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆయన తొలగించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. తిరుమల కొండలు పవిత్రమైనవని, ఈ ప్రాంతాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో దేవుడి గది లాగే భావించి శుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. టీటీడీ చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో గొప్పదని.. ఇందులో పాల్గొంటున్న ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, భక్తులను ఆయన అభినందించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ, ఇకపై ప్రతి నెలా రెండో శనివారం సుందర తిరుమల–శుద్ధ తిరుమల కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు స్వచ్ఛందంగా పాల్గొని తిరుమలను పరిశుభ్రంగా.. ప్లాస్టిక్ రహితంగా ఉంచడానికి కృషి చేయాలని కోరారు. తిరుమలకు ప్లాస్టిక్ ఉత్పత్తులను తీసుకురావద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీర బ్రహ్మం, జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, టీటీడీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులు ఆయన్ని రంగనాయకుల మండపంలో లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే శనివారం సాయంత్రం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

డల్లాస్‌లో నాటా మహాసభలు

జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు

సాక్షి, అమరావతి: నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) మహా సభలను ఈ ఏడాది జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నాటా అధ్యక్షుడు డాక్టర్ కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. డల్లాస్ నగరంలోని కే బైలీ హచిన్సన్ సెంటర్‌లో జరిగే ఈ మహోత్సవాలకు తెలుగు సినీ, రాజకీయ, సాంస్కృతిక ప్రముఖులు, పాత్రికేయులు, జానపద కళాకారులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు, సంగీత ప్రముఖులు రానున్నట్లు చెప్పారు. నాటా తెలుగు సంప్రదాయాలని, కళలు, సంగీతాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. నాటా సభల్లో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శ్రవణ్ కుమార్‌తో ఫ్యాషన్ షో, ప్రముఖ సినీ నృత్య దర్శకురాలు అనీ మాస్టర్ పర్యవేక్షణలో స్థానిక పిల్లల జానపద, సినీ నృత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. ఈ సంబరానికి రామ్‌గోపాల్ వర్మ, మెర్లపాక గాంధి, శ్రీనివాస రెడ్డి, ఆలీ, లయ గోర్తి, పూజ ఝువాల్కర్, స్పందన పల్లి, అనసూయ, ఉదయభాను, రవి, రోషన్, రవళి లాంటి ప్రముఖులతో ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించామన్నారు. కన్వెన్షన్ చరిత్రలో మొట్ట మొదటిసారిగా మూడు రోజులు ముగ్గురు టాలీవుడ్ అగ్ర సంగీత దర్శకులు దేవిశ్రీ ప్రసాద్, థమన్, అనూప్ రూబెన్స్ వారి బృందాలతో చేసే సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. వీటి నిర్వహణకు డాక్టర్ నాగిరెడ్డి దుర్గారెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

బందోబస్తు మధ్య సోని అంత్యక్రియలు

నర్సంపేట రూరల్: పోలీసుల భారీ బందోబస్తు నడుమ శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని (31) అంత్యక్రియలను నిర్వహించారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రంగాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న నర్సంపేట పట్టణానికి చెందిన సోని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అంతిమయాత్ర సందర్భంగా నర్సంపేటలో శనివారం ఉదయం సోని ఇంటివద్దకు పెద్ద ఎత్తున జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేరుకున్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని దారి మధ్యలో అంతిమయాత్ర ఎదుట బైఠాయించారు. దీంతో ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్, ఏసీపీలు సంపత్‌రావు, శివరామయ్య తదితరులు పంచాయతీ కార్యదర్శులకు నచ్చజెప్పారు. అయితే వారు ఎంతకీ శాంతించకపోవడంతో పోలీసులు వారిని పక్కకు తప్పించారు. అనంతరం అంతిమయాత్ర ముందుకు సాగింది.



నా కుమారుడా, నీ తండ్రి ఉపదేశము ఆలకింపుము,
నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము. అవి నీ తలకు సొగసైన
మాలికయు, నీ కంఠమునకు హారములునై యుండును.


– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం,
ఉత్తరాయణం, వసంత ఋతువు,
వైశాఖ మాసం, **తిథి:** బ.నవమి ఉ.5.46 వరకు, తదుపరి దశమి రా.3.34 వరకు,
నక్షత్రం: శతభిషం ఉ. 11.27 వరకు తదుపరి పూర్వాభాద్ర. **వర్జ్యం:** సా.5.26 నుండి 6.56 వరకు,
దుర్ముహూర్తం: సా.4.35 నుండి 5.26 వరకు, శ్రీ హనుమజ్జయంతి.

కషాయాలు!

ఆరు రుచులలో (మధుర, కటు, అమ్ల, తిక్త, కషాయ, లవణ) కషాయం ఒకటి. వగరు రుచి. కోయిలలు తినే మావి చిగుళ్ళ రుచి లాంటిది. కషాయం అంటే ఏ పదార్థాన్నయినా నీళ్ళలో వేసి, బాగా మరగబెట్టి, దాన్లో సారాన్ని ఆ నీళ్ళు లాగేసుకొన్న తరవాత, వడబోసి ఉంచిన నీరు అని కూడా! ఆయుర్వేద వైద్యంలో కషాయాలది ప్రముఖ స్థానం.



జ్యోతిర్మయం

ఆధ్యాత్మికంగా, 'కషాయాలు' అంటే మానవుడు లోకంతో వ్యవహరించేటప్పుడు ప్రదర్శించే కొన్ని ముఖ్యమైన దుర్గుణాలు. కషాయాలను గురించిన చర్చ జైన సంప్ర దాయంలో ఎక్కువ. జైనులు క్రోధ (కోపం), లోభ (దురాశ), మాన (అహంకారం), మాయా (మోసం చేసే బుద్ధి) గుణాలను కషాయాలంటారు. ఇవి మనుషులను దుష్ట కర్మలకు ప్రేరేపించి, తత్ఫలంగా జనన మరణ చక్రంలో బద్ధులుగా ఉంచుతాయి. ముక్తికి దూరంగా లాగుతుంటాయి. కషాయాలను వదిలించు కోకపోతే మోక్షం సాధ్యం కాదు. కానీ ఎలా వదిలించు కోవటం? ఈ నాలుగు గుణాలకూ విరుగుడుగా పనిచేసే నాలుగు విరుద్ధ గుణాలను అలవర చుకోవటమే అందుకు మార్గం అంటుంది జైన సిద్ధాంతం. క్రోధం అనే కషాయానికి విరు గుడు క్షమాగుణం. లోభానికి విరుగుడు దాన గుణం. మానం అంటే నేనే(దో) గొప్ప అనే అహంకారం. దానికి విరుగుడు క్రమంగా, శ్రద్ధగా వినయ గుణం అలవరచుకోవటమే. మాయ అంటే వ్యాపారంలో, వ్యవహారంలో కల్ల బొల్లి మాటలతో ఇతరులను మోసం చేసే గుణం. ధర్మబద్ధమైన ప్రవర్తనకు కట్టుబడి ఉండే అలవాటు ద్వారా ఈ మాయా గుణం అనే కషాయం ఆట కట్టించవచ్చు. జైన మత సిద్ధాంతమైనా, ఇది ఏ మతానికి చెందిన వారికైనా, ఏ మతానికీ చెందని వారికైనా హితవైన మాటే. మనిషికి అపారమైన హాని కలిగించేది అంతశ్శ త్రువులుగా ఉండే అతడి దుర్గుణాలే కదా!

– ఎం. మారుతి శాస్త్రి

పవన్ రాజకీయం బాబు కోసమే..

బాబు చేత.. బాబు వల్ల.. బాబు కోసం ■ పదేళ్ల రాజకీయ జీవితమంతా బాబుకు జీ హుజూర్ ■ ప్రజలు వాస్తవాలు గ్రహించాలి ■ మంత్రి అంబటి బహిరంగ లేఖ



సాక్షి, అమరావతి: 'జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయమంతా టీడీపీ అధినేత చంద్రబాబు కోసమే. బాబు చేత.. బాబు వల్ల.. బాబు కోసం పరితపించే పవన్ కల్యాణ్, బాబుతో తన రాజకీయ వివాహ బంధాన్ని పదిల పరుచుకునేందుకు తహతహలాడుతున్నాడు. రైతుల పేరిట రెండు రోజుల పర్యటనలో ఇదే విషయాన్ని స్పష్టం చేశాడు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి అభిమానులు పవన్ కల్యాణ్‌కు దూరంగా ఉండాలి' అని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంబటి రాంబాబు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం ఇలా..

పొత్తు ఒక ఎత్తు

- నిన్న, మొన్న పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనలు ఆయన అసలు రూపాన్ని బయట పెడుతున్న నేపథ్యంలో, విజ్ఞులైన రాష్ట్ర ప్రజల ముందు కొన్ని అంశాలు ఉంచుతున్నాను. ప్రతిపక్షాలన్నింటితో పొత్తు అన్నది కేవలం పవన్ రాజకీయ ఎత్తు మాత్రమే.
- బీజేపీ-కమ్యూనిస్టులు ఒక పొత్తులో ఉండరని తెలిసే.. బీజేపీ చంద్రబాబును నమ్మటం లేదని, తాము సొంతంగా గెలవాలని బీజేపీ భావిస్తోందని ఆ పార్టీ నేతలే పలుమార్లు చెప్పిన నేపథ్యంలో, ఇక వారిని బాబు కోసం తాను వదులుకోక తప్పటం లేదన్న అభిప్రాయం కలిగించటానికే రైట్-లెఫ్ట్-సెంటర్ పార్టీలన్నీ కలిసి రావాలన్న వాదనను పవన్ ముందుకు తోశాడు.
- 2014 నుంచి 2018 వరకు బాబుతో పాటు బీజేపీతో కూడా పవన్ దోస్తీ ఏం చెబుతోందంటే.. బాబుకు మిత్రులైతే పవన్‌కు కూడా మిత్రులే. బాబు.. బీజేపీతో విడిపోతున్నప్పుడు పవన్‌ది కూడా అదే రాగం. 2018–19లో ఆయన స్టేట్‌మెంట్లు చూడండి. బీజేపీ మన రాష్ట్రాన్ని పొట్టలో పొడిచిందని, పాచి లడ్డూలు ఇచ్చిందని, విడగొట్టి బీజేపీ సృష్టించిన సమస్యలు చాలు అని, కొత్తగా మరిన్ని ప్రత్యేక సమస్యలు సృష్టించవద్దు అని.. ఉత్తరాదికి దక్షిణాది వారు బానిసలు కారని.. ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్ష చేయబోతున్నానని చెప్పాడు. ఎందుకంటే ప్రత్యేక హోదా వద్దన్న బాబు బీజేపీతో తెగతెంపులు చేసుకుంటున్నానన్న సంకేతం పంపగానే పవన్ కల్యాణ్ అలా మాట్లాడారు.
- మరోవంక పవన్ కల్యాణ్‌ను టీడీపీ వారు ఏమీ అనకండని అదే సమయంలో చంద్రబాబు ప్రకటన చేయటం గమనించాలి. అప్పట్లో ఆ పరిణామం దత్త తండ్రి, దత్త పుత్రుడి తెరచాటు, తెర ముందు బంధాలను అనుబంధాలను వెల్లడిస్తోంది.

వ్యూహాత్మకంగానే బీజేపీలోకి..

- తామిద్దరం కలిసి పోటీ చేస్తే 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలదు కాబట్టి, ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చి చంద్రబాబుకు మేలు చేసే కుతంత్రంలో భాగంగానే పవన్ అడుగులు వేశారు. అయితే బాబు మేలు కాంక్షిస్తూ పవన్ తన పార్టీ నుంచి మంగళగిరిలో పోటీ పెట్టలేదు. మరోవంక.. పవన్ పోటీ చేసిన భీమవరం, గాజువాకల్లో చంద్రబాబు టీడీపీ ప్రచారానికి కూడా రాకపోవటాన్ని ప్రజలంతా గమనించారు. బాబు ఆదేశించాడు.. పవన్ ఆచరించాడు అంతే.
- మళ్లీ 2019 నుంచి బాబు కేసుల భయంతో మోదీని ప్రసన్నం చేసుకునేందుకు పడిగాపులు పడుతున్నప్పుడు.. వ్యూహంలో భాగంగానే సుజనా చౌదరి, సీఎం రమేశ్ సహా టీడీపీ రాజ్యసభ సభ్యుల్ని బాబు బీజేపీలోకి పంపాడు. అంతకు మించిన కామెడీ ఏమిటంటే.. ఆదినారాయణరెడ్డిని ఇదే చంద్రబాబు బీజేపీలోకి పంపాడు. అదే ఆదినారాయణరెడ్డి సొంత అన్న కొడుకే జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థి.
- బాబు ఆదేశాల మేరకు సీఎం రమేశ్ బీజేపీలోకి... అతని సోదరుడు సీఎం సురేశ్ మాత్రం టీడీపీలోనే! బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తే, పదవి పోయిన కొద్ది కాలానికే టీడీపీలో పచ్చకండువా కప్పుకోవటం అంటే.. బీజేపీ అధ్యక్షుడిగా కన్నా ఎవరి జేబులో ఉండి పని చేసినట్టు?
- సత్యకుమార్ బీజేపీ సిద్ధాంతాలకు బద్ధుడా? లేక బాబు ఎజెండాకు కంకణ బద్ధుడా? వీరందరి తరహాలోనే బీజేపీతో పొత్తు డ్రామా ఆడి తన మెంటార్, తన ప్రొడ్యూసర్ చంద్రబాబును రక్షించుకునే డ్రామాలో భాగంగానే పవన్ బీజేపీతో కలిశాడు. నాలుగేళ్లుగా ఈ డ్రామా నడిచింది.

బీజేపీని వదిలేయడానికి సాకు దొరికింది

- ఇప్పుడు బీజేపీకి కర్ణాటకలో ఎదురుగాలి వీస్తోందని ముందుగా సర్వేలు రాగానే.. బాబు-పవన్ మంతనాలు, వారి వ్యూహంలో మార్పులు జరిగిపోయాయి. ఒక వంక బీజేపీ నాయకత్వం.. చంద్రబాబును పచ్చి అవకాశ వాది, మోసగాడు అని.. అతనితో ఎన్నికల పొత్తే ఉండదని స్పష్టంగా పవన్‌కు చెప్పామని అంటోంది.
- బాబుతో కలవం అని, తమ క్యాడర్‌ను, ఓటర్‌ను తమ అస్తిత్వాన్ని కాపాడుకుని విస్తరించుకుంటాం అని బీజేపీ నాయకులు స్పష్టంగా చెపుతుంటే.. బీజేపీ కూడా తమతో కలిసి రావాలని పవన్ అడగటం అంటే దాని అర్థం ఏమిటి? పొత్తు ఎవరితో? పొత్తు ఎవరి కోసం?
- దీని అర్థం కర్ణాటక పోల్ సర్వేల తర్వాత వ్యూహం మార్చుకుని బీజేపీని వదిలేసి, టీడీపీలో చేరటానికి మంచి సాకు పవన్‌కు దొరికిందనే కదా?
- గతంలో రెండుసార్లు బీజేపీతో పొత్తు పెట్టుకుని, కేంద్రంలో పదవులు కూడా అనుభవించిన రోజున టీడీపీ.. 2019 ఎన్నికల తర్వాత మొన్నటి వరకు పవన్.. వీరిద్దరూ నేరుగా బీజేపీ పార్ట్నర్లు. బీజేపీకి ఫలితాలు అనుకూల పవనాలు ఉన్నంత కాలం... బాబు, పవన్‌ల రాగం తానం పల్లవి. అందుకు భిన్నంగా ఎదురుగాలి ఒక్కచోట వీచిందనగానే అవన్నీ రివర్స్‌లో మారిపోయాయి!

స్క్రిప్ట్ బాబుది.. యాక్షన్ దత్త పుత్రుడిది

- ఈ డ్రామాలన్నింటికీ బాబు చంద్రబాబే. స్క్రిప్ట్ బాబుది. యాక్షన్ దత్త పుత్రుడిది. 2014లో ఒక్క ఎమ్మెల్యే సీటుకుగానీ, ఒక్క ఎంపీ సీటుకు గానీ పోటీ పెట్టవద్దని బాబు ఆదేశిస్తే శిరసావహించిన పవన్.. 2019కి వచ్చేసరికి... ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉన్న ఓటర్లను చీల్చటానికి సీపీఐ, సీపీఎం, బీఎస్పీలతో కూటమి ఏర్పాటు చేశాడు. 2019లో తాను ఒంటరిగా పోటీ చేశానని పవన్ చెపుతున్నది పచ్చి అబద్ధం.
- 2019 తర్వాత బీజేపీతో బంధం.. 2023లో బీజేపీతో విడాకులకు రంగం సిద్ధం.. ఈ రెండూ బాబు చేత, బాబు వల్ల, బాబు కోసం పవన్ డ్రామాలు. ఏపీలో అధికార పార్టీ పాలన బాగోలేకపోయి ఉంటే.. ప్రతిపక్షానికి నల్లేరు మీద బండి నడక అయి ఉండేదే కదా? అదే పరిస్థితి ఉంటే బాబు ఒక్కడే ఒంటరిగా పోటీకి దిగేవాడే కదా?
- ఆ పరిస్థితి ఎక్కడా లేకపోగా.. పేదలకు, రైతులకు, అక్కచెల్లెమ్మలకు, పిల్లలకు, అన్ని ప్రాంతాలకు, అన్ని సామాజిక వర్గాలకు చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా అండగా నిలబడిన సీఎం వైఎస్ జగన్‌కు మరింతగా ఆశీస్సులు ఇస్తున్నాం అని ప్రతి ఉప ఎన్నిక, ప్రతి స్థానిక సంస్థల ఎన్నికల్లో 2019 తర్వాత కూడా ప్రజలు నిరూపించారు.
- 175 శాసనసభ స్థానాలకు 175 మంది టీడీపీ క్యాండిడేట్లు కూడా లేరు కాబట్టి, కనీసం 75 చోట్ల అభ్యర్థులే కరువు కాబట్టి చంద్రబాబు పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ నిజం పవన్ కల్యాణ్‌ను కూడా మరింతగా కుంగదీసినట్టుగా ఉంది. బాబుకు అభ్యర్థుల్లేరు.. ఒంటరిగా బరిలో దిగే ధైర్యం పవన్‌కు లేదు.

సొంతంగా ఎదగాలన్న లక్ష్యమే లేదు

- ప్రజలంతా ఒక్క విషయం గమనించాలని మనవి. ప్రాంతీయ పార్టీలు పెట్టిన వారు తమకు తాముగా ఎదగాలనుకుంటారు. అందుకోసం ఎంత కష్టమైనా పడతారు. ఎంత ఒత్తిడినైనా భరిస్తారు. అలాంటి వారు ప్రజల్లోనే ఉంటారు. దేశంలో అధికారం తెచ్చుకున్న ఏ ప్రాంతీయ పార్టీని చూసినా ఇదే కనిపిస్తుంది.
- పవన్‌కు ఇందులో ఏ ఒక్క లక్షణం కూడా లేదు. అతనికి ఇండిపెండెంట్ క్యాడర్ అక్కర్లేదు. ఓట్లు అక్కర్లేదు. సీట్లు అక్కర్లేదన్నట్టు ఈ 15 ఏళ్లుగా రాజకీయాలు చేశాడు. దీని అర్థం ఏమిటి? ఇవన్నీ ఏం చెపుతున్నాయంటే.. బాబుకు పవన్ గత 10 ఏళ్లుగా జీ హుజూర్ అని. అతనికి కావాల్సింది అధికారం కాదు. ప్యాకేజీ మాత్రమే.
- ఇంత స్పష్టంగా అన్నీ తానే నిరూపిస్తూ.. ప్యాకేజీ స్టార్ అని ఎవరన్నా పిలవగానే పవన్ కల్యాణ్‌కు అంత ఉలుకెందుకు? తాను గెలవాలని, సీఎం కావాలని ఎవరైనా ప్రాంతీయ పార్టీ పెడతారా? లేక.. తనకే ఎమ్మెల్యేగా గెలిచే దిక్కు లేకపోయినా.. ఫలానా పార్టీ ఓటమే ధ్యేయంగా పని చేస్తా అని డాంబికం కోసం ఒక పార్టీ పెడతారా?

దత్త తండ్రి కోసం బతకడమే జీవితాశయం

- ఈ రోజుకీ పవన్ పార్టీకి లక్ష్యాలు లేవు. ఆశయాలు లేవు. ఎజెండాయే లేదు. అతని జీవితాశయం ఏమిటంటే.. దత్త తండ్రి కోసం దత్త పుత్రుడిగా బతకటం. తాను సీఎం రేసులోనే లేనని, తనకు బలం, బలగం లేవని, రావని చెప్పేసిన ఈ వ్యక్తి.. తక్షణం టీడీపీలో సభ్యత్వం తీసుకుని దుకాణం మూసేస్తే మంచిది.
- అంతో ఇంతో తనను నమ్మిన కాపుల ఓట్లన్నీ మూటగట్టి అమ్మటానికే పవన్ డ్రామాలు ఆడుతున్నాడని రెండేళ్ల క్రితమే సీఎం జగన్ స్పష్టంగా చెప్పారు. అదే నిజం అని మరోసారి నిరూపణ అయింది. పవన్ కల్యాణ్ చెబుతున్న సామాజిక న్యాయం అన్నది తోటకూర కట్టో, గోంగూర కట్టో అని కూడా అర్థం అయిన తర్వాత.. ఇక పవన్ కల్యాణ్‌కు వేరే పార్టీ ఎందుకు? పాలిటిక్స్ ఎందుకు?
- వ్యక్తిగత జీవితంలో ఏ రాజకీయ విలువలుగానీ, నైతిక విలువలుగానీ లేని ఈయన, బాబు చెప్పినట్టు నటించే పొలిటికల్ యాక్టరే తప్ప, ప్రజా సేవకుడు కాదు, కాలేదు.

హవ్వ... సముద్రం ఒకడి కాళ్ల దగ్గరా?

''సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చొని మొరగదు, తుపాను గొంతు చిత్తం అనడం ఎరగదు. పర్వతం ఎవరికీ వంగి సలాం చెయ్యదు, నేనంతా పిడికెడు మట్టే కావచ్చు – కానీ చెయ్యెత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది.'' గుంటూరు శేషేంద్రశర్మ కవితా పంక్తులివి. పవన్ కల్యాణ్ తన గురించీ, తన రాజకీయ ప్రస్థానం గురించీ చెప్పుకోవడానికి ఈ పంక్తుల్ని వాడుకున్నారు. వేలాది అభిమానులు హాజరైన బహిరంగ సభలో జనసేన కార్యకర్తలకు ఆయన చేసిన బాస ఇది.

ఇప్పుడేమైంది పవన్‌జీ? ఆ ధీర గంభీర ప్రవచనాల కేమైనది? ఏవి తండ్రీ నిరుడు కురిసిన అగ్నిధారలు ఎక్క డయ్యా? నేనంతా పిడికెడు మట్టినే కదా! 175 నాకెట్లా సాధ్యమని బేలగా పలుకుతున్నారేమిటి? పొత్తుల జోలెలో చంద్రబాబు వేసే ముప్పయ్యో, నలభయ్యో చాలంటున్నారెందుకని? మీలో ఒక దేశపు జెండా కున్నంత పొగరు ఎందుకు అవనతమైనది? ఆ పొగరు జెండాను తమ గుండెల మీద ఎగరేసుకున్న మీ అభిమానుల పరిస్థితేమిటి? ''ఇల్లేమో దూరం. చీకటి పడింది. దారంతా గతుకులు. చేతిలో దీపం లేదు. అయినా గుండెల్లో ధైర్యముంది... వెళ్లొస్తా చిన్నమ్మా'' అనే కవితను మీరు చదివినప్పుడు 'అబ్బో మావాడు మహా తోపు' అనుకున్న జనసైనికుల పరిస్థితి ఏమి కావాలిప్పుడు?

జగన్ సర్కార్‌ను తానొక్కడిగా ఎదిరించడం సాధ్యం కాదని పవన్ కుండ బద్దలు కొడుతున్నారు. తానొక్కడి వల్లే కాదు, ఏ ఒక్కరి వల్లా కాదని కూడా తేల్చేశారు. 'ఈ చీకటి దారిలో నేనొక్కడినీ వెళ్లలేను చిన్నమ్మా, తోడు కావాల'ని దీనంగా అర్థిస్తున్నారు. తోడు దొరికినా కూడా తాను ముందు నడవరట! ముందు చంద్రబాబు నడవాలి. ఆ వెనకే తానూ, తనతోపాటు మిగిలిన సమస్త జీవరాశి. లెఫ్ట్, రైట్ తేడాలు పక్కనపెట్టి తన చుట్టూ నిలబడాలని అభ్యర్థిస్తున్నారు. వీలైతే పంచభూతాలు, సప్త సముద్రాలు, నవగ్రహాలు కూడా అండగా వస్తే బాగుంటుందని ఆయన మనసులో బలంగా ప్రార్థిస్తూ ఉండవచ్చు.

ఆంధ్ర రాజకీయ రంగంలో ఒక విలుకాడుగా నిలబడు తాడని కొందరు అభిమానులు ఆశపడ్డ ఈ నటుడు చివరికి తన బొటనవేలును కోసి చంద్రబాబుకు దక్షిణగా సమర్పిస్తున్నారు. 'నా పక్కన ఉండే నాదెండ్ల మనోహర్‌ను ఒక్క మాటన్నా సహించబోను. ఖబడ్దార్! ఆయనంటే ఇష్టం లేనివాళ్లు పార్టీ వదిలి వెళ్లిపోవచ్చ'ని కూడా పవన్ బాహాటంగా హెచ్చరించారు. మనోహర్... చంద్రబాబు ఏజెంటని పవన్ అభిమానులు, కాపు సామాజికవర్గం పెద్దల నిశ్చితాభిప్రాయం. నిరంతరం పవన్ కదలికలను బాబుకు ఆయన చేరవేస్తుంటారని వారు బహిరంగంగానే ఆరోపిస్తుంటారు. బీజేపీతో సహా ఇతర పార్టీల నేతలను పవన్ కలిసినప్పుడు కచ్చితంగా మనోహర్ వెంట ఉంటారట! ఆ సంభాషణల కేసెట్‌ను చంద్రబాబుకు చేరవేస్తుంటారట! చంద్రబాబు – పవన్ భేటీలో మాత్రం మనోహర్ కనిపించరట! ఎవరికీ చేరవేయవలసిన అవసరం లేదు కనుక! జనసేన ముఖ్యులే చెవులు కొరుక్కుంటున్న మాటలివి!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థనీ, వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడానికి టీడీపీ – బీజేపీ – జనసేనలతో కూడిన కూటమి ఏర్పడబోతున్నదనీ నిన్న పవన్ ప్రకటించడాన్ని ఒక కొత్త విషయంగా కొన్ని మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. వైసీపీ వాళ్లు మాత్రం ఈ సంగతి మాకెప్పుడో తెలుసని తేలిగ్గా తీసుకున్నారు. అసలు జనసేన పార్టీ సృష్టి స్థితి లయకారుడు చంద్రబాబేనని వాళ్లు ఎప్పటి నుంచో చెబు తున్నారు. పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు దత్తపుత్రుడనే నామకరణాన్ని కూడా వైసీపీ అధినేత ఎప్పుడో ఖరారు చేశారు. బాబు చేత, బాబు కొరకు, బాబు పెట్టిన పార్టీగానే జనసేనను వైసీపీ వాళ్లు పరిగణిస్తారు. కనుక పవన్ రాజకీయ విధాన ప్రకటన వారికెటువంటి ఆశ్చర్యాన్నీ కలిగించలేదు.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయ రంగంలో ఎదురులేని శక్తిగా యువనేత జగన్‌మోహన్‌రెడ్డి కనిపించారు. ఆయన్ను ఓడించడానికి చంద్రబాబు ఒక పద్మవ్యూహాన్ని రూపొందించవలసి వచ్చింది. అందులో భాగంగానే జనసేన పేరుతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను తయారుచేసి, దాని చీఫ్‌గా పవన్ కల్యాణ్‌ను నియమించారని రాజకీయ పరిశీలకులు అంచనా వేశారు. ఈ అంచనా నిజమేనని తదుపరి పరిణామాలు నిర్ద్వంద్వంగా నిరూపించాయి. ఆ ఎన్నికల్లో బాబు అప్పగించిన టాస్క్ మేరకు జనసేన పోటీ చేయలేదు. సినిమా వ్యామోహమున్న యువతీ యువకుల్లో, కొంతమేరకు కాపు యువతలో తనకున్న క్రేజును టీడీపీ ఓట్లుగా మలచడానికి పవన్ యథాశక్తి కృషి చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కల్యాణ్, ఆయన టాస్క్‌ఫోర్స్ అతిథి పాత్రనే పోషించాయి. తరువాతి ఎన్నికల్లో చంద్రబాబు కొత్త టాస్క్‌ను అప్పగించారు. ఆయన అధికారంలో ఉన్నారు గనుక తనకు వ్యతిరేకంగా పడే ఓట్లు గంపగుత్తగా వైసీపీకి వెళ్లకూడదని భావించారు. వ్యతిరేక ఓటును చీల్చడం కోసం టాస్క్‌ఫోర్స్‌కు కమ్యూనిస్టులనూ, బీఎస్పీనీ జతచేసి రంగంలోకి దించారు. ఫలితం దక్కలేదన్నది వేరే విషయం.

ఇప్పుడు బాబు ప్రతిపక్షంలో ఉన్నారు. అధికార పక్షానికి వ్యతిరేకంగా పడే ఓట్లు చీలకూడదు. 'ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వను' అని పవన్ కల్యాణ్ గంభీరంగా చేస్తున్న ప్రకటనల వెనుక పరమార్థం – చంద్రబాబు ప్రయోజనమే! మొన్నటి ఎన్నికల తర్వాత కమ్యూనిస్టులను గిరాటు వేసి, పవన్ బీజేపీ చెంతకు చేరడం కూడా బాబు వ్యూహంలో భాగమేనని కనిపెట్టడానికి కామన్‌సెన్సు సరిపోతుంది. ఆ ఎన్నికల ముందు చంద్రబాబు... నరేంద్ర మోదీని అసభ్యంగా తిట్టిపోశారు. ఆయన ఓడిపోతారనే గుడ్డి నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయం కూడా చేశారు. చంద్రబాబు గ్రహచారం బాగాలేక నరేంద్ర మోదీ ఘనవిజయం సాధించారు. మోదీ ఆగ్రహంనుంచి తప్పించుకోవడానికి చేయ గూడని పనులన్నీ చేయడానికి బాబు సిద్ధపడ్డారు.



జనతంత్రం

వర్ధెల్లి మురళి

పూర్వం బలవంతులైన రాజుల కటాక్ష వీక్షణాల కోసం బలహీనమైన రాజులు పడిన ప్రయాసనంతా చంద్రబాబు పడ్డారు. ధనరాశులతోపాటు గుర్రాలను, ఏనుగులను, యుద్ధ వీరులను, అందాల కన్యలను కూడా బలవంతుడైన రాజుకు కానుకలుగా పంపేవారట! చంద్రబాబు కూడా తన పార్టీలోంచి కొందరు నాయకులనూ, అందులో కొందరు ఎంపీలనూ బీజేపీ లోకి పంపించారు. వారితోపాటు తాను పెట్టుకున్న టాస్క్‌ఫోర్స్ జనసేననూ, దాని చీఫ్‌ను కూడా బీజేపీ శిబిరానికి పంపించారు. చంద్రబాబు చాణక్యంపై బీజేపీ పెద్దలకు గ్రహింపు ఉన్నా కూడా సమర్పించిన కైంకర్యాలను వారి ప్రయోజనార్థం వారు స్వీకరించారు.

బీజేపీ శిబిరంలోకి చంద్రబాబు పంపించిన వారంతా బాబు సేవలోనే తరిస్తున్నారని చెప్పడానికి దృష్టాంతాలు కోకొల్లలు. బీజేపీ కొంగుతో చంద్రబాబు కొంగును ముడివేయడానికి పవన్ యథాశక్తి ప్రయత్నిస్తున్నారు. ఇది వాస్తవం. బయటకు కనిపించిందంతా నటనే! పవన్‌పై చంద్రబాబు వన్‌సైడ్ లవ్ ప్రకటించడం నటనే. తరువాత తనను కలిసిన బాబుతో 'ఐ లవ్ యూ టూ' అని పవన్ చెప్పడం కూడా నటనే! ఈ సన్నివేశాలన్నీ చంద్రబాబు కూటమి రాసిన నాటకంలో భాగాలే. పరిణా మాలను గమనిస్తే– చంద్రబాబు సేవలో పవన్ కల్యాణ్ నిమగ్నమై ఉన్నారని అర్థమవుతూనే ఉన్నది. అందుకు కారణ మేమిటన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్.

తన ప్రధాన ప్రత్యర్థులుగా పవన్ కల్యాణ్ ప్రకటించుకున్న వైసీపీలోని చాలామంది నాయకులు 'అంతా ప్యాకేజి మహిమ' అనే భాష్యం చెబుతారు. ఆ మాట వింటే పవన్‌కు తీవ్రమైన ఆగ్రహం కలుగుతుంది. ఆ కోపంలో ఒకసారి ప్రత్యర్థులకు చెప్పును కూడా చూపించారు. విమర్శలకూ, సమస్యలకూ ఆగ్రహం సమాధానం కాదని మన పురాణాలు, ఇతిహాసాలు ఎప్పటినుంచో బోధిస్తున్నాయి. పూర్వం కౌశికుడు అనే తపోబల సంపన్నుడిపై ఓ కాకి రెట్ట వేసిందట! కౌశికుడు కోపంతో కన్నెర్రజేసి కాకి వంక చూస్తాడు. ముని తపోబలం చేత ఆ కాకి మాడిపోతుంది. అక్కడి నుంచి భిక్షాటన కోసం ఒక గ్రామాన్ని చేరుకొని, 'భవతీ భిక్షాం దేహి' అని ఒక ఇంటి ముందు పిలుస్తాడు. వ్యాధిగ్రస్తుడైన భర్త సేవలో పడి, ఆ ఇల్లాలు కొంత ఆలస్యంగా భిక్ష తెస్తుంది. ఆలస్యం చేసినందుకు కౌశికుడికి కోపం వస్తుంది. అలవాటు ప్రకారం కంటి అరుణిమను ఇల్లాలిపై ప్రయోగిస్తాడు. ఆమె కాలిపోదు. పైపెచ్చు చిరునవ్వు నవ్వుతుంది. ''ఓయీ కౌశికా! నువ్వు కోపగిస్తే కాలిపోవడానికి నేను కాకిని కాదు. గృహధర్మానికి కట్టుబడిన ఇల్లాలిని. నా ధర్మానువర్తనలో కొంత ఆలస్యం జరిగినది. ధర్మాన్ని గురించి తెలియని నీ తపస్సు వృథా! వెళ్లి నేర్చుకో'' అని హితబోధ చేస్తుంది.

ప్యాకేజి విమర్శలను పూర్వపక్షం చేయాలని పవన్ భావిస్తే అందుకు పరిష్కారం పాదరక్షలు కాదు. తన రాజకీయ ఎత్తుగడలు ప్రజల ప్రయోజనాల కోసమేనని వారిని నమ్మించగలగాలి. చంద్రబాబుతో తన మైత్రి లోక కల్యాణార్థమని రుజువు చేయగలగాలి. అందరూ కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడిస్తే నెలకు మూడు వానలు కురుస్తాయనీ, బంగారు పంటలు పండుతాయనీ తాను చదివిన లక్ష పుస్తకాల పరిజ్ఞానంతో సహేతుకంగా నిరూపించవలసి ఉంటుంది. తాను చేగువేరా దగ్గర నుంచి శ్యామాప్రసాద్ ముఖర్జీ వరకు చేసిన ప్రయాణంలో బోలెడంత తాత్వికత దాగి ఉన్నదని తార్కికంగా నిరూపించ వలసి ఉంటుంది. అలా చేయకపోతే – మీ కన్నెర్రకు కాకులు భయపడతాయేమో... లోకులు భయపడరు!

తెలంగ'గానా'నికి కర్ణాటక సంగీతం!

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది.' కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు తెలంగాణలో ఎవరి చావు కొచ్చినట్టు? ఎవరి మేలు కొచ్చినట్టు? ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో మొదలైన తాజా చర్చ. అసలు ఒక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాల ప్రభావం పక్క రాష్ట్రం మీద ఉంటుందా? ఉంటే ఏ మేరకు ఉంటుంది? ఏ రాష్ట్రానికి సంబంధించిన రాజకీయ పరిస్థితులు ఆ రాష్ట్రానికే పరిమితం కదా! అటువంటప్పుడు కర్ణాటక ఫలితాలు తెలంగాణ మీద ఎలా ప్రభావం చూపిస్తాయన్న మీమాంస కూడా ఉన్నది. ఇప్పుడు తెలంగాణలో అధికార బీఆర్ఎస్ ప్రధాన రాజకీయ పక్షం. దానితో తలపడబోయే నెంబర్ టూ పార్టీ ఏదీ అన్న ప్రశ్నకు గత కొంతకాలంగా అస్పష్టమైన సమాధానాలు లభిస్తున్నాయి. అటువంటి అస్పష్టతకూ, సందిగ్ధతకూ కర్ణాటక ఫలితాలు తెరదించనున్నాయా?

రాష్ట్ర విభజన తర్వాత, తెలంగాణా ఇచ్చిన పార్టీగా పేరున్నప్పటికీ కాంగ్రెస్ క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. ఇందుకు కారణం ప్రజల్లో ఆదరణ లేకపోవడం కాదు. నాయకత్వ వైఫల్యం ప్రధాన కారణం. మొదటి ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ సారథిగా సహజంగానే కేసీఆర్‌కు కొంత సానుకూలత ఉన్నది. కానీ దాన్ని అధిగమించగలిగే సంస్థాగత బలం, కేంద్ర-రాష్ట్రాల్లో అధికారం, తెలంగాణ ఇచ్చిన పార్టీ అనే ఖ్యాతి కాంగ్రెస్‌కు ఉన్నాయి. కానీ కేసీఆర్ జనాకర్షణతో పోల్చినప్పుడు అందుకు దీటైన నాయకుడు కాంగ్రెస్‌లో లేకపోవడం ఎన్నికల ఫలితాలను శాసించింది. రెండోసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గట్టి పోటీ ఇవ్వబోతున్నదని చాలామంది భావించారు. కానీ అనూహ్యంగా చారిత్రక తప్పిదానికి ఒడిగట్టి తెలుగు దేశం పార్టీతో పొత్తు పెట్టుకొని భారీమూల్యం చెల్లించింది. గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో మూడొంతులమంది అధికార పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

ఈ ఫిరాయింపుల పర్వం కాంగ్రెస్ పార్టీని ప్రజల్లో పలుచన చేసింది. సరిగ్గా ఈ సమయంలోనే తెలంగాణలో బీజేపీ వేట మొదలైంది. కాంగ్రెస్ బలహీనపడుతున్న క్షణాలను తనకు అను కూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మూడు సీట్లు గెలిస్తే, బీజేపీ నాలుగు చోట్ల గెలవడం ఆ పార్టీకి అనుకోకుండా ఊపు తెచ్చింది. బీఆర్ఎస్ నాయకత్వం చేసిన పొరపాట్ల వల్ల హుజూరాబాద్, దుబ్బాక నియోజక వర్గాల్లో గెలిచి, బీజేపీ ఒక సంచలనానికి కారణమైంది. మునుగోడులో విజయతీరాల దాకా చేరుకున్నా బీఆర్ఎస్ అప్రమత్తత వల్ల కొద్ది తేడాలో ఓడిపోయింది.

తెలంగాణలో తాను బలపడ్డాననే అభిప్రాయం కలిగించడం కోసం బీజేపీ ఉప ఎన్నికల వ్యూహాన్ని అమలు చేసింది. అదే సమయంలో ఫిరాయింపుల ద్వారా కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేసి ఆ స్థానాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నది. ఈ కార్యక్రమంలో తాను ఆశించినంత కాకపోయినా ఎంతో కొంత మేరకు బీజేపీ విజయం సాధించింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే 'బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థి ఎవరు? కాంగ్రెసా... కాషాయ పార్టీనా' అనే సందిగ్ధత జనంలో ఏర్పడింది. కర్ణాటక ఫలితాలు సహజంగానే కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్నీ, బీజేపీ శ్రేణుల్లో నిరుత్సాహాన్నీ నింపుతాయి. ఈ ప్రభావం ఎలా ఉండ బోతున్నది? బీఆర్ఎస్‌కు లాభమా-నష్టమా? కాంగ్రెస్ పార్టీ పుంజుకొని అధికార పార్టీని సవాల్ చేయగలుగుతుందా? కర్ణాటక గాయాన్ని మరచిపోవడానికి బీజేపీ తెలంగాణలో విజృంభిస్తుందా? ఈ విషయాల మీద స్పష్టత రావాలంటే క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల బలాబలాలను పరిశీలించాలి.

ఓట్ల చీలిక కారణంగా మూడోవంతు ఓట్లతోనే బీఆర్ఎస్ పార్టీ తొలిసారి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ చేసిన 'చారిత్రక' తప్పిదం వల్ల రెండోసారి ఆ పార్టీ ఓట్ల శాతం 47కు పెరిగింది. నాలుగు మాసాల తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో 41 శాతానికి దాని మద్దతు పడిపోయింది. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న పార్టీకి ఎంతోకొంత వ్యతిరేకత సహజం. బీఆర్ఎస్ విషయంలో ఈ వ్యతిరేకత కొంత ఎక్కువగానే కనిపిస్తున్నది. ముఖ్యంగా నలభయ్యేళ్లలోపు యువతలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అదే సందర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనైనా బీఆర్ఎస్‌కే ఓటువేసే వారి సంఖ్య కూడా తక్కువ లేదు. ఇటువంటి ఓటర్లు సుమారు 35 శాతం ఉంటారని అంచనా ఉన్నది. ఇంకో ఐదారు శాతం మందికి బీఆర్ఎస్ పట్ల తీవ్ర వ్యతిరేకతగానీ, వల్లమాలిన అభిమానం గానీ ఉండకపోవచ్చు. పరిస్థితులను బట్టి వారు ఆ పార్టీకి అనుకూలంగానో, ప్రతికూలంగానో స్పందించవచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌కు ఓటు వేయని వారు 60 శాతం వరకు ఉండొచ్చని కొన్ని క్షేత్రస్థాయి పరిశీలనలు సూచిస్తున్నాయి. ఇందులో నాలుగైదు శాతం ఓట్లు చిన్న పార్టీలకు పడొచ్చు. నికరంగా 55 శాతం బీఆర్ఎస్ వ్యతిరేక ఓటు. కాంగ్రెస్ బీజేపీలు ఈ ఓట్లను పంచుకోవాలి.

ఇందులో కాంగ్రెస్ నికర ఓటు ఎంత? బీజేపీ నికర ఓటు ఎంత? అనే పరిశీలన అవసరం. గడచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దాదాపుగా 30 శాతం ఓట్లు పడ్డాయి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 25 శాతం పైచిలుకు ఓట్లు పడ్డాయి. కనుక కాంగ్రెస్ నికర ఓటును 25 శాతంగా పరిగణించవచ్చు, అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు శాతం ఓట్లు మాత్రమే సంపాదించిన బీజేపీ 4 నెలల్లోనే లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 20 శాతం ఓట్లు సంపాదించింది. లోక్‌సభ ఎన్నికల్లో 20 శాతం ఓట్లు సంపాదించడం బీజేపీకి మొదటిసారి కాదు. 1998 ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసి, దాదాపు ఇదే శాతం ఓట్లను ఆ పార్టీ పొంద గలిగింది. తర్వాత కాలంలో టీడీపీతో పొత్తు వల్ల బీజేపీ చిక్కి శల్యమైంది. ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ డబుల్ డిజిట్‌ను తాకలేక పోయింది. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతాన్నీ, ఈ మధ్యకాలంలో పెరిగిన విస్తరణనూ పరిగణనలోకి తీసుకుంటే 15 శాతం వరకు బీజేపీ నికర ఓటు ఉంటుందని భావించవచ్చు.

సీట్లవారీగా క్షేత్ర స్థాయి పరిశీలన సైతం ఇదే స్థాయి నికర ఓటును నిర్ధారిస్తున్నాయి. దాదాపు వంద సీట్లలో బీఆర్ఎస్ ప్రధాన పోటీదారుగా ఉంటుంది. అంటే గెలవడమో, లేదా రెండో స్థానంలో నిలవడమో అన్న మాట. కాంగ్రెస్‌కు అటువంటి నియోజక వర్గాలు అరవైకి పైనే కనిపిస్తున్నాయి. బీజేపీకి సుమారు ముప్పయ్ నియోజక వర్గాలున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉండి, అర్థబలం... అంగబలం దండిగా ఉన్న బీజేపీ తెలంగాణలో వేట మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా ఇంకా రెండో స్థానానికి చేరుకోలేకపోవడానికి కారణాలేమిటి? అనుకున్న స్థాయిలో చేరికలు ఎందుకు ఉండడం లేదు? అనైక్యతతో, క్రమశిక్షణారాహిత్యంతో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడంలో బీజేపీ నేతలు ఎందుకు విజయం సాధించలేకపోతున్నారు?

బీజేపీ వ్యూహమే దాని ఎదుగుదలకు గుదిబండగా మారుతున్నదన్న అభిప్రాయం కూడా ఉన్నది. తెలంగాణలో ఏకాయెకిని హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండాను తలకెత్తుకున్నట్టు కనిపిస్తున్నది. జాతీయ స్థాయిలో హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండాతో అద్వానీ రథయాత్రలు చేయడం వల్ల పార్టీ విస్తరణ జరిగిందే కానీ, అధికారం సిద్ధించలేదు. అటల్ బిహారీ వాజ్‌పేయి లాంటి సాఫ్ట్ హిందూత్వ ముఖాన్ని ముందుపెట్టిన తర్వాతే తొలిసారి బీజేపీకి కేంద్ర పీఠం దక్కింది. ఆ పునాదుల మీదనే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం నిలబడింది. హార్డ్‌కోర్ హిందూత్వ ఎజెండానే బీజేపీ బలంగా ముందుకు తోస్తే... ఇరవై శాతం ఓట్ల మార్కును దాటడం కష్టమే! ఆ వైతరణీ నదిని దాటాలంటే కచ్చితంగా సెక్యులర్, లేదా సాఫ్ట్ హిందూత్వ ఎజెండాయే శరణ్యం.

ఇక కాంగ్రెస్ పార్టీ గణాంకాలు చూస్తే బాగానే ఉన్నా, ఎక్స్‌రే మాత్రం బలహీనతలను ఎత్తిచూపుతున్నది. నాయక శ్రేణుల్లో ఇప్పటికీ ఏకాభిప్రాయం లేదు. ఆ పార్టీలో ఐక్యత ఓ మరీచిక. అగ్రనాయకత్వంపై అందరికీ విశ్వాసం లేదు. ఒకరినొకరు ఓడించుకునే అవకాశాలను తోసిపుచ్చలేము. ఎన్నికలకు ముందే ఆ పార్టీ అభ్యర్థులందరూ పార్టీ ఫిరాయించబోమని బహిరంగంగా ప్రమాణాలు చేస్తే తప్ప ప్రజలు నమ్మలేని పరిస్థితులు కూడా ఉన్నాయి. కర్ణాటక ఎన్నికల ఫలితాల ఉత్సాహంతో ఈ బలహీనతలన్నింటినీ అధిగమించగలిగితే గట్టి పోటీదారుగా నిలబడగలిగే అవకాశం ఇప్పటికీ కాంగ్రెస్‌కు ఉన్నది. అదే సందర్భంలో కర్ణాటకను కోల్పోయిన భారతీయ జనతా పార్టీ దక్షిణాదిన మరో స్థావరం కోసం గాయపడ్డ పులిలా విరుచుకుపడడం ఖాయం. ఇతర పార్టీల్లో ప్రజాదరణ గల నాయకులను పెద్ద ఎత్తున చేర్చుకొని ఒక ప్రభంజనం సృష్టించే ప్రయత్నం తప్పక చేస్తుంది. ఆ ప్రయత్నంలో విజయం సాధిస్తే... జరగబోయేది కురుక్షేత్ర సంగ్రామమే!

vardhelli1959@gmail.com

నేటి నుంచి మోదకొండమ్మ జాతర

3 రోజుల పాటు నిర్వహణ • తరలిరానున్న 4 రాష్ట్రాల ప్రజలు



సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లి జాతరను ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అమ్మవారి పండుగకు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది కూడా ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, నవర కొండబాబు, తమర్బ ప్రసాద్‌నాయుడు, కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. పాడేరు పట్టణం విద్యుత్ దీపాలు, సెట్టింగ్‌లతో అలంకరించారు. ఉత్సవం మొదటి రోజు ఆదివారం ఉదయం 5.30 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు ప్రారంభిస్తారు. అనంతరం మోదమ్మ ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలను పాడేరు వీధుల్లో ఊరేగించి మెయిన్‌రోడ్డులోని సతకం పట్టు వద్ద ప్రతిష్ఠించి జాతరను ఆరంభిస్తారు. ఈ నెల 16వ తేదీ వరకు మోదకొండమ్మ జాతర జరుగుతుంది. చివరిరోజు ఊరేగింపు అట్టహాసంగా నిర్వహిస్తారు.

స్థానిక పరిస్థితుల వల్లే కర్ణాటకలో ఓటమి

- బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్
- ఏపీలో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని వెల్లడి



లక్ష్మణ్‌కు స్వాగతం పలుకుతున్న పండితులు, పక్కన బీజేపీ నాయకుడు కృష్ణంరాజు

అన్నవరం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి అక్కడి రాజకీయ పరిస్థితులు, స్థానిక అంశాలే కారణమని బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. శనివారం ఆయన కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పరిపాలనకు దేశంలో 70 శాతం మంది ప్రజలు మద్దతిస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ అఖండ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తెలంగాణపై ఎటువంటి ప్రభావం చూపదన్నారు. కాగా, ఏపీలో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని లక్ష్మణ్ తెలిపారు. ప్రతిపక్ష ఓట్లు చీలకుండా పవన్ కళ్యాణ్.. టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేస్తామంటున్నారని మీడియా ప్రస్తావించగా.. టీడీపీ, బీజేపీ పొత్తు విషయంపై కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం బీజేపీకి జనసేనతో మాత్రమే పొత్తు ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ సత్యకృష్ణంరాజు, అయ్యాజీ వేమా, రొంగల గోపీ శ్రీనివాస్, కె.సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రుషికొండలో బ్లూ ఫ్లాగ్ రెపరెపలు

భారత దేశంలో 12 బీచ్‌లకు అరుదైన గుర్తింపు





బ్లూఫ్లాగ్ ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

- ఏపీ నుంచి ఒకే బీచ్‌గా రుషికొండ ఎంపిక
- పర్యావరణ అనుకూల సాగరతీరంగా రుషికొండ తీరం
- మూడుసార్లు బ్లూ ఫ్లాగ్ రెన్యువల్ చేసిన డెన్మార్క్ సంస్థ
- 33 అంశాల్ని పరిగణనలోకి తీసుకొని బ్లూ ఫ్లాగ్ కేటాయింపు
- స్వచ్ఛమైన బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ అందిస్తున్న పర్యావరణ అధ్యయన సంస్థ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అందాల తీరానికి అంతర్జాతీయ హంగులద్దుతున్నారు. స్వచ్ఛత, ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి పర్యావరణ హితంగా.. పర్యాటక స్వర్గధామంగా ఉన్న బీచ్‌లకు విదేశీ గుర్తింపు లభిస్తోంది. డెన్మార్క్‌కు చెందిన అధ్యయన సంస్థ అందించే ఈ ధ్రువపత్రం వస్తే చాలు.. ఆ బీచ్‌లకు విదేశీయులు క్యూ కడతారు. అంతర్జాతీయ సాగరతీరంగా గుర్తింపు పొందుతూ.. సురక్షితమైన బీచ్‌ల జాబితాలో భారత్‌కు చెందిన 12 ప్రాంతాల్లో బ్లూ ఫ్లాగ్ రెపరెపలాడుతున్నాయి. వరుసగా మూడో ఏడాది రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు వచ్చింది.

ఈ బ్లూ ఫ్లాగ్ గుర్తింపు ఎలా వస్తుందంటే..

బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు అంటే కాలుష్యం దరిచేరని పూర్తిగా పర్యావరణ అనుకూల సాగర తీరాలు. బ్లూ ఫ్లాగ్ గుర్తింపు ఉన్న బీచ్‌లకు విశేష ఆదరణతోపాటు విదేశీ పర్యాటకులు ఎక్కువగా వస్తారు. ఈ సర్టిఫికెట్ దక్కాలంటే బీచ్ పరిసరాలు పరిశుభ్రంగా, నీరు కలుషితం కాకుండా, రసాయనాలు దరి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక దేశాన్ని సందర్శించేందుకు వెళ్లే విదేశీ పర్యాటకులు ఆ దేశంలో బీచ్‌ల గురించి శోధించినప్పుడు ముందుగా బ్లూ ఫ్లాగ్ గురించే సెర్చ్ చేస్తారు. బ్లూ ఫ్లాగ్ ఉన్న బీచ్‌లు ఉంటే.. ఆ ప్రాంతాన్ని కచ్చితంగా విదేశీ పర్యాటకులు పర్యటిస్తారు. బ్లూ ఫ్లాగ్ ధ్రువ పత్రం పొందాలంటే నాలుగు విభాగాల్లోని 33 అంశాల్లో బీచ్‌ని అభివృద్ధి చేయాలి. మలినాలు, వ్యర్థాలు, జల కాలుష్యం ఉండకూడదు. పర్యావరణ హితంగా ఉండాలి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. పరిశ్రమల వ్యర్థాలు కలవకూడదు. సముద్రంలో స్నానం చేసేటపుడు ఆరోగ్యపరమైన భద్రత ఉండాలి. నీటిలో బ్యాక్టీరియా ఉండకూడదు. 150 మీటర్ల వరకు తీరం నుంచి లోపలకు ఇసుక తిన్నెలుండాలి. సముద్రంలో బోటింగ్ సదుపాయం ఉండాలి. ఈ ప్రాజెక్టుకు ఎంపికైన బీచ్‌లలో ఆయా అంశాల్లో పనులు పూర్తయిన అనంతరం ఎఫ్ఈఈ ప్రతినిధులు ఎక్కడైనా ఒకచోట ఒక చదరపు అడుగులో ఇసుకని తవ్వి నాణ్యత పరిశీలిస్తారు. నీటి నాణ్యతని కూడా పరిశీలించి సంతృప్తి చెందితే సర్టిఫికెట్ ఇస్తారు. బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ (నీలం రంగు జెండా) ఎగురవేస్తారు.

బ్లూ ఫ్లాగ్ ఎవరు ఇస్తారు?

1985లో డెన్మార్క్‌లో ప్రారంభించిన 'ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్'(ఎఫ్ఈఈ) ఏజెన్సీ 1987 నుంచి బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్లను అందిస్తోంది. ప్రపంచంలో తొలిసారి ఈ సర్టిఫికెట్ పొందిన దేశం స్పెయిన్. బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ అందిస్తున్నప్పటి నుంచి ఇప్పటి వరకూ స్పెయిన్ దేశానికి చెందిన సాగరతీరాలు ఎక్కువ సంఖ్యలో బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్స్‌ను సొంతం చేసుకున్నాయి. స్పెయిన్‌లో ఇప్పటి వరకు మొత్తం 566 బీచ్‌లు ఈ సర్టిఫికెట్ పొందగా, గ్రీస్ 515, ఫ్రాన్స్ 395 బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్స్ పొందాయి. మొత్తం 50 దేశాల్లో 4,831 బీచ్‌లకు ఈ సర్టిఫికెట్ లభించింది.

మన దేశంలో 2018లో తొలిసారిగా..

భారతదేశంలోనే కాదు.. ఆసియా ఖండంలో ఈ సర్టిఫికెట్ పొందిన తొలి బీచ్ ఒడిశాలోని కోణార్క్ తీరంలోని 'చంద్రబాగ్' బీచ్. ఇది 2018లో ఈ సర్టిఫికెట్ పొందింది. ఆ తర్వాత ఇండియాలో మరో 12 తీర ప్రాంతాలను బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ పొందే స్థాయిలో అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ పనిని పర్యావరణశాఖ ఆధ్వర్యంలో పని చేసే సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ కోస్టల్ మేనేజ్ మెంట్‌కు అప్పగించింది. తొలి సారిగా భారత్‌కు చెందిన 13 బీచ్‌లు ఇందుకు అర్హత సాధించగా.. ఇప్పటి వరకూ 12 బీచ్‌లలో బ్లూ ఫ్లాగ్ ఎగురుతోంది.

ఇవీ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు..

మొత్తంగా 12 బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు ఉండగా.. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో ఒకే ఒక్క తీరంలో నీలి జెండా రెపరెపలాడుతోంది. 2020 అక్టోబర్ 10న రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ దక్కింది. అప్పటి నుంచి వరుసగా మూడేళ్లు ఎఫ్ఈఈ రుషికొండకు బ్లూ ఫ్లాగ్‌ను రెన్యువల్ చేస్తోంది. ఇంకా మనదేశంలో చంద్రబాగ్, రుషికొండతో పాటు బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయంటే.. పుదుచ్చేరిలోని ఈడెన్ బీచ్, గుజరాత్‌లోని శివరాజ్ పూర్, డయ్యూలోని ఘోఘ్లా, కర్ణాటకలోని కసర్‌కోడ్, పడుబిద్రి బీచ్‌లు, కేరళలోని కప్పడ్, ఒడిశా నుంచి పూరి గోల్డెన్ బీచ్, అండమాన్ నికోబార్ దీవుల నుంచి రాధానగర్ బీచ్, లక్షద్వీప్ నుంచి మినికోయ్ తుండి, కద్మత్ బీచ్‌లు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ దక్కించుకున్నాయి.

బ్లూ ఫ్లాగ్ ఆవిష్కరణ

కొమ్మాది(భీమిలి): రానున్న కాలంలో మరిన్ని బీచ్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. రుషికొండ బీచ్‌లో శనివారం బ్లూ ఫ్లాగ్‌ను జేసీ కె.ఎస్.విశ్వనాథన్, బ్లూ ఫ్లాగ్ ఇండియా ఆపరేటర్ డాక్టర్ కురూప్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్, సమాచారశాఖ జేడీ వి.మణిరామ్ పాల్గొన్నారు.

అద్దెకు గోదాములు

సాక్షి, అమరావతి: ఆర్థిక పరిపుష్టి సాధించుకునే దిశగా మార్కెటింగ్ శాఖ అడుగులేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న గోదాములను అద్దెకివ్వడం ద్వారా ఆదాయ వనరులను పెంచుకుంటోంది. రాష్ట్రంలో 218 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్న సంగతి తెలిసిందే. వీటి పరిధిలో 9,75,105 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 1,015 గోదాములు ఉన్నాయి. వీటితో పాటు 3,352 చోట్ల షాపులు, మరో 407 చోట్ల షాపులతో కూడిన గోదాములున్నాయి. ఇప్పటి వరకు కమిటీల పరిధిలో ఉన్న ఈ–చెక్‌పోస్టుల ద్వారా సెస్ వసూలు చేయడం, వ్యాపారులకు లైసెన్సులు జారీ చేయడం, గోదాములను ప్రభుత్వ శాఖలకు అద్దెకు ఇవ్వడం వంటి కార్యకలాపాల ద్వారా మార్కెటింగ్ శాఖకు ఆదాయం సమకూరేది. ఇలా ఏటా రూ.450 కోట్ల నుంచి రూ.550 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. అయితే ఒకే దేశం– ఒకేమార్కెట్ విధానంతో సెస్ వసూళ్లను నిలిపివేయడంతో దాదాపు ఏడాది పాటు ఆదాయానికి గండి పడింది. 2021–22లో ఈ పన్నుల వసూళ్లను పునరుద్ధరించడంతో కాస్త గాడిలో పడినప్పటికీ ఆర్థికంగా మరింత పరిపుష్టి సాధించే దిశగా మార్కెటింగ్ శాఖ ముందుకెళ్తోంది. ఇప్పటివరకు 'రైతుబంధు' పథకం కింద రైతులు తాము పండించిన ఉత్పత్తులకు కనీస మద్దతు ధర వచ్చే వరకు ఈ గోదాముల్లో దాచుకునే వారు. అలాగే బియ్యం కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం, ఇతర నిత్యావసరాల నిల్వ కోసం పౌరసరఫరాల శాఖ, ధాన్యం, ఇతర ఆహార ఉత్పత్తుల నిల్వ కోసం సివిల్ సప్లయిస్ కార్పొరేషన్, రాష్ట్ర గోదాముల సంస్థ, మార్క్‌ఫెడ్‌లకు అద్దెకిచ్చేవారు. గత కొంతకాలంగా ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు కూడా గోదాముల్లో నిల్వ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. వీరికి అద్దెకివ్వడం ద్వారా మార్కెటింగ్ శాఖ అదనపు ఆదాయం సమకూర్చుకుంటోంది.

ఇప్పటివరకు అద్దెకు 2,976 షాపులు

ఏడాది నుంచి రెండేళ్ల కాలానికి గోదాములను అద్దెకు ఇస్తున్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీల ద్వారా అద్దెను నిర్ణయించి, konugolu.ap.gov.in ద్వారా టెండర్లు పిలుస్తున్నారు. అద్దె రూపంలో వచ్చే ఆదాయాన్ని ఆయా మార్కెట్ కమిటీలకు జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 2,976 షాపులు, 367 షాపులతో కూడిన గోదాములు, 614 గోదాములు అద్దెకిచ్చారు. వీటి ద్వారా ఏటా రూ.24 కోట్లకు పైగా అదనపు ఆదాయం మార్కెటింగ్ శాఖ సమకూర్చుకుంటోంది.

నేటి నుంచి చంద్రగిరిలో వైఎస్సార్ క్రికెట్ టోర్నీ

- పోటీపడనున్న 1,000 టీమ్‌లు, 15 వేల మంది క్రీడాకారులు
- విజేతలకు రూ.25లక్షల నగదు బహుమతులు



చంద్రగిరిలో ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న 16 క్రీడా మైదానాలు

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యాన తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో ఆదివారం నుంచి వైఎస్సార్ మెగా గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నీని ఆదివారం ఉదయం ఏడు గంటలకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభిస్తారు. చంద్రగిరి మెగా ఐపీఎల్‌గా పిలిచే ఈ టోర్నమెంట్‌లో ఎన్నడూ లేని విధంగా 1,000 క్రికెట్ టీమ్‌లు పాల్గొంటాయి. ఆయా జట్ల తరఫున 15వేల మంది గ్రామీణ క్రీడాకారులు మ్యాచ్‌లు ఆడనున్నారు. ఈ టోర్నీ నిర్వహించనున్న చెవిరెడ్డి స్వగ్రామం తుమ్మలగుంటలో మైదానానికి వైఎస్సార్ క్రికెట్ కాంప్లెక్స్‌గా నామకరణం చేసిన ఒకే ప్రాంతంలో 16 క్రికెట్ పిచ్‌లను సిద్ధం చేశారు. ఒక్కో పిచ్‌లో రోజుకు నాలుగు చొప్పున ఒకేరోజు 64 మ్యాచ్‌లను నిర్వహిస్తారు. రాత్రి సమయాల్లో కూడా మ్యాచ్‌లు నిర్వహించేందుకు రెండు మైదానాల్లో ఫ్లడ్ లైట్లను సైతం ఏర్పాటు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోనే తొలిసారిగా ఫ్లడ్ లైట్ల వెలుగులో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం విశేషం. విజేతలకు మెగా ట్రోఫీలతోపాటు రూ.25 లక్షల నగదు బహుమతులను అందిస్తారు. పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి ప్రశంసాపత్రం, మొమెంటోను బహూకరిస్తారు. గ్రౌండ్‌లో ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరిశీలించారు.

వేసవి సెలవులతో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఇంటిబాట

- 47 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన అధికారులు
- క్యాంపస్ నుంచి నేరుగా సొంత ఊళ్లకు తరలింపు



బస్సు ఎక్కుతున్న విద్యార్థినులు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్‌ఐటీకి ఈ నెల 14 నుంచి జూన్ నాలుగో తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించడంతో క్యాంపస్‌లోని ఎనిమిదివేల మంది విద్యార్థులు శనివారం ఇంటి బాట పట్టారు. ఆదివారం నుంచి సెలవులైనప్పటికీ రెండో శనివారం కావడంతో ఒక రోజు ముందుగానే విద్యార్థులు ఇళ్లకు బయల్దేరారు. విద్యార్థులు లగేజీలతో బస్టాండ్‌కు, రైల్వేస్టేషన్‌లకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా.. ట్రిపుల్ ఐటీ అధికారులు గత కొన్నేళ్లుగా నూజివీడు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి క్యాంపస్ నుంచే బస్సులను నడిపే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే విధంగా బస్సులను ఏర్పాటు చేయడంతో విద్యార్థులు నేరుగా క్యాంపస్ నుంచే తమ ఊళ్లకు వెళ్లారు. శుక్రవారం రాత్రి 23 బస్సులు, శనివారం ఉదయం 24 బస్సులు విద్యార్థులతో వెళ్లాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, అనకాపల్లి, నర్సీపట్నం, రాజోలు, అమలాపురం, భీమవరం, గుంటూరు, రేపల్లె, ఒంగోలు తదితర దూరప్రాంతాలతో పాటు విజయవాడకు ఈ బస్సులను నడిపారు. ఇందుకోసం ముందుగానే ట్రిపుల్‌ఐటీలో టికెట్ బుకింగ్ కౌంటర్లను ఆర్టీసీ సిబ్బంది ఏర్పాటు చేసి విద్యార్థులకు టికెట్లను విక్రయించారు.

భారత్ గౌరవ్ రైలుకు విశేష స్పందన



విజయవాడ చేరుకున్న 4వ భారత్ గౌరవ్ పర్యాటక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): భారతదేశంలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో గల ముఖ్యమైన చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాలను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సందర్శించేందుకు వీలుగా ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుపుతున్న భారత్ గౌరవ్ యాత్ర రైలుకు విజయవాడ పరిసర ప్రాంతాల సందర్శకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. మొదటి భారత్ గౌరవ్ రైలు మార్చి 18న సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సందర్శకుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు శనివారం 4వ పర్యాటక రైలును నడిపారు. శనివారం వరకు 389 మంది విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు ఈ సేవలు పొందినట్టు అధికారులు తెలిపారు. 8 రాత్రులు, 9 పగలు సాగే ఈ ప్రయాణంలో పూరీ, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు ఈ రైలు ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ ప్రయాణ సమయంలో అల్పాహారం, భోజనం, వసతి, పర్యాటక ప్రదేశాలను దర్శించేందుకు రోడ్డు మార్గంలో రవాణా, టూర్ గైడ్, ఎస్కార్ట్స్, ప్రయాణ బీమా తదితర ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే డీఆర్ఎమ్ షివేంద్రమోహన్ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పుణ్యక్షేత్రాలను, చారిత్రక ప్రదేశాలను సందర్శించే యాత్రికులకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు మరిన్ని రైళ్లను నడపనున్నట్టు తెలిపారు.

కడచూపు కోసం వేడుకోలు

సౌదీలో మృతి చెందిన విశాఖ వాసి



కుమారుడి ఫొటోతో తల్లిదండ్రులు

గోపాలపట్నం (విశాఖపట్నం): పొట్టకూటి కోసం సౌదీ వెళ్లి.. అక్కడ మృత్యువాతపడిన వ్యక్తి కడసారి చూపు కోసం అతని తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. నగరంలోని 92వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో నివాసముంటున్న మాణిక్యం ఎల్లయ్యరెడ్డి చిన్న కొడుకు మాణిక్యం విద్యాసాగర్‌రెడ్డి గత ఏడాది డిసెంబర్‌లో సౌదీ అరేబియాలోని ఏవైటీబీ కంపెనీలో పని కోసం వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్ వరకు అంతా బాగానే ఉన్నా.. ఆ తర్వాత అతని నుంచి ఫోన్లు రాకపోవడంతో ఆచూకీ కోసం పలు రకాలుగా తల్లిదండ్రులు, భార్య ప్రయత్నించారు. ఈ క్రమంలో అతను చనిపోయినట్టు తోటి కార్మికుల ద్వారా తెలుసుకుని షాక్‌కు గురయ్యారు. ఈ విషయం తెలిసి నెల రోజులైందని, ఇప్పటికీ మృతదేహం పంపించలేదని వాపోతున్నారు. తన కుమారుడిని గదిలో బంధించి చిత్రహింసలకు గురి చేశారని, అతని మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తండ్రి ఎల్లయ్యరెడ్డి ఆరోపిస్తున్నారు. మృతదేహం అప్పగించాలని అక్కడి కంపెనీకి దరఖాస్తు పెట్టామని, పోస్టుమార్టం చేయాలా వద్దా అని అటునుంచి లేఖ వచ్చిందన్నారు. అయినప్పటికీ మృతదేహం పంపించలేదన్నారు.

ఉగాది.. చివరి రోజు

'ఉగాది శుభాకాంక్షలు తెలిపేందుకు ఫోన్ చేసి మాట్లాడాం. అక్కడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాం. తనకి పెండింగ్‌లో ఉన్న డబ్బులు వచ్చాయని తెలిపాడు. ప్రస్తుతం పని లేదని, కంపెనీ పంపించేస్తే వచ్చేస్తానని చెప్పాడు. ఆ రోజు తర్వాత ఫోన్‌కు అందుబాటులోకి లేకుండా పోయాడు' అని విద్యాసాగర్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విద్యాసాగర్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్ ఏంటో అర్థం కావడం లేదని భార్య వాపోతోంది. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నేతల ద్వారా ఇటీవలే ప్రభుత్వం దృష్టికి విద్యాసాగర్ తల్లిదండ్రులు తీసుకెళ్లారు. సీఎం పేషీ నుంచి వివరాలు తీసుకున్నారని, మృతదేహం తీసుకొచ్చే చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారని తెలిపారు. త్వరితగతిన మృతదేహం తీసుకొచ్చి.. తన కుమారుడి చివరి చూపు దక్కేలా చూడాలని అతని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

బెట్టింగ్ ముఠా అరెస్ట్

రూ.80లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్(కర్నూలు): వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో గుట్టుగా క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం నడిపిస్తున్న నలుగురిని ఆదోని పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి నుంచి రూ.80లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి శనివారం ఈ కేసు వివరాలు వెల్లడించారు. స్థానిక పింజారివాడికి చెందిన పింజారి హుస్సేన్(చిద్దు) ఇంటిని కేంద్రంగా చేసుకుని పెద్ద ఎత్తున క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం త్రీటౌన్ సీఐ శ్రీరామ్ నేతృత్వంలో పోలీసులు దాడిచేశారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా సభ్యులు స్థానిక మరాఠీ గేరికి చెందిన బోయ రామన్న కుమారుడు బోయ మహానంది, పింజారివాడికి చెందిన రుక్మద్దీన్ కుమారుడు పింజారి హుస్సేన్, రాజేశ్వరినగర్‌కు చెందిన ఖాదర్‌బాషా కుమారుడు పి.మహ్మద్, తెలంగాణకు చెందిన మద్దిలేటి ఆచారి కుమారుడు వడ్ల రాఘవేంద్ర ఆచారిలను అరెస్ట్‌చేశారు. వారి నుంచి రూ.80లక్షల నగదు, ఒక కారు, రెండు బైకులతోపాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వడ్ల రాఘవేంద్ర ఆచారి దాదాపు ఐదేళ్ల నుంచి అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రూ.వెయ్యికి రూ.300 కమీషన్ ప్రకారం వేర్వేరు ప్రాంతాల్లో బుకీలను ఏర్పాటు చేసుకుని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామని డీఎస్పీ తెలిపారు.

ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఇలా...

ఈ ముఠా సభ్యులు ముందుగా బెట్టింగ్ పెట్టే వారి సెల్ ఫోన్‌కు వెబ్‌సైట్ లింకు, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పంపిస్తారు. వారు పంపిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా వెబ్‌సైట్ లింకు ఓపెన్ చేస్తే మ్యాచ్ లైవ్ కనిపిస్తుంది. మ్యాచ్ చూస్తూ లైవ్‌లోనే బెట్టింగ్‌లు, ఆన్‌లైన్‌లోనే డబ్బుల లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

యజ్ఞ సందర్శనకు పాస్‌లతో పనిలేదు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి, అమరావతి/విజయవాడ కల్చరల్: రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం విజయవాడలో నిర్వహిస్తున్న మహా యజ్ఞాన్ని సందర్శించే భక్తులకు ఎలాంటి పాస్‌లు అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. అందరూ యజ్ఞ కార్యక్రమాలను దర్శించుకునేలా దేవదాయ శాఖ తగిన ఏర్పాట్లు చేసిందన్నారు. విజయవాడ మునిసిపల్ స్టేడియంలో జరుగుతున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఇతర అధికారులతో కలిసి శనివారం మీడియాతో మాట్లాడుతూ.. యజ్ఞ కార్యక్రమాలను భక్తులు వీక్షించేందుకు, యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు నాలుగు క్యూలైన్లను ఏర్పాటు చేశామన్నారు. యజ్ఞ కార్యక్రమాలను చూసేందుకు వచ్చే భక్తులపై క్యూలైన్లలో యజ్ఞ కార్యక్రమంలో ఉపయోగించే పవిత్ర జలాలను చల్లే చర్యలు చేపట్టామన్నారు. యాగశాల వద్ద 16వ తేదీన ఉదయం 500 మంది మహిళలతో (సుభాషిణి భక్తులతో) సుభాషిణి పూజకు అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు.

టీడీపీ గూండాల దౌర్జన్యం దుర్మార్గం

958వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి మండిపాటు



రిలే నిరాహార దీక్షలలో బహుజన నాయకులు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పేదలకు స్థలాలివ్వకుండా రైతుల ముసుగులో ఉన్న టీడీపీ గూండాలు దౌర్జన్యాలకు పాల్పడుతుండటం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి ఆవేదన వ్యక్తం చేసింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 958వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు శనివారం పలువురు హాజరయ్యారు. రాజధానిలో సీఆర్డీఏ చట్టంలో పొందుపరచిన విధంగానే సీఎం వైఎస్ జగన్ 5 శాతం భూమిని పేదలకు కేటాయిస్తుంటే కులవాదులకు వచ్చిన ఇబ్బందేమిటో చెప్పాలన్నారు. పోరాటం అంటే ఎక్కడైనా రైతులు తమ హక్కుల కోసం పోరాడాలి కానీ ఇక్కడ మాత్రం అమరావతి ముసుగులో చంద్రబాబు చేసిన దోపిడీని కాపాడి, కుల రాజధాని నిర్మించేందుకు ఆరాటపడుతుండటం సిగ్గుచేటన్నారు. పేదల స్థలాలకు అడ్డుతగులుతున్న బాబు అండ్ కోను వామపక్షాల నాయకులు పల్లెత్తు మాట కూడా అనకపోవడం దుర్మార్గమన్నారు. సమితి నేతలు నూతక్కి జోషి, పులి దాసు, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, బొడాల చలపతిరావు, మహిళలు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై టీడీపీ నాయకుల దాడి అమానుషం



తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

- తణుకులో జర్నలిస్టుల నిరసన
- సాక్షి రిపోర్టర్‌పై దాడికి ఖండన

తణుకు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 'సాక్షి' టీవీ రిపోర్టర్ ఎస్.సత్యప్రసాద్‌పై టీడీపీ నాయకుల దాడిని జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. తణుకులో శుక్రవారం రాత్రి ప్రతిపక్ష నేత చంద్రబాబు బహిరంగ సభ సందర్భంగా వీడియో తీస్తున్న సత్యప్రసాద్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి, ఆయన సెల్‌ఫోన్‌ను లాక్కుని ధ్వంసం చేశారు. టీడీపీ నేతల తీరును ఖండిస్తూ శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘ నాయకుడు కొడమంచిలి కృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు దిగడం బాధాకరమన్నారు. వివిధ రకాల సమస్యలు, అంశాలకు సంబంధించి వృత్తిపరంగా అనేకం చిత్రీకరిస్తుంటామని, అది తమ విధుల్లో భాగమని, కానీ శుక్రవారం తన వృత్తిలో నిమగ్నమైన రిపోర్టర్‌పై టీడీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని అన్నారు. అనంతరం సత్యప్రసాద్‌పై దాడికి పాల్పడినవారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా తారకేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ



ప్రసంగిస్తున్న సచ్చిదానంద సరస్వతి మహాస్వామి, చిత్రంలో మఠాధిపతులు

హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

బాపట్ల అర్బన్: సూర్యలంక తీరంలో నూతనంగా నిర్మించిన తారకేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గోలి వెంకట సుబ్రహ్మణ్యశర్మ అవధాని పర్యవేక్షణలో శ్రీవిజయరాజు గణపతి, అన్నపూర్ణా సమేత శ్రీతారకేశ్వర స్వామి వార్లు, నంది, ధ్వజ, శిఖర ప్రతిష్ఠలను తుని తపోవనం మఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి మహాస్వామి చేతుల మీదుగా చేసి కుంభాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ పనబాకలక్ష్మి, నరేంద్ర వర్మ, ఉమ్మారెడ్డి రామారావు తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. ఉత్సవంలో సచ్చిదానంద సరస్వతి మహాస్వామి, తిరుపతి, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, చెన్నై రామకృష్ణ మఠ స్వామీజీలు స్వామి సుకృతానందజీ, స్వామి వినిశ్చలానందజీ మహరాజ్, స్వసంవేద్యానందాజీ, రఘునాథనందాజీ మహరాజ్, గుంటూరు శారదా మఠ మతాజీలు అనుగ్రహ భాషణం చేశారు. దాతలు మంతెన దశరథ మహారాజు, మంతెన సత్యనారాయణ రాజు, దెందుకూరి సత్యవతి, బైర్రాజు నందిని, పెనుమెత్స నాగరాజు, డాక్టర్ అడ్డగడ సుబ్బారావు, మంతెన రామకృష్ణంరాజు, డాక్టర్ మంతెన నరసరాజు దంపతులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభంజనం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం ● 224 స్థానాల్లో 136 హస్తగతం ● బీజేపీకి 65 సీట్లే



రాజస్తాన్‌లోని బికనేర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

సాక్షి, బెంగళూరు: కన్నడ ఓటరు కాంగ్రెస్‌కే జై కొట్టాడు. రాష్ట్రంలో అధికార పార్టీని ఓడించే నాలుగు దశాబ్దాల ఆనవాయితీని కొనసాగిస్తూ బొమ్మై సారథ్యంలోని బీజేపీ సర్కారును ఇంటికి సాగనంపాడు. ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు కాంగ్రెస్ ఉచిత హామీల ముందు మోదీ మేజిక్ ఏమాత్రం పని చేయలేదు. కార్యకర్త స్థాయి నుంచి అగ్ర నాయకత్వం దాకా సమష్టిగా చేసిన కృషి ఫలించి కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. హంగ్ ఊహాగానాలకు, హోరాహోరీ తప్పదన్న విశ్లేషణలకు చెక్ పెడుతూ తిరుగులేని మెజారిటీ సాధించింది. 224 సీట్ల అసెంబ్లీలో మెజారిటీకి 113 సీట్లు కావాల్సి ఉండగా ఏకంగా 136 స్థానాలను హస్తగతం చేసుకుంది. తద్వారా పదేళ్ల తర్వాత రాష్ట్రంలో సొంతంగా మెజారిటీ సాధించి సంబరాల్లో మునిగిపోయింది. ఇండియాటుడే వంటి ఒకట్రెండు సంస్థలు తప్ప మిగతా ఎగ్జిట్ పోల్స్ ఏవీ కాంగ్రెస్‌కు ఇంతటి విజయాన్ని ఊహించలేకపోయాయి. కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీపై విపక్షాల ఉమ్మడి పోరుకు నేతృత్వం వహించేందుకు అత్యవసరమైన నైతిక బలాన్ని ఈ విజయం ద్వారా కాంగ్రెస్ కూడగట్టుకుంది. అంతేగాక వరుస ఎన్నికల్లో బీజేపీ చేతిలో కోలుకోలేని దెబ్బలు తింటూ ఓ పెద్ద రాష్ట్రంలో నికార్సైన గెలుపు కోసం ఏళ్ల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న పార్టీకి ఈ ఘన విజయం ఎంతో ఊరటనిచ్చింది. మరోవైపు కర్ణాటక వంటి కీలక రాష్ట్రంలో ఇంతటి పరాభవం బీజేపీకి గట్టి ఎదురు దెబ్బేనని భావిస్తున్నారు. ఈ ఓటమితో దక్షిణాదిన ఏకైక రాష్ట్రం కూడా కమలం పార్టీ చేజారింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 104 సీట్లతో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ ఈసారి 39 స్థానాలు కోల్పోయింది. 78 సీట్లకు పరిమితమైన కాంగ్రెస్ ఈసారి ఏకంగా మరో 58 స్థానాలు కైవసం చేసుకుంది. ఇక జేడీ(ఎస్) ఇంటి గోలతో చిర్రెత్తిన ఓటరు ఈసారి ఆ పార్టీకి గట్టిగానే వాత పెట్టాడు. హంగ్ వస్తే ఎప్పట్లా కింగ్‌మేకర్ కావాలని ఆశపడ్డ ఆ పార్టీ దారుణంగా చతికిలపడింది. 2018లో గెలిచిన 37 సీట్లలో ఏకంగా 18 స్థానాలు కోల్పోయి చిక్కి 'సగ'మైంది. 2018లో కాంగ్రెస్, జేడీ(ఎస్) ఏర్పాటు చేసిన సంకీర్ణ ప్రభుత్వాన్ని 14 నెలలకే బీజేపీ పడగొట్టింది. ఆ రెండు పార్టీల్లోని 17 మంది ఎమ్మెల్యేలను లాగేసింది. వారితో రాజీనామాలు చేయించి ఉప ఎన్నికల్లో 15 సీట్లు గెలిచి మెజారిటీ సాధించి గద్దెనెక్కింది. ఈ గోడ దూకుళ్లతో విసిగిన కన్నడ జనం ఈసారి సుస్థిర ప్రభుత్వానికి జై కొట్టారు. ఫలితాల సరళి స్పష్టమవుతూనే బెంగళూరు నుంచి హస్తిన దాకా కాంగ్రెస్ కార్యాలయాల్లో సంబరాలు మిన్నంటాయి. బీజేపీ కార్యాలయాలు కళ తప్పి కన్పించాయి. ప్రజా తీర్పును శిరసావహిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రకటించారు. ఘనవిజయం సాధించిన కాంగ్రెస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇది విద్వేష రాజకీయాలపై ప్రేమ సాధించిన విజయమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. తృణమూల్, ఎన్సీపీ సహా దేశవ్యాప్తంగా పలు విపక్ష పార్టీలు కాంగ్రెస్ విజయం పట్ల హర్షం వెలిబుచ్చాయి. బీజేపీ నియంతృత్వ పోకడలకు, కక్షసాధింపు రాజకీయాలకు ఇదో గుణపాఠమన్నాయి.

ఆద్యంతం హస్తం హవా...

కర్ణాటక అసెంబ్లీకి బుధవారం ఒకే దశలో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఏకంగా 73.19 శాతం పోలింగ్ నమోదైంది. శనివారం ఉదయం 8 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఓట్ల లెక్కింపు మొదలైంది. ప్రారంభం నుంచే కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. ఏ దశలోనూ వెనక్కు తగ్గకుండా దూసుకుపోయింది. ఆద్యంతం వెనుకంజలోనే కొనసాగిన బీజేపీ ఎక్కడా కోలుకోలేకపోయింది.

కాంగ్రెస్‌కు అభినందనలు



''కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి అభినందనలు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆ పార్టీ కృషి చేస్తుందని ఆశిస్తున్నా. కర్ణాటక ఎన్నికల్లో మాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. అహర్నిశలు శ్రమించిన బీజేపీ కార్యకర్తలకు అభినందనలు. రానున్న రోజుల్లో మరింత దీక్షతో కర్ణాటక ప్రజలకు సేవలందిస్తాం''

– ప్రధాని నరేంద్ర మోదీ

ఇది ప్రజల విజయం

''ఇది ప్రజా గెలుపు. సమష్టి కృషి. బీజేపీ నాయకుల అహంకారమే వారిని ఓడించింది. కాంగ్రెస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించిన కర్ణాటక ప్రజలకు ధన్యవాదాలు. ఈ గెలుపుతో దక్షిణ భారతదేశం బీజేపీరహితంగా మారింది. రాజ్యాంగ రక్షణకు ప్రజలిచ్చిన విజయమిది. కాంగ్రెస్ ఇచ్చిన ఐదు గ్యారెంటీల అమలుకు తొలి కేబినెట్ భేటీలోనే చర్యలు తీసుకుంటాం. రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేసిన 99 శాతం ప్రాంతాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది''

– కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే


గెలుపోటములను సమానంగా చూస్తా



''రాష్ట్ర ప్రజలిచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమం. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తాను. నాకు, మా పార్టీకి ఇవేమీ కొత్తకాదు. ఈ ఓటమి నాకు గానీ, మా పార్టీకి గానీ అంతిమం కాదు. మా పోరాటం ఆగదు. ప్రజలకు తోడుగా నిలుస్తాం. పార్టీని బలోపేతం చేస్తాం. ఈ ఫలితాలతో ఎలాంటి ఆందోళనకు గురికావద్దని మా కార్యకర్తలను కోరుతున్నా. మా పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు కృతజ్ఞతలు''

– జేడీ(ఎస్) నేత కుమారస్వామి

పార్టీల వారీగా వచ్చిన ఓట్లు



6 ప్రాంతాల్లో నాలుగింట్లో కాంగ్రెసే

కర్ణాటకలోని ఆరు ప్రాంతాల్లో నాలుగింట్లో కాంగ్రెస్ హవాయే కొనసాగింది. జేడీ(ఎస్) కంచుకోట పాత మైసూరుతో పాటు ముంబై కర్ణాటక, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత ప్రాంతం హైదరాబాద్ కర్ణాటక, సెంట్రల్ కర్ణాటకల్లో కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించింది. బీజేపీ కేవలం కోస్తా కర్ణాటకలోనే పై చేయి సాధించగా బెంగళూరులో కాంగ్రెస్‌కు సమవుజ్జీగా నిలిచింది. రాహుల్ గాంధీ ఇటీవలి భారత్ జోడో పాదయాత్రలో భాగంగా కర్ణాటకలో నిడిచిన 20 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 15 చోట్ల కాంగ్రెస్ నెగ్గడం విశేషం.

బీజేపీకి తగ్గింది 0.2 శాతం ఓట్లే... పోయిందేమో 39 సీట్లు!

బీజేపీకి మొత్తమ్మీద ఓట్ల శాతం తగ్గకపోయినా ఏకంగా 39 సీట్లు చేజారడం విశేషం. ఆ పార్టీకి 2018లో 36.22 శాతం రాగా ఈసారి కూడా 36 శాతం సాధించింది. అప్పుడు 38 శాతం సాధించిన కాంగ్రెస్ ఈసారి ఏకంగా 43 శాతం ఒడిసిపట్టింది. 5 శాతం అదనపు ఓట్లతో అదనంగా 58 సీట్లు కొల్లగొట్టింది. 1999లో కాంగ్రెస్ 132 సీట్లు గెలిచింది. ఆ తర్వాత దాదాపు పాతికేళ్లకు అంతకంటే మెరుగైన విజయం సాధించింది. జేడీ(ఎస్) ఓట్ల శాతం 18.36 నుంచి 13.2కు తగ్గింది. రద్దవనున్న అసెంబ్లీలో బీజేపీకి 117 సీట్లు, కాంగ్రెస్‌కు 69, జేడీ(ఎస్)కు 29, బీఎస్పీకి 1, స్వతంత్రులకు 2 సీట్లున్నాయి. 6 స్థానాలు ఖాళీగా ఉన్నాయి.



ఫలితాల అనంతరం డీకే శివకుమార్, ఖర్గే, సిద్దరామయ్య విజయాభివాదం

హస్తానికి బూస్టర్ డోసు


ఇక కాంగ్రెస్ నేతృత్వంలోనే విపక్ష కూటమి!

న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దక్కిన అఖండ విజయం కాంగ్రెస్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. కీలకమైన రాష్ట్రంలో పాగా వేయడంతో పార్టీ నేతల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. చాలాఏళ్లుగా గెలుపు రుచి లేకుండా నీరసించిపోయిన కాంగ్రెస్‌కు ఇది నిజంగా ఒక బూస్టర్ డోసు. వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు ఇది దివ్యౌషధంగా పనిచేయనుంది. కేంద్రంలో అధికార బీజేపీని ఢీకొట్టే ప్రధాన ప్రతిపక్షం ఎవరన్న ప్రశ్నకు కొంతవరకు సమాధానం దొరికినట్లే. బీజేపీకి వ్యతిరేకంగా ఒక బలమైన కూటమిని నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ అవి సాకారం కావడం లేదు. బీజేపీయేతర, కాంగ్రెస్సేతర కూటమి అనే ప్రయత్నాలకు బ్రేక్ పడొచ్చని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. కర్ణాటకలో విజయం నేపథ్యంలో ఇతర పార్టీలు కాంగ్రెస్ ఛత్రఛాయలోకి చేరే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోనే ఏకైక విపక్ష కూటమి ఏర్పాటైనా ఆశ్చర్యం లేదు.


ఇక నాలుగు రాష్ట్రాలపై గురి

లోక్‌సభ సభ్యుడిగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ఇటీవలే అనర్హత వేటు వేయడం, అధికారిక నివాసం నుంచి ఆయనను బలవంతంగా ఖాళీ చేయించడం కాంగ్రెస్ పట్ల ప్రజల్లో సానుభూతి కలిగించాయి. రాహుల్ బీసీల వ్యతిరేకి అంటూ బీజేపీ చేసిన ప్రచారం ఫలించలేదు. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాన్ని హస్తగతం చేసుకోవడం కాంగ్రెస్‌లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కర్ణాటకలో స్థానిక నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం, వారితోనే ఎక్కువగా ప్రచారం చేయించడం కాంగ్రెస్‌కు లాభించింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర జరిగిన ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లో 15కు పైగా సీట్లు సాధించింది. బీజేపీ ప్రభుత్వ అవినీతిని కాంగ్రెస్ ఎండగట్టింది. కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రజలు విశ్వసించారు. ఈ ఏడాది తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ రెండు రాష్ట్రాల్లో మళ్లీ నెగ్గడంతోపాటు తెలంగాణ, మధ్యప్రదేశ్‌లోనూ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. కర్ణాటకలో విజయంతో ఆ పార్టీ ఇక మరింత దూకుడుగా వ్యవహరించనుంది. ఈ గెలుపు జాతీయ స్థాయిలో తమ పార్టీ పునర్వైభవానికి దోహదపడుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ చెప్పారు.

కర్ణాటకలో గత మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు



2018, 2023లలో ప్రాంతాల వారీగా పార్టీలకు వచ్చిన సీట్లు



కలసి ఉంటే కలదు జయం

- ఎన్నికల్లో కలసికట్టుగా పోరాడి గెలిచిన కాంగ్రెస్
- కలిసొచ్చిన ఖర్గే అనుభవం సిద్ధూ, డీకే శివకుమార్ దోస్తీ

రాహుల్ జోడో యాత్ర నింపిన ఉత్సాహంతో, మల్లికార్జున ఖర్గే మంత్రాంగంతో ఉప్పు, నిప్పుగా ఉండే దిగ్గజ నేతలు సిద్ధూ, డీకే ఒక్కటయ్యారు. పోస్టర్ల నుంచి ప్రచారం వరకు ఒకే మాట ఒకే బాటగా నడిచారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. మత రాజకీయాలను సమష్టిగా ఎదుర్కొన్నారు. ఫలితంగా కర్ణాటకలో కాంగ్రెస్ అందరికీ కొత్తగా కనిపించింది. అనూహ్య విజయంతో లోక్‌సభ ఎన్నికలకు కావల్సిన ఆత్మవిశ్వాసాన్ని నింపుకుంది.

అవినీతిపై ప్రచారం

రాష్ట్రంలో బసవరాజ్ బొమ్మై సర్కార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల్ని కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది. పేటీఎంను గుర్తుకు తెచ్చేలా ''పేసీఎం'' అంటూ బొమ్మై ముఖం, క్యూఆర్ కోడ్‌తో పోస్టర్లు వేయడం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. 40% కమీషన్ సర్కార్ అంటూ ప్రచారాన్ని గ్రామ గ్రామల్లోకి తీసుకువెళ్లారు. గ్రామీణాభివృద్ధి మంత్రి కె.ఎస్. ఈశ్వరప్ప పబ్లిక్ వర్క్స్ ప్రాజెక్టుల్లో 40% కమీషన్‌ను డిమాండ్ చేశారన్న ఆరోపణలతో ఈ ప్రచారం ఊపందుకుంది. ఎన్నికలకు కొద్ది నెలల ముందు బీజేపీ ఎమ్మెల్యే విరూపాక్ష కుమారుడు 40 లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం వంటివన్నీ కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకుంది.

సిద్ధూ, డీకే కాంబినేషన్

కాంగ్రెస్ పార్టీకి మరే రాష్ట్రంలో లేని విధంగా బలమైన నాయకులు కర్ణాటకలో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ జోడు గుర్రాలుగా మారి గెలుపు రథాన్ని పరుగులు పెట్టించారు. ఇద్దరి మధ్యనున్న విభేదాలను పక్కన పెట్టి కలసికట్టుగా పని చేశారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ప్రజాధ్వని యాత్ర నిర్వహించారు. ఎన్నికల వ్యూహాల దగ్గర్నుంచి పార్టీ మేనిఫెస్టో వరకు, టిక్కెట్ల పంపిణీ నుంచి బూత్ మేనేజ్‌మెంట్ వరకు సంయుక్తంగా వ్యూహాలు రచించారు. పార్టీలో దిగ్గజ నాయకులిద్దరూ ఒక్కటి కావడంతో నాయకులంతా చేతులు కలపడం రావడం కాంగ్రెస్‌కు కలిసొచ్చింది.

ఖర్గే అనుభవం

ఏ పార్టీకైనా అనుభవజ్ఞులైన పెద్దలే కొండంత అండ. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే 80ఏళ్ల వయసులో తన సొంత రాష్ట్రంలో ఎన్నికల్ని అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకున్నారు. పార్టీలో అత్యంత శక్తిమంతమైన నాయకులైన సిద్దరామయ్య, శివకుమార్‌లను ఏకతాటిపైకి తీసుకురావడంతో ఖర్గే సగం విజయం సాధించారు. టిక్కెట్ల పంపిణీపై ముందస్తుగా కసరత్తు చేసి 124 మందితో తొలి జాబితా విడుదల చేయడం, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇస్తూ నియోజకవర్గాల్లో అసమ్మతి గళాలు లేకుండా చూశారు. అటు అధిష్టానానికి, ఇటు స్థానిక నాయకత్వానికి వారధిగా ఉంటూ నెల రోజులుగా రాష్ట్రంలోనే మకాం వేసి పార్టీని గెలుపు తీరాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు.

సానుభూతే ఆయుధం

బీజేపీ జాతీయ నాయకత్వం చేసిన కక్షపూరిత రాజకీయాలు కూడా వికటించాయి. ప్రభుత్వంపై ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా పట్టించుకోని వారు కాంగ్రెస్ నాయకులపై సీబీఐ, ఈడీ కేసులు పెట్టి వేధించడం ప్రజల్లో సానుభూతిని పెంచింది. పరువు నష్టం కేసులో రాహుల్ దోషిగా తేలి ఎంపీగా అనర్హత వేటునెదుర్కోవడం, పీసీసీ అధ్యక్షుడు శివకుమార్‌పై సీబీఐ కేసులు పెట్టి తీహార్ జైల్లో పెట్టడం వంటివి కాంగ్రెస్‌కు అనుకూలంగా మారాయి. శివకుమార్ కనకపుర నియోజకవర్గం నుంచి లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించడమే దీనికి తార్కాణం.

లింగాయత్ ఓట్లు

కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి బలమైన మద్దతుదారులైన లింగాయత్ ఓటు బ్యాంకుని కాంగ్రెస్ పార్టీ విజయవంతంగా చీల్చింది. బి.ఎస్. యడీయూరప్పని సీఎంగా తప్పించడంతో ఆ వర్గాన్ని పార్టీ నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఎన్నికలకు కాస్త ముందు మాజీ ముఖ్యమంత్రి జగదీష్ షెట్టర్, మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ్ సావాదిలు కాంగ్రెస్ గూటికి చేరడం కలిసొచ్చింది. పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ స్వయంగా లింగాయత్ మఠాలన్నీ సందర్శించి తాము అధికారంలోకి వస్తే వారి డిమాండ్లన్నీ తీరుస్తామన్న హామీలు ఇవ్వడంతో ఈ సారి లింగాయత్ ఓటర్లు కాంగ్రెస్‌వైపు మళ్లారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మైనార్టీల అండదండ..

పోలింగ్‌కు కొద్ది రోజులు ముందు బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ చేర్చడం ఆ పార్టీకి నష్టం చేకూరుస్తుందని అందరూ భావించారు. కానీ మైనార్టీ ఓట్ల ఏకీకరణ జరిగి కాంగ్రెస్‌కు కలిసి వచ్చింది. ఓల్డ్ మైసూరుతో పాటు అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిం ఓటర్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు ఓటు వేశారు. హిజాబ్, హలాల్, ఆజాన్ వివాదాలతో ముస్లిం ఓటర్లందరూ ఏకమయ్యారు. ఓల్డ్ మైసూరులో కాంగ్రెస్, జేడీ(ఎస్) మధ్య ముస్లిం ఓట్లు చీలిపోయేవి. కానీ ఈ సారి అన్ని ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ వెంటే మైనార్టీలు నడిచారు.

జోడో యాత్ర జోష్..

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కూడా పార్టీ విజయానికి దోహదపడింది. కర్ణాటకలో అత్యధికంగా 24 రోజులు నడిచిన రాహుల్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఎనిమిది జిల్లాల్లో 500 కి.మీ. మొత్తం 20 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా రాహుల్ నడిచారు. 2018 ఎన్నికల్లో ఈ 20 సీట్లలో అయిదు స్థానాలనే గెలుచుకున్న కాంగ్రెస్ ఈ సారి 15 స్థానాల్లో విజయభేరి మోగించింది.

'సార్వత్రిక' విజయానికి తొలి మెట్టు



''కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుకు తొలి మెట్టు. ఇవి అత్యంత కీలకమైన ఎన్నికలు. రాహుల్ గాంధీ ప్రధాని అవ్వొచ్చేమో. బీజేపీయేతర పార్టీలు ఇక త్వరగా ఏకతాటి మీదకు వస్తాయని భావిస్తున్నా. బీజేపీ మత రాజకీయాలను ఓడించిన ప్రజలకు జేజేలు''

– కాంగ్రెస్ నేత సిద్దరామయ్య

లోకల్ వోకల్

కాంగ్రెస్ పార్టీ ఈ సారి స్థానిక సమస్యలపైనే అత్యధికంగా దృష్టి సారించింది. జాతీయ స్థాయిలో ప్రభావం చూపించే అంశాల జోలికి వెళ్లలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇమేజ్‌పై ఆధారపడి బీజేపీ ఎన్నికలకి వెళ్లడాన్ని పదే పదే ప్రశ్నించింది. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ఇది రాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలే తప్ప ప్రధాని మోదీ గురించి ఎన్నికలు కాదంటూ ప్రతీ సభలోనూ గళమెత్తారు. కాంగ్రెస్ అధిష్టానం కూడా స్థానికంగా పవర్‌ఫుల్ నాయకులనే ముందుంచి ప్రచారాన్ని నిర్వహించింది. ఇక రాహుల్ గాంధీ కూడా ప్రజలతో మమేకమైపోతూ స్థానిక అంశాలపైనే వారితో ముచ్చటించారు. ఫలితంగా పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా హస్తం గుర్తుకే ఓట్లు గుద్దేశారు.

గ్యారంటీ కార్డుకి కురిసిన ఓట్లు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఈసారి ఎన్నికల్లో ఓట్లు కురిపించాయి. అయిదు హామీలతో కాంగ్రెస్ విడుదల చేసిన గ్యారంటీ కార్డులో గృహజ్యోతి (గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్), గృహలక్ష్మి (ఇంటి మహిళా యజమానికి నెలకి రూ.2 వేలు ఆర్థిక సాయం), అన్న భాగ్య (నిరుపేద కుటుంబాలకు నెలకి 10 కేజీల ఉచిత బియ్యం) యువనిధి (నిరుద్యోగ యువతకి రెండేళ్ల ఆర్థిక సాయం) శక్తి (ఆర్టీసీ బస్సుల్లో మహిళలకి ఉచిత ప్రయాణం) హామీలు ప్రజల్ని విశేషంగా ఆకర్షించి కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టాయి.

ప్రేమ విపణి తెరుచుకుంది: రాహుల్



న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పనితీరుపై ప్రశంసలు కురిపించారు. విద్వేషంపై ప్రేమ విజయం సాధించిందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ ఫలితమే పునరావృతం కావడం ఖాయమన్నారు. ''కర్ణాటకలో విద్వేష బజార్ మూతపడింది. ప్రేమ బజార్ తెరుచుకుంది. కాంగ్రెస్‌కు అద్భుత విజయం కట్టబెట్టిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు. పార్టీ నేతలు, కార్యకర్తలకు అభినందనలు. మేం ద్వేషం, చెడు భాష వాడకుండా ప్రజలపై ప్రేమాభిమానాలే అండగా పోటీ చేసిన తీరుకు చాలా ఆనందంగా ఉంది. ఆశ్రిత పెట్టుబడిదారుల బలంపై పేదల బలమే గెలిచింది. రాష్ట్ర ప్రజలకిచ్చిన ఐదు హామీలను తొలి మంత్రివర్గ భేటీలోనే నెరువేరుస్తాం'' అని ప్రకటించారు.

సిద్ధూ, డీకేల్లో సీఎం ఎవరో!

నేడు సీఎల్పీ భేటీలో ఎంపిక ● అధిష్టానానిదే తుది నిర్ణయం

సాక్షి బెంగళూరు: విభేదాలు పక్కన పెట్టి ఒక్కతాటిపై నిలిచి కాంగ్రెస్‌ను గెలుపు బాటన నడిపిన మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం కోసం తీవ్ర పోటీ నెలకొంది. మరికొందరు సీనియర్లు కూడా రేసులో ఉండటంతో ఎంపిక అధిష్టానానికి సవాలుగా మారింది. సీఎం అభ్యర్థిని ఎన్నుకునేందుకు ఆదివారం సాయంత్రం కీలకమైన కాంగ్రెస్ శాసనసభా పక్ష భేటీ జరగనుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా ఇప్పటికే బెంగళూరు చేరారు. అధిష్టానం ఎవరికి ఓటేస్తుందన్నది ఆసక్తికరం. వెనుకబడిన వర్గానికి చెందిన సిద్ధరామయ్య సీఎం రేసులో ముందంజలో ఉన్నట్టు చెబుతున్నారు. అయితే పార్టీని అధికారంలోకి తేవడంలో ట్రబుల్ షూటర్ శివకుమార్ కూడా తీవ్రంగా శ్రమించారు. పైగా 61 ఏళ్ల డీకేకు గాంధీ కుటుంబం ఆశీస్సులున్నాయి. అయితే పార్టీ నేతల్లో అత్యధికుల మద్దతు సిద్ధూ సొంతం. వీరిద్దరి మధ్య వివాదాలకు తావు లేని రీతిలో అధికార పంపిణీ చేయాలని అధిష్టానం యోచనగా చెబుతున్నారు. ఇకపై ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించిన 75 ఏళ్ల సిద్ధూకు సీఎం, డీకేకు డిప్యూటీ, లేదా కీలక మంత్రి పదవి ఇచ్చి కొంతకాలానికి వారిని పరస్పరం మారుస్తారని భావిస్తున్నారు. దళిత నేత వైపు అధిష్టానం మొగ్గితే పరమేశ్వరకు చాన్సుంటుంది. బీజేపీకి ఓటు బ్యాంకుగా ఉన్న లింగాయతులు ఈసారి కాంగ్రెస్ వైపు నిలిచినందున ఆ వర్గానికి చెందిన పాటిల్‌కు అవకాశమివ్వాలన్న డిమాండ్లూ విన్పిస్తున్నాయి.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 14 । మే । 2023

సౌమ్యారెడ్డి గెలుపుపై సస్పెన్స్

బనశంకరి: బెంగళూరు జయనగర నియోజకవర్గంలో ఫలితాల్లో గందరగోళం నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి 160 ఓట్లతో గెలిచారని ప్రకటించారు. అయితే బీజేపీ నేతలు రీకౌంటింగ్‌కు పట్టుబట్టారు. ఈసారి బీజేపీ అభ్యర్థి సీకే.రామమూర్తి కి 17 ఓట్ల మెజారిటీ వచ్చింది. దీంతో కౌంటింగ్ కేంద్రమైన జయనగర ఎస్ఎస్ఎంఆర్‌వీ కాలేజీ వద్ద ఇరుపక్షాలు గొడవకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎంపీ తేజస్వీసూర్య కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చి ఆర్ఓ, పర్యవేక్షకులపై ఒత్తిడి తీసుకువచ్చి రీకౌంటింగ్ చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తూ ధర్నాకు దిగారు. 80 ఏళ్లకు పైబడినవారి బ్యాలెట్‌లో సిగ్నేచర్ సీల్ లేదు. దీంతో ప్రారంభదశ లోనే వీటిని తిరస్కరించారు, అది అధికారుల తప్పు అని బీజేపీ నేతలు అన్నారు. చివరకు ఎన్నికల అధికారులు ఫలితాన్ని పెండింగ్ పెట్టారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నేతలు మకాంవేశారు.

న్యూస్‌రీల్

మా తప్పులను సమీక్షిస్తాం: బొమ్మై

శివాజీనగర: మా తప్పులను విశ్లేషించుకుని మళ్లీ అధికారంలోకి వస్తామని బీజేపీ నేత బసవరాజ బొమ్మై అన్నారు. శనివారం హావేరిలో విలేకరులతో మాట్లాడిన ఆయన, తాము అన్ని విధాలా ప్రయత్నాలు చేశామని, అయినా మెజారిటీ దక్కలేదని వాపోయారు. మా కార్యకర్తలు, నాయకులు, ప్రధానమంత్రితో పాటుగా శ్రమించి పని చేశారు, కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ లభిస్తోంది. మా తప్పులను విశ్లేషించి, దాని గురించి సమీక్ష జరుపుతామని చెప్పారు. జాతీయ పార్టీగా మా సమస్యలను సరిచేసుకొని పార్లమెంట్ ఎన్నికలకు మళ్లీ సిద్ధమవుతామని చెప్పారు. పార్టీని పునః సంఘటితపరచి తాము మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు.

ప్రజా తీర్పే అంతిమం: కుమార

శివాజీనగర: ప్రజా తీర్పును స్వాగతిస్తున్నట్లు జేడీఎస్ మాజీ సీఎం హెచ్.డీ.కుమారస్వామి తెలిపారు. ఎన్నికల ఫలితాల గురించి ఆయన ట్విట్టర్లో స్పందించారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన ఆదేశాన్ని స్వాగతిస్తానని, ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పే అంతిమం . ఓటమి, గెలుపును సరి సమానంగా స్వీకరిస్తాను. అయితే ఈ ఓటమి ఫైనల్ కాదు. నా పోరాటం ఆగదని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. తమ పార్టీకి ఓటువేసిన అందరికీ కృతజ్ఞతలన్నారు. నాకు, నా కుటుంబానికి గెలుపు ఓటములు కొత్త కాదని, ఇంతకు ముందు హెచ్.డీ.దేవేగౌడ, హెచ్.డీ.రేవణ్ణ, తాను ఓటమి పాలయ్యామని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి శ్రమిస్తానని, రానున్న కొత్త ప్రభుత్వానికి మంచి జరగాలని తెలిపారు.

శివాజీనగరలో కాంగ్రెస్ విజయం

శివాజీనగర: రాజధానిలో కేంద్ర బిందువుగా ఉన్న శివాజీనగర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రిజ్వాన్ హర్షద్ భారీ మెజారిటీతో గెలుపొందారు. అధికార బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్.చంద్రుపై సుమారు 30 వేల మెజారిటీని సాధించారు. 2020లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత నియోజకవర్గంలో ఈ మూడున్నర సంవత్సరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులే తన విజయానికి కారణమని, తన గెలుపునకు శ్రమించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. తనపై విశ్వాసముంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ఓటర్లందరికి రుణపడి సదా మీ సేవలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా రెండోసారి అధిక మెజారిటీతో గెలుపొందిన రిజ్వాన్ హర్షద్‌ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

డీకే ఆనందభాష్పాలు

శివాజీనగర: విధానసభా ఎన్నికల్లో పార్టీకి సంపూర్ణ మెజారిటీ ఇచ్చినందుకు కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కృతజ్ఞతలు తెలియజేస్తూ కన్నీరు కార్చారు. శనివారం నగరంలో తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. నాయకులు సమైక్యంగా బీజేపీపై పోరాటం చేశారని, అందుకు గెలుపు లభించిందని చెప్పారు. సిద్దరామయ్యతో పాటుగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేశారని చెప్పారు. తాను ఢిల్లీలో తిహార్ జైలులో ఉన్న సమయంలో పార్టీ నాయకురాలు సోనియాగాంధీ జైలుకు వచ్చి ధైర్యం చెప్పారని తలుచుకుని కన్నీరు కార్చారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహకారం ఎన్నటికీ మరువమన్నారు. గెలిచిన, ఓడిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలన్నారు.

పార్లమెంటు ఎన్నికలకు దిక్సూచి: సిద్దు

మైసూరు: ఈ ఎన్నికల ఫలితాలు వచ్చే పార్లమెంటు ఎన్నికలకు దిక్సూచి అని సీఎల్పీ నాయకుడు సిద్దరామయ్య అన్నారు. శనివారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం 40 శాతం కమీషన్ల గురించి కాంట్రాక్టర్లు, రుప్సా సంస్థవారు ప్రధాని మోదీకి లేఖలు రాసినా స్పందించలేదన్నారు. తినను, తిననివ్వనని చెప్పే ప్రధాని కర్ణాటక బీజేపీ సర్కారును పట్టించుకోలేదన్నారు. బీజెపి పతనానికి ఇది ఆరంభమని, లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అన్నారు.

విమానంలో వృద్ధురాలు మృతి

దొడ్డబళ్లాపురం: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి బెంగళూరుకు విమానంలో బయలుదేరిన మహిళ ప్రయాణంలోనే కన్నుమూసిన ఘటన ఎయిర్ ఇండియా విమానంలో చోటుచేసుకుంది. వివరాలు... బెంగళూరుకు చెందిన వృద్ధ మహిళ (69)తన కుమారునితో కలిసి శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి బెంగళూరుకు 11వ తేదీన ఎయిర్ ఇండియా విమానంలో బయలుదేరింది. ఆరోజు రాత్రి 11 గంటల సమయంలో మహిళ అస్వస్థతకు గురైంది. విమానంలో సిబ్బంది ఆమెకు చికిత్స అందించినప్పటికీ మార్గమధ్యలో మరణించింది. విమాన పైలట్ ఈ విషయాన్ని బెంగళూరులోని ఎయిర్‌పోర్టు అధికారులకు తెలియజేశారు. శుక్రవారం ఉదయం విమానం కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో దిగగానే మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్వాస సమస్యతో ఆమె చనిపోయినట్లు తెలిసింది.

హంగ్ అడ్డుగోడ బద్ధలు

మార్చి 29 నుంచి ఎన్నికల కోడ్, ఏప్రిల్ 10 నుంచి నామినేషన్ల పర్వం, మే 10వ తేదీన పోలింగ్, ఈ తేదీల మధ్యలో దేశంలో హేమాహేమీల ప్రచార యుద్ధం. ఇక అందరూ ఎదురుచూసిన మే 13న విస్ఫోటనం వంటి ప్రజా తీర్పు వెలువడింది. ఎవరూ ఊహించనంతగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఘన విజయం. రెండు ప్రధాన పార్టీలు మెజారిటీ దరిదాపులకు రావడం, మధ్యలో జేడీఎస్ దయతో సంకీర్ణ సర్కారు ఏర్పడడం తరచూ చూసినదే. సంకీర్ణ సర్కార్లలో నిత్యం ఎమ్మెల్యేల బేరసారాల గొడవలతో విసిగిపోయిన ఓటరు ఈసారి ఒకే పార్టీకి పూర్తి మెజారిటీ ఇచ్చినట్లు భావించాలి.

- సంపూర్ణ మెజారిటీ హస్తగతం
- బేరసారాలకు ఓటర్ల చెల్లుచీటీ
- అంచనాలకు అందని రీతిలో ప్రజా తీర్పు
- బీజేపీ, జేడీఎస్‌లకు భారీ ఎదురుదెబ్బ



శనివారం రాయచూరులో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు



మంగళూరులో లెక్కింపు కేంద్రం వద్ద కార్యకర్తల పోటాపోటీ



ఎలాంటి అస్పష్టతకు తావులేకుండా తీర్పు



బెళగావిలో కాంగ్రెస్ ఆఫీసు ముందు టపాసులు



బెళగావిలో బీజేపీ కార్యకర్తల హంగామా

బనశంకరి: రాష్ట్ర విధానసభ ఎన్నికల ఫలితాలలో ఓటర్లు అనూహ్యమైన తీర్పునిచ్చారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి పట్టం గట్టారు. అధికార బీజేపీ, అలాగే మరో విపక్షం జేడీఎస్‌లకు తిరస్కారమే ఎదురైంది. ఈ ఎన్నికల్లో 136 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, బీజేపీ 65 సీట్లతో సరిపెట్టుకుంది. జేడీఎస్‌కు 19 స్థానాలు దక్కాయి ఇతరులు నాలుగుచోట్ల ఎన్నికయ్యారు. హంగ్ వస్తుందనుకున్న అంచనాలు బద్దలయ్యాయి.

బీజేపీ పరివారం రాక

డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ అగ్రనేతలు ఎంతగా ప్రచారం చేసినప్పటికీ ఓటర్లు విశ్వసించినట్లు లేదు. ప్రధాని మోదీ రికార్డుస్థాయిలో 10 రోజులపాటు రాష్ట్రంలో మూలమూలలా చెమటోడ్చి ప్రచారం చేశారు. ఎన్నికల చాణక్యునిగా పేరుపొందిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కన్నడ నాటే మకాం వేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా, యోగి ఆదిత్యనాథ్, మరెంతోమంది కాషాయవాదులు కాలికి బలపం కట్టుకుని ప్రచారంలో పాల్గొన్నారు. నటులు సుదీప్, దర్శన్ తో పాటు అనేకమంది కాషాయానికి మద్దతుగా ప్రచారంలోకి దిగారు. కానీ ఫలితం మాత్రం తిరగబడింది.

ప్రతిపక్షాల పోరు

కాంగ్రెస్ తరఫున ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ముమ్మరంగా సభలు, రోడ్‌షోలలో పాల్గొన్నారు. సోనియా గాంధీ సైతం ఒక బహిరంగ సభకు హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు సరేసరి. జేడీయస్ పార్టీలో కుమారస్వామి, హెచ్‌డీ దేవేగౌడ తదితరులు ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ధరలు పెంపు, బీజేపీ ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలను ప్రధానంగా ప్రస్తావించారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం విజయాలపై ప్రచారం చేసింది. జేడీయస్ పంచరత్న పథకాలను నమ్ముకొంది.

ప్రముఖుల గెలుపు

శనివారం సాగిన ఓట్ల లెక్కింపులో అనుకోని ఫలితం వెలువడింది. బెంగళూరుతో సహా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో కౌంటింగ్ కేంద్రాల వద్ద జాతరను మించిన జనసందోహం కనిపించింది. కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్, సీఎల్పీ నేత సిద్దరామయ్య, సీఎం బసవరాజ బొమ్మై, పద్మనాభనగరలో మంత్రి ఆర్.అశోక్, మల్లేశ్వరంలో మంత్రి అశ్వత్‌నారాయణ, శికారిపురలో యడియూరప్ప తనయుడు, బీజేపీ అభ్యర్థి బీవై.విజయేంద్ర, చెన్నపట్టణలో హెచ్‌డీ.కుమారస్వామి గెలుపొందారు. అనేకచోట్ల ఊహించని రీతిలో ఓటర్ల తీర్పు వెలువడడం విశేషం.





హావేరిలో కాంగ్రెస్ కార్యకర్తల విజయోత్సవం

కాంగ్రెస్‌కు కలిసొచ్చిన కాలం

- రాహుల్ యాత్ర, హామీలు, ఐకమత్యం

- బొమ్మై సర్కారు అన్ని కాంట్రాక్టులు, ప్రాజెక్టుల్లో 40 శాతం కమీషన్లు తీసుకుంటోందని కాంగ్రెస్ పార్టీ విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగింది. మంత్రి కేఎస్ ఈశ్వరప్పపై ఆరోపణలు చేస్తూ కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకోవడం కాంగ్రెస్ పార్టీ ఆరోపణలకు బలం చేకూర్చింది. మరోవైపు ఎమ్మెల్యే మాడాల్ విరూపాక్ష కుమారుడిపై లోకాయుక్త దాడిలో లక్షల నగదు పట్టుబడడంతో బీజేపీ మరింత ఇరకాటంలో పడింది.
- ఐదు ప్రధాన హామీలను కాంగ్రెస్ ప్రకటించింది. ప్రతి నెల బీపీఎల్ కుటుంబానికి 10 కేజీల ఉచిత బియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నిరుద్యోగ యువతకు నెలవారీ భృతి, ప్రతి గృహిణికి రూ. 2 వేల ఆర్థిక సాయం, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు వాటిని నెరవేర్చాల్సి ఉంది.
- రాహుల్ గాంధీ చేపట్టిన భారత జోడో యాత్రతో పాటు రాష్ట్ర నాయకులు చేసిన మేకెదాటు పాదయాత్ర, ఫ్రీడమ్ మార్చ్ వంటి యాత్రలు కాంగ్రెస్ పార్టీకి మైలేజ్‌ను తీసుకొచ్చాయి.
- సీఎం పదవి కోసం సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య గట్టి పోటీ ఉంది. అయినా ఆ విషయాన్ని పక్కన పెట్టి ఎన్నికల్లో పార్టీ విజయమే పరమావధిగా ఈ ఇద్దరు నేతలు తీవ్రంగా శ్రమించారు. –సాక్షి, బెంగళూరు

ఏ జిల్లాలో ఎవరు కింగ్?



ధార్వాడలో వాహనానికి భారీ జెండాలతో బీజేపీ నేతల సందడి

- జిల్లాల్లో పార్టీలు గెలిచిన సీట్లు ఇవీ

బనశంకరి: అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని జిల్లాల్లో కాంగ్రెస్, కొన్ని జిల్లాల్లో బీజేపీ పట్టు కనబరిచాయి. మెజారిటీ జిల్లాల్లో హస్తం హవా కనిపించింది. తానూ ఉన్నానంటూ జేడీఎస్ కొన్ని చోట్ల సీట్లను సాధించింది. వివరాలు...

జిల్లా	బీజేపీ	కాంగ్రెస్	జేడీఎస్	ఇతరులు	మొత్తం
బెంగళూరు	15	13	0	0	28
బె.గ్రామాంతర	01	03	0	0	04
బళ్లారి	0	05	0	0	05
విజయనగర	01	02	01	01	05
కొప్పళ	01	03	0	01	05
కోలారు	0	04	02	0	06
ఉడుపి	05	0	0	0	05
ఉత్తర కన్నడ	02	04	0	0	06
కలబురిగి	02	07	0	0	09
కొడగు	0	02	0	0	02
గదగ	02	02	0	0	04
చామరాజనగర	0	03	01	0	04
చిక్కబళ్లాపుర	0	03	01	01	05
చిక్కమగళూరు	0	05	0	0	05
చిత్రదుర్గ	01	5	0	0	06
తుమకూరు	02	7	02	0	11
దక్షిణకన్నడ	06	02	0	0	08
దావణగెరె	01	06	0	0	07
ధారవాడ	03	04	0	0	07
బాగల్‌కోటే	02	05	0	0	07
బీదర్	04	02	0	0	06
బెళగావి	07	11	0	0	18
మండ్య	0	05	01	01	07
మైసూరు	01	08	02	0	11
యాదగిరి	0	03	01	0	04
రామనగర	0	3	01	0	04
రాయచూరు	02	04	01	0	07
విజయపుర	01	06	01	01	08
శివమొగ్గ	03	03	01	0	07
హావేరి	01	05	0	0	06
హాసన్	02	01	04	0	07

స్పీకర్ సహా మంత్రుల ఓటమిబాట

- 12 మందికిపైగా పరాభవం

శివాజీనగర: ఈ ఎన్నికల్లో బీజేపీలో 12 మందికిపైగా మంత్రులు ఇంటిముఖం పట్టారు. మంత్రులు కే సుధాకర్, బీ శ్రీరాములు, వీ సోమణ్ణ, మురుగేశ్ నిరాణి, బీసీ పాటిల్ వంటి సీనియర్లు ఇందులో ఉన్నారు. స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరి కూడా ఓటమిపాలయ్యారు.

సుధాకర్.. శ్రీరాములు..

- చిక్కబళ్లాపుర నియోజకవర్గంలో మంత్రి కే.సుధాకర్ ఓడిపోగా కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ ఈశ్వర్ గెలుపొందారు.
- బళ్లారి రూరల్‌లో సీనియర్ బీజేపీ నేత బీ శ్రీరాములు భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు.
- చామరాజనగర, వరుణ రెండు సీట్లలో పోటీ చేసిన మంత్రి వీ.సోమణ్ణకు ఎక్కడా గెలుపు దక్కలేదు. చామరాజనగరలో కాంగ్రెస్ నుంచి పుట్టరంగశెట్టి, వరుణలో మాజీ సీఎం సిద్దరామయ్య గెలుపొందారు.

అశోక్‌కు రెండింట ఒకటి

కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్‌పై కనకపుర, పద్మనాభనగరలో రెండుచోట్ల పోటీ చేసిన మంత్రి ఆర్ అశోక్ డీకేని ఓడించలేకపోయారు. అయితే పద్మనాభనగరలో గట్టెక్కి హమ్మయ్య అనుకున్నారు.

శెట్టర్ ఓటమి, సవది ఎన్నిక

బీజేపీ నుంచి వైదొలగి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ హుబ్లీ సెంట్రల్ నియోజకవర్గంలో ఓటమిని చవిచూశారు. ఆయన బాటలోనే వెళ్లిన లక్ష్మణ సవది అథణిలో ఎన్నికయ్యారు.



ఓడిపోయిన మంత్రులు, బీజేపీ సీనియర్ నాయకులు వీరు

పాపం సభాపతి కాగేరి

ఆరుసార్లు విధానసభకు ఎన్నికైన స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరి ఉత్తర కన్నడ శిరసిలో పరాభవం చెందారు. ఇక్కడ కాంగ్రెస్ గెలుపొందింది. మంత్రులు గోవింద కారజోళ ముధోళ్‌లో ఓడిపోగా, కాంగ్రెస్ నుంచి ఆర్.బీ.తిమ్మాపుర ఎన్నికయ్యారు. హిరేకరూరులో మంత్రి బీసీ పాటిల్‌ను కాంగ్రెస్ నేత యు.బీ.బణకార్ ఓడించారు. మంత్రులు నారాయణగౌడ, మురుగేశ్ నిరాణి, శశికలా జొల్లె, హాలప్ప ఆచార్ కూడా తమ క్షేత్రాల్లో మట్టికరిచారు.

గుండెపోటుతో అభిమాని మృతి

యశవంతపుర: చిత్రదుర్గ జిల్లా హిరియూరు బీజేపీ అభ్యర్థి కె పూర్ణిమ ఓడారని ఓ అభిమాని గుండెపోటుతో మృతి చెందారు. కాంగ్రెస్ అభ్యర్థి డీ సుధాకర్, బీజేపీ అభ్యర్థి పూర్ణిమ మధ్య గట్టి పోటీ నడిచింది. సుధాకర్ ఐదు వేల ఓట్ల అధిక్యత సాధించినట్లు తెలియగానే హిరియూరు తాలూకా అలమరదహట్టి గ్రామానికి చెందిన ఈరణ్ణ గుండెపోటుతో చనిపోయాడు.

నగరంలో కాస్త బీజేపీ గాలి

- మంత్రులు సోమశేఖర్, మునిరత్న గెలుపు

యశవంతపుర: అనేకచోట్ల కాషాయ పార్టీ పరాజయం పాలైనప్పటికి యశవంతపుర నియోజకవర్గంలో మంత్రి ఎస్‌టీ సోమశేఖర్ గెలుపొందారు. జేడీఎస్ అభ్యర్థి జవరాయగౌడపై 14,928 ఓట్ల మెజారిటీతో గెలిచారు. మంత్రికి 1,68,485 ఓట్లు, జేడీఎస్ అభ్యర్థికి 1,53,557 ఓట్లు వచ్చాయి. ఇంత సుడిగాలి వీచినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి ధనంజయ కేవలం 21,570 ఓట్లు పడడం గమనార్హం. తను చేసిన అభివృద్ధి గెలిపించినట్లు సోమశేఖర్ తెలిపారు.

ఆర్ఆర్‌నగరలో మరో మంత్రి

రాజరాజేశ్వరినగరలో మంత్రి మునిరత్న గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి డీకే కుసుమకు మరోసారి పరాజయం తప్పలేదు. మొదటి నాలుగురౌండ్లు మునిరత్న అధిక్యంతో సాగారు. మధ్యలో నాలుగైదు రౌండ్లలో కుసుమకు గాలి వీచింది. చివరి రౌండ్లలో మంత్రి మెజారిటీ సాధించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలే ఆ పార్టీ విజయానికి కారణమని మునిరత్న అన్నారు. ఆర్ఆర్ నగరలో తనతో పోరాటంలో కాంగ్రెస్ నాయకులు విఫలమైనట్లు తెలిపారు. ఇక దాసరహళ్లిలో బీజేపీ అభ్యర్థి ఎస్ మునిరాజు 9,235 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.

తండ్రి వెంటే చట్టసభకు వారసులు



దావణగెరెలో శ్యామనూరు శివశంకరప్ప, తనయుడు మల్లికార్జున్ ఆనందం



మైసూరులో ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ, ఆయన కొడుకుతో అభిమానుల సంబరం

- పలుచోట్ల తనయుల విజయం
- కుమారస్వామి కొడుకు నిఖిల్‌కు చుక్కెదురు

బనశంకరి: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన తండ్రీ కుమార్తె, కొడుకులకు ఓటర్లు ఆదరించారు. కానీ మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి తనయుడు నిఖిల్‌కు మాత్రం చుక్కెదురైంది.

ఎక్కడెక్కడ ఎవరెవరు?

- హాసన్ జిల్లా అరకలగూడులో జేడీఎస్ మాజీమంత్రి ఏ.మంజు విజయం సాధించారు, అలాగే మడికెరిలో కాంగ్రెస్ పోటీ చేసిన ఆయన కొడుకు డా.మందరగౌడ గెలుపొందారు. తండ్రీ కొడుకులు వేర్వేరు పార్టీల నుంచి ఎన్నిక కావడం మరొక విశేషమని చెప్పాలి.
- దావణగెరె జిల్లాలో దావణగెరె దక్షిణలో కాంగ్రెస్ మాజీమంత్రి శ్యామనూరు శివశంకరప్ప, అలాగే ఉత్తర నుంచి ఆయన కుమారుడు కుమారుడు మాజీమంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ గెలుపొందారు.
- బెంగళూరు బీటీఎం లేఔట్‌లో కాంగ్రెస్ మాజీ మంత్రి రామలింగారెడ్డి, జయనగర క్షేత్రంలో ఆయన కుమార్తె సౌమ్యా రెడ్డి గెలుపొందారు. సౌమ్యారెడ్డికి కేవలం 160 ఓట్ల మెజారిటీ వచ్చింది. తరువాత గొడవతో సౌమ్యారెడ్డి ఫలితాన్ని పెండింగ్‌లో పెట్టారు.
- సిటీలోనే విజయనగర సీటులో కాంగ్రెస్ నుంచి మాజీమంత్రి ఎం.కృష్ణప్ప, గోవిందరాజనగరలో కుమారుడు ప్రియాకృష్ణ ఎన్నికయ్యారు. ఇక దేవనహళ్లిలో కాంగ్రెస్ మాజీమంత్రి కేహెచ్.మునియప్ప, కేజీఎఫ్‌లో కుమార్తె రూప శశికళా గెలుపొందారు. మైసూరు చాముండేశ్వరిలో జేడీఎస్ సిట్టింగ్ జీటీ దేవేగౌడ మళ్లీ ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు హరీశ్‌గౌడ హుణసూరులో మొదటిసారిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు.

ఈ తండ్రీ కొడుకులకు చుక్కెదురు

- కానీ కొందరు తండ్రీ కొడుకులకు కాలం కలిసి రాలేదు. చెన్నపట్టణలో జేడీయస్ మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి విజయం సాధించారు. ఆయన కుమారుడు జేడీయస్ రాష్ట్రాధ్యక్షుడు నిఖిల్ రామనగరలో ఓటమి పాలయ్యారు. నిఖిల్ గతంలోనూ మండ్య ఎంపీ సీటులో పోటీ చేసి మట్టికరిచారు. రెండు ఎన్నికల్లోనూ ఆయనకు చేదు అనుభవమే మిగిలింది.

క్లుప్తంగా

కంప్లిలో గణేష్ జయభేరి



సంబరాల్లో పాల్గొన్న అభిమానులు

కంప్లి: కంప్లి క్షేత్ర కాంగ్రెస్ అభ్యర్థి జేఎన్.గణేష్ రెండో సారి విజయం సాధించడంపై కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రముఖులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తూ అంబేడ్కర్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి విజయోత్సవం జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రముఖులు మాట్లాడుతూ క్షేత్రంలో ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలు, రైతుల సమస్యలపై చేపట్టిన పోరాటాల ఫలితంగా రైతాంగం, ప్రజలు ఆశీర్వదించి ఘన విజయం అందించారన్నారు. విజయోత్సవంలో ప్రముఖులు హబీబ్ రహిమాన్, గోపాల్, సత్యప్ప, కే.మస్తాన్, కే.షణ్ముఖప్ప, కే.శ్రీనివాస్‌రావ్, రఘునాయక్, ఎల్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు



పార్టీ జెండాలతో నాగరాజ్ ఇంటి వద్ద ఆనంద సంబరాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు

సిరుగుప్ప: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి బీ.ఎం.నాగరాజ్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ఎం.ఎస్.సోమలింగప్పపై 37 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఒకరికొకరు రంగులు పూసుకొని నాగరాజ్ ఇంటి ముందు ఆనందోత్సాహాల మధ్య సంబరాలు చేసుకున్నారు.

కార్యకర్తల విజయోత్సవం

రాయచూరు రూరల్: జిల్లాలో నాలుగు చోట్ల హస్తం, రెండు చోట్ల బీజేపీ, ఒక చోట జేడీఎస్ విజయం పతాకం ఎగుర వేయడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు విజయోత్సవాలు ఆచరించారు. పరస్పరం రంగులు చల్లుకుని, తమ పార్టీ జెండాలను చేతబట్టుకుని తమ నేతలను భుజాలకెత్తుకుని సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ గెలుపు గ్రామీణ ప్రజలది



కాంగ్రెస్ విజేత అభ్యర్థి నాగేంద్ర


బళ్లారిఅర్బన్: బళ్లారి గ్రామీణ నియోజకవర్గంలో వరుసగా రెండోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రజలు ఆదరించి తనను భారీ మెజార్టీతో గెలిపించారని, ఈ గెలుపు నాది కాదు, గ్రామీణ ప్రజలదేనని గ్రామీణ కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే నాగేంద్ర తెలిపారు. గతంలో కూడ్లిగిలో కూడా రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినా తనకు ఎంతో ఇష్టమైన బళ్లారి గ్రామీణ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో ప్రజలు ఆదరించడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాలతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఇద్దరు స్వతంత్రుల హవా

సాక్షి, బెంగళూరు: రాష్ట్ర విధానసభ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలను కాదని రెండు చోట్ల స్వతంత్రులు విజయం సాధించగా, మరో ఇద్దరు చిన్న పార్టీల నుంచి ఎన్నిక కావడం విశేషం.

- హరపనహళ్లిలో స్వతంత్ర అభ్యర్థిని లతా మల్లికార్జున విజయం సాధించారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిపై ఆమె 13,845 ఓట్ల మెజారిటీ పొందారు. ఈమె దివంగత డిప్యూటీ సీఎం ఎంపీ.ప్రకాశ్ కుమార్తె.
- గౌరిబిదనూరులో స్వతంత్రుడు పుట్టస్వామి గౌడ గెలుపొందారు. ఆయన సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డిపై 37,286 ఓట్ల ఆధిక్యంతో ఎన్నికయ్యారు.
- కేఆర్‌పీపీ అధ్యక్షుడు గాలి జనార్దనరెడ్డి గంగావతి నియోజకవర్గం నుంచి పోటీ చేసి 8,266 ఓట్ల మెజారిటీతో గెలిచారు.
- మేలుకోటెలో నుంచి సర్వోదయ కర్ణాటక పక్ష పార్టీ నుంచి దర్శన్ పుట్టణ్ణయ్య 10 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఆయన కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు.

నగర ప్రజల రుణం తీర్చుకుంటా



ధ్రువీకరణ పత్రం అందుకున్న నారా భరత్‌రెడ్డి

బళ్లారిఅర్బన్: తనను గెలిపించిన నగర ప్రజల రుణం తీర్చుకుంటానని నగర అసెంబ్లీ ఎన్నికల్లో విజేతగా నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్‌వైఎంఈసీలో ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమపై విశ్వాసంతో టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ నేతలు డీకే.శివకుమార్, సిద్దరామయ్య, గెలిపించిన ప్రజల నమ్మకాన్ని కాపాడుతూ నగరాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకెళతానన్నారు.

కాంగ్రెస్ కంచుకోటకు పూర్వవైభవం

- జిల్లాలో అన్ని స్థానాల్లో విజయకేతనం
- శ్రీరాములుతో పాటు ప్రముఖుల ఓటమి



ఓటింగ్ కేంద్రం నుంచి విజయం అనంతరం వస్తున్న నారా భరత్‌రెడ్డి



విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్

సాక్షి,బళ్లారి: జిల్లాలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించింది. శనివారం నగరంలోని ఆర్‌వైఎంఈసీలో జరిగిన ఓట్ల లెక్కింపులో బళ్లారి సిటీ, గ్రామీణ, సిరుగుప్ప, కంప్లి, సండూరుతో సహా మొత్తం 5 నియోజకవర్గాల్లోను కాంగ్రెస్ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోను కాంగ్రెస్ అభ్యర్థులు ముందంజలో కొనసాగారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్, కేఆర్‌పీ పార్టీలు నువ్వా, నేనా అనేలా తలపడినా కాంగ్రెస్ అన్ని స్థానాల్లో విజయం సాధించడం విశేషం. బళ్లారి నగర కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్ రెడ్డి తన సమీప ప్రత్యర్థి కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణపై విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి సోమశేఖర్ రెడ్డి మూడో స్థానానికి పరిమితమయ్యారు. బళ్లారి గ్రామీణ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీ.నాగేంద్ర తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములుపై ఘన విజయం సాధించారు. కంప్లిలో కాంగ్రెస్ అభ్యర్థి జేఎన్ గణేష్ తన సమీప ప్రత్యర్థి టీహెచ్ సురేష్‌బాబుపై గెలుపొందారు. సండూరులో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థినిపై ఘన విజయం సాధించారు. సిరుగుప్పలో కాంగ్రెస్ అభ్యర్థి బీఎం నాగరాజ్ తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. 5 నియోజకవర్గాల్లోను బీజేపీ ఖాతా తెరవక పోవడం గట్టి ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోటకు ప్రస్తుత ఎన్నికల్లో తిరిగి పూర్వవైభవం సంతరించుకుంది. తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సర్వశక్తులు ఒడ్డిన గాలి జనార్దన రెడ్డి సతీమణి గాలి లక్ష్మీ అరుణ కూడా ఓటమి పాలయ్యారు. మొత్తం మీద కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహంతో విజయోత్సవాలు నిర్వహించారు.

కాంగ్రెస్ క్లీన్‌స్వీప్

బళ్లారిఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జిల్లాలోని ఐదు స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. ముఖ్యంగా హోరాహోరీగా సాగిన ఐదు స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు మట్టికరిచారు. నగర అసెంబ్లీ స్థానం నుంచి మొట్టమొదటి సారిగా నారా భరత్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి, కేఆర్‌పీపీ అభ్యర్థినిపై 37,682 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. బళ్లారి గ్రామీణలో యువనేత, కాంగ్రెస్ అభ్యర్థి నాగేంద్ర వరుస విజయాలు సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి శ్రీరాములుపై నాగేంద్ర 28,947 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. కంప్లిలో కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి టీహెచ్ సురేష్‌బాబుపై 22,536 మెజార్టీతో రెండో సారి ఘన విజయం సాధించారు. సిరుగుప్పలో కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎం. నాగరాజ్ తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి సోమలింగప్పపై 36,849 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. సండూరులో కాంగ్రెస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే ఈ.తుకారాం తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థిని శిల్పా రాఘవేంద్రపై 35,390 ఓట్ల మెజార్టీతో వరుసగా నాలుగో సారి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థులు అన్ని 5 స్థానాల్లో ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా చిందులు వేస్తూ బాణసంచాను పేల్చి సంబరాలను జరుపుకున్నారు. విజేత అభ్యర్థులను విద్యానగర్‌లోని ఎయిర్‌పోర్ట్ రోడ్డు మీదుగా దుర్గమ్మ గుడి వరకు ఘనంగా ఊరేగించారు.



విజయ చిహ్నం చూపుతున్న బీఎం నాగరాజ్

మామా అల్లుళ్లకు ఓటమి



శ్రీరాములు



సురేష్‌బాబు

సాక్షి,బళ్లారి: జిల్లాలోని బళ్లారి రూరల్, కంప్లి నియోజకవర్గాల నుంచి బీజేపీ తరపున పోటీ చేసిన మామా అల్లుళ్లు, మంత్రి శ్రీరాములు, టీహెచ్ సురేష్‌బాబు శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఇద్దరు ఓటమి చెందారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి లోక్‌సభ సభ్యుడిగా, నాలుగు సార్లు మంత్రిగా పని చేసిన శ్రీరాములు, 2008, 2013 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన సురేష్‌బాబు 2018, 2023లో వరుసగా రెండుసార్లు ఓటమి చెందడం గమనార్హం.

నాలుగోసారి తుకారాం విజయపతాకం



తుకారాం(ఫైల్)

బళ్లారి రూరల్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ విజయఢంకా మోగించిన నేపథ్యంలో బళ్లారి జిల్లాలో కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచిన సండూరులో ఆ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఈ.తుకారాం నాలుగోసారి విజయకేతనం ఎగురవేశారు. 1957 మొదలు రెండుసార్లు మినహా మిగతా అన్ని ఎన్నికల్లో పెట్టనికోటగా కాంగ్రెస్ విజయాన్ని దక్కించుకొంటూ వస్తోంది. జనరల్ కేటగిరిగా ఉన్న ఈ నియోజకవర్గం 2008 నుంచి ఎస్టీకి రిజర్వ్‌డ్ అయింది. అప్పటినుంచి ఈ.తుకారాం వరుసగా నాలుగోసారి విజయం సాధించారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థిని శిల్పారాఘవేంద్ర, కేఆర్‌పీపీ అభ్యర్థి కె.ఎస్.దివాకర్‌లపై 18 రౌండ్లు ముగిసేసరికి 35,390 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం గెలుపొందారు.

గాలి గెలుపుపై విజయోత్సవం



బైక్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, గాలి జనార్ధన్‌రెడ్డి అభిమానులు

గంగావతి: గంగావతి నియోజకవర్గంలో కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి జనార్దన్‌రెడ్డి ఘన విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి ఇక్బాల్ అన్సారీపై 8,266 ఓట్ల మెజార్టీతో విజయఢంకాను మోగించారు. జనార్ధన్‌రెడ్డికి 66,213 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థికి 57,947 ఓట్లు మాత్రమే లభించాయి. బీజేపీ అభ్యర్థి మూడో స్థానానికి పరిమితమై కేవలం 28,918 ఓట్లు మాత్రమే పొందారు. గాలి జనార్దన్‌రెడ్డి గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ గంగావతి నగరంలో అభిమానులు, మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీలు, టాప్‌లేని జీపులు, ఇతర వాహనాల్లో ఏ ప్రాంతంలో చూసినా ఫుట్‌బాల్ గుర్తును ముద్రించిన జెండాలను రెపరెపలాడిస్తూ ఊరేగింపులను నిర్వహించారు. పలు ప్రాంతాల్లో బాణసంచాను పేలుస్తూ ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు.

విజయనగర.. హస్తగతం

హొసపేట: హొసపేటె(విజయనగర) నియోజకవర్గంలో కాంగ్రెస్ పైచేయి సాధించింది. శనివారం జరిగిన సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌ఆర్.గవియప్ప తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి సిద్దార్థ్‌సింగ్‌పై గెలుపొందారు. హొసపేటలో గత మూడు ఎన్నికల్లో ఆనంద్‌సింగ్ గెలుపొందారు. కానీ ఈసారి తన కుమారుడు సిద్దార్థ్‌సింగ్ బీజేపీ తరపున పోటీ చేసి ఓటమి చెందడంతో తన కుమారుడిని గెలిపించుకోలేక పోవడంతో ఆనంద్‌సింగ్‌కు పరాభవం మిగిలింది. ఇక విజయనగర జిల్లాలోని మొత్తం 5 క్షేత్రాల్లో కాంగ్రెస్ రెండు క్షేత్రాల్లో, బీజేపీ ఒకటి, జేడీఎస్ ఒకటి, స్వతంత్ర అభ్యర్థికి ఒక స్థానం దక్కింది. హొసపేటలో కాంగ్రెస్ అభ్యర్థి హెచ్ ఆర్.గవియప్ప తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి సిద్దార్థ్‌సింగ్‌పై 33,723 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

హరపనహళ్లిలో లతా మల్లికార్జున్

హరపనహళ్లిలో స్వతంత్ర అభ్యర్థిని లతా మల్లికార్జున్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి గాలి కరుణాకరరెడ్డిపై 13,845 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కూడ్లిగిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్‌టీ శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి లోకేష్ ఎన్ వి నాయక్‌పై 54,350 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. హూవినహడగలిలో బీజేపీ అభ్యర్థి కృష్ణనాయక్ తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి పీటీ.పరమేశ్వర్ నాయక్‌పై 1,444 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. హగరిబొమ్మనహళ్లిలో జేడీఎస్ అభ్యర్థి నేమిరాజ్ నాయక్ తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఎల్ భీమానాయక్‌పై 11,344 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.



విజయచిహ్నం చూపుతున్న కాంగ్రెస్ విజేత అభ్యర్థి హెచ్‌ఆర్.గవియప్ప

ఈ విజయం ప్రజలదే

- కేఆర్‌పీపీ అధినేత గాలి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి రూరల్: కేఆర్‌పీపీ వ్యవస్థాపకులు, గంగావతి అసెంబ్లీ అభ్యర్థి గాలి జనార్దన్ రెడ్డికి 65,791 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారికి 57,674 ఓట్లు లభించడంతో 8,368 ఓట్ల మెజార్టీతో గాలి జనార్ధనరెడ్డి గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి పరణ్ణ మునవళ్లి 28,918 ఓట్లు మాత్రమే పొంది మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు. ఫలితాల అనంతరం జనార్ధనరెడ్డి మాట్లాడుతూ ఈ విజయం సమస్త నియోజకవర్గ ప్రజలదన్నారు. అసెంబ్లీలో తమ గళం వినిపిస్తామన్నారు. ప్రజలకు ఉత్తమ పాలన అందించి వారి రుణం తీర్చుకుంటానన్నారు.

ఉడుపిలో బీజేపీ, చిక్కలో కాంగ్రెస్ స్వీప్

యశవంతపుర: ఉడుపి జిల్లాలో ఐదు స్థానాలలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. ఉడుపిలో బీజేపీ అభ్యర్థి యశ్‌పాల్.. కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కాంచన్‌ను 32,776 ఓట్ల ఆధిక్యంతో ఓడించారు. కార్కళలో మంత్రి సునీల్‌కుమార్, కాపులో సురేశ్ శెట్టి, బైందూరులో గురురాజ్ శెట్టి, కుందాపురలో కిరణ్‌కుమార్ కూడ్గిలు హస్తం అభ్యర్థులను ఓడించి జిల్లాలో కాషాయ హవాను చాటారు.

చిక్కమగళూరులో కాంగ్రెస్ హవా

ఇక చిక్కమగళూరు జిల్లాలోని ఐదు స్థానాలను కాంగ్రెస్ దక్కించుకొంది. చిక్కమగళూరులో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవిపై కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌డీ తమ్మయ్య గెలిచారు. కడూరులో ఆనంద కేఎస్, శృంగేరిలో టీడీ రాజేగౌడ, మూడిగెరెలో మాజీ మంత్రి మోటమ్మ కుమార్తె నయన గెలుపొందారు. టీడీ రాజేగౌడకు 153 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది. తరీకెరెలో జీహెచ్ శ్రీనివాస్ గెలుపొందారు.

జిల్లాలో హస్తం హవా



హంపనగౌడ బాదర్లి(కాంగ్రెస్)



హంపయ్య నాయక్ (కాంగ్రెస్)



బసనగౌడ దద్దల్(కాంగ్రెస్)



బసనగౌడ తుర్విహాళ(కాంగ్రెస్)



కరియమ్మ నాయక్(జేడీఎస్)

- సిటీలో శివరాజ్ పాటిల్ హ్యాట్రిక్
- నాలుగు చోట్ల కాంగ్రెస్ జయకేతనం
- రెండు చోట్ల బీజేపీ, ఒకచోట జేడీఎస్ గెలుపు



శివరాజ్ పాటిల్ (బీజేపీ)



మానప్ప వజ్జల్ (బీజేపీ)


రాయచూరు రూరల్: నగరంలో శనివారం ఓట్ల లెక్కింపు ముగియడంతో జిల్లాలో హస్తం అభ్యర్థులు విజయ దరహాసం చిందించారు. జిల్లాలో నాలుగు చోట్ల కాంగ్రెస్ విజయ పతాకం ఎగురు వేయగా, రెండు చోట్ల బీజేపీ, ఒక చోట జేడీఎస్ గెలుపొందాయి. రాయచూరు, లింగసూగూరుల్లో బీజేపీ, దేవదుర్గలో జేడీఎస్, మాన్వి, రాయచూరు రూరల్, మస్కి, సింధనూరుల్లో కాంగ్రెస్ గెలుపొందింది. దేవదుర్గలో జేడీఎస్ అభ్యర్థిని కరియమ్మ గెలుపొంది సిట్టింగ్ ఎమ్మెల్యే శివనగౌడ నాయక్ ఐదోసారి గెలుపునకు అడ్డుకట్ట వేసింది. లింగసూగూరులో బీజేపీ అభ్యర్థి వజ్జల మానప్ప, గ్రామీణలో కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ గెలుపొందారు. మస్కిలో ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ రెండోసారి విజయం సాధించారు. సింధనూరులో కాంగ్రెస్ అభ్యర్థి హంపనగౌడ బాదర్లి, మాన్విలో కాంగ్రెస్ అభ్యర్థి హంపయ్య నాయక్ విజయం సాధించారు. ఇక నగర బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 2013లో నగరంలో జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన శివరాజ్ పాటిల్ గెలుపొంది, 2018లో ఎన్నికలకు ముందు జేడీఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరి మళ్లీ విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో హ్యాట్రిక్ సాధించారు.

ధార్వాడ జిల్లాలో కాంగ్రెస్ కమాల్

- నాలుగు స్థానాలు హస్తగతం
- మూడు స్థానాలకే కమలం పరిమితం
- శిష్యుడి చేతిలో గురువు శెట్టర్‌కు పరాజయం

హుబ్లీ: ధార్వాడ జిల్లాలోని 7 క్షేత్రాలను గాను నాలుగింట కాంగ్రెస్ గెలవగా, కమలానికి మూడు స్థానాలు దక్కాయి. ముఖ్యంగా టికెట్ రాలేదనే కోపంతో కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్ శెట్టర్ ఘోరంగా పరాజయం పాలయ్యారు. ఆయన పార్టీ మారడంతో యావత్ దేశం దృష్టి ఆయనపై పడింది. అయితే ఆయన బీజేపీ అభ్యర్థి, తన శిష్యుడైన మహేష్ టెంగినకాయి చేతిలో ఓటమి చెందారు. జిల్లా మంత్రి, నవలగుంద ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి శంకర్ పాటిల్ మునేనకొప్ప కాంగ్రెస్ అభ్యర్థి ఎన్‌హెచ్.కోనరెడ్డి చేతిలో భారీ మెజార్టీతో ఓటమి పాలయ్యారు. బళ్లారి జిల్లా గనుల యజమాని సంతోష్‌లాడ్ కలఘటగి నుంచి బీజేపీ అభ్యర్థి నాగరాజ్ చబ్బిపై జయభేరి మోగించారు. నాగరాజ్ చబ్బి ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్‌లోనే ఉండగా టికెట్ రాకపోవడంతో బీజేపీలో చేరి ఆ పార్టీ తరపున బరిలో నిలిచారు. హుబ్లీ ధార్వాడ తూర్పు స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ అబ్బయ్య హ్యాట్రిక్ సాధించారు. ఇక్కడ కొత్త అభ్యర్థి డాక్టర్ క్రాంతి కిరణ్ అబ్బయ్య చేతిలో ఓటమి చెందారు. ధార్వాడ రూరల్ స్థానం నుంచి కోర్టు నుంచి జిల్లా బహిష్కరణకు గురైన కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌కులకర్ణి బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే అమృత దేశాయిపై విజయఢంకా మోగించారు. హుబ్లీ ధార్వాడ పశ్చిమ క్షేత్రం, కుందగోళ నుంచి వరుసగా బీజేపీ అభ్యర్థులు అరవింద బెల్లద, ఎంఆర్ పాటిల్ విజయం సాధించారు.

బావిలో పడి దంపతుల మృతి





మరణించిన భార్యాభర్తలు

మాలూరు: వ్యవసాయ బావిలో పడి భార్యాభర్తలు మరణించిన ఘటన తాలూకాలోని దొడ్డహసాళ గ్రామంలో చోటు చేసుకుంది. మృతులను గ్రామానికి చెందిన శ్రీనివాసాచారి(65), భార్య విమలమ్మ(55)గా గుర్తించారు. వ్యవసాయ బావి నుంచి బిందెలో నీరు తేవడానికి వెళ్లిన విమలమ్మ కాలుజారి బావిలో పడిపోయింది. ఆమెను కాపాడబోయిన భర్త శ్రీనివాసాచారి తాను కూడా వ్యవసాయ బావిలోకి దూకాడు. చివరికి బావి నుంచి ఇద్దరు బయటకు రాలేక మరణించారు. శ్రీనివాసాచారి బంధువు రవీంద్ర ఇదే దారిలో వస్తుండగా ఇద్దరి మృతదేహాలు బావిలో తేలుతుండడాన్ని చూసి కుమారుడు రాజశేఖర్‌కు సమాచారం అందించాడు. స్థానికులు మాస్తి పోలీసులకు సమాచారం అందించడంతో వారు బావి వద్దకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అందించారు.

స్వతంత్ర అభ్యర్థికి కత్తిపోట్లు

హుబ్లీ: హుబ్లీ విద్యానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థి కత్తిపోట్లకు గురైన ఘటన శుక్రవారం చోటు చేసుకొంది. కుందగోళ విధానసభ క్షేత్రంలో స్వతంత్ర అభ్యర్థి మల్లికార్జున తోటగేరను ఆయన ఆప్తుడే కత్తితో పొడిచారు. విద్యానగర పరిధిలోని చంద్రగిరి లేఅవుట్లో పరిచయస్తుల ఇంట్లో ఈ ఘటన జరిగింది. చేతికి, ముక్కు దగ్గర గాయాలయ్యాయి. చికిత్స కోసం కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వ్యక్తిగత విషయంగా ఇరువురి మధ్య జరిగిన ఘర్షణ ఫలితంగా ఈ ఘటన జరిగిందని విద్యానగర పోలీసులు తెలిపారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

యశవంతపుర: దక్షిణకన్నడ జిల్లా సూరత్కల్‌లో క్రీడా సామాగ్రి ఉన్న అంగడిలో అగ్ని ప్రమాదం జరిగింది. లక్షలు విలువగల సామగ్రి కాలి బూడిదైంది. శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు లేవడంతో యజమాని, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చిన సమయానికీ రాలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇంతలో పెద్ద ఎత్తున మంటలు, పొగ వ్యాపించి షాపు కాలిపోయింది.

కోలారు వార్తలు...

కోలారులో కాంగ్రెస్‌దే పైచేయి

- నాలుగు చోట్ల కాంగ్రెస్, రెండు చోట్ల జేడీఎస్ గెలుపు
- ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపు



కోలారు విజేత కొత్తూరు మంజునాథ్



బంగారుపేట విజేత ఎస్ ఎన్ నారాయణస్వామి



కేజీఎఫ్ విజేత రూపా శశిధర్



శ్రీనివాసపురం విజేత జి కె వెంకటశివారెడ్డి



ముళబాగిలు విజేత సమృద్ధి మంజునాథ్



మాలూరు విజేత కె వై నంజేగౌడ



విజయోత్సవ ర్యాలీలో రూపా శశిధర్



సమృద్ధి మంజునాథ్‌కు అభినందనల జల్లు

కోలారు: జిల్లాలో హస్త వాసి కనిపించింది. జిల్లాలోని 6 నియోజకవర్గాలకు గాను కాంగ్రెస్ ఏకంగా 4 స్థానాల్లో గెలుపొందగా, జేడీఎస్ 2 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ అసలు ఖాతా తెరవలేదు. నగరంలోని బాలుర డిగ్రీ కళాశాలలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమైంది. కోలారు, మాలూరు, బంగారుపేట, శ్రీనివాసపుర నియోజకవర్గాల్లో నువ్వా, నేనా అన్నట్లు అభ్యర్థులు పోటీ పడగా, కేజీఎఫ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రూపా శశిధర్ సునాయాసంగా, ఏకపక్షంగా విజయం సాధించారు. ముళబాగిలు నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థి సమృద్ధి మంజునాథ్ ఆద్యంతం ఆధిపత్యం సాగించి చివరికి జయకేతనం ఎగురవేశారు. ప్రముఖంగా కోలారు నియోజకవర్గంలో విజయం కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యనే దోబూచులాడింది. ఆరంభంలో బీజేపీ అభ్యర్థి వర్తూరు ప్రకాష్ ఆధిక్యంలో ఉండగా తరువాత సీఎంఆర్ శ్రీనాథ్ ఆధిక్యంలోకి వచ్చారు. కౌంటింగ్ ముగిసేసరిగి అనూహ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి కొత్తూరు మంజునాథ్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. పోలింగ్‌కు ప్రచారానికి మధ్య తక్కువ సమయం ఉన్నా కొత్తూరు మంజునాథ్ విస్తృత ప్రచారం నిర్వహించి విజయం సాధించారు. ఏకంగా 32,737 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థిపై విజయం సాధించి తన సత్తా చాటారు.

గట్టెక్కిన నంజేగౌడ

మాలూరు: నియోజకవర్గ కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఉత్కంఠ భరితంగా సాగింది. గెలుపు కాంగ్రెస్, బీజేపీ, ఇండిపెండెంట్ అభ్యర్థుల మధ్యన దోబూచులాడినా చివరికి కాంగ్రెస్ అభ్యర్థినే వరించింది. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తన సమీప బీజేపీ అభ్యర్థి కెఎస్ మంజునాథ్‌గౌడపై కేవలం 248 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

బీజేపీ కొంపముంచిన రెబల్ అభ్యర్థి

మాలూరు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కెఎస్ మంజునాథ్‌గౌడ విజయానికి బీజేపీ రెబల్ అభ్యర్థి హూడి విజయకుమార్ సైంధవుడిలా అడ్డుపడ్డారు. తనకు బీజేపీ టికెట్ ఇవ్వలేదనే కినుకతో హూడి విజయకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్, బీజేపీలకు గట్టి పోటీ ఇచ్చారు. కొన్ని రౌండ్లలో హూడి విజయకుమార్ ఆధిక్యంలోకి వచ్చి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు దడ పుట్టించారు. ఒక దశలో హూడి విజయకుమార్ విజయం ఖాయం అనుకున్నారు. అయితే విజయ లక్ష్మి ఆఖరు నిమిషంలో కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. కాంగ్రెస్ అభ్యర్థి కేవై నంజేగౌడకు ఈసారి నియోజకవర్గంలో ప్రజల నుంచి సరైన మద్దతు కనిపించలేదు. బీజేపీ రెబల్ అభ్యర్థిగా హూడి విజయకుమార్ పోటీ చేయకుంటే బీజేపీ అభ్యర్థి కె మంజునాథ్‌గౌడ చేతిలో చిత్తుగా ఓడాల్సి వచ్చేది.

రూపా శశిధర్ సునాయాస గెలుపు

కేజీఎఫ్: నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని రూపా శశిధర్ విజయం నల్లేరుపై నడకలాగా సాగింది. బీజేపీ అభ్యర్థిని అశ్విని సంపంగి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. గతంలో కంటే అధిక మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని విజయం సాధించారు. గత ఎన్నికలో జరిగిన ఓటమితో ఏమాత్రం పాఠం నేర్చుకోని బీజేపీ అభ్యర్థిని అశ్విని సంపంగి ప్రత్యర్థికి కనీస పోటీ ఇవ్వకుండా ఓటమికి శరణాగతి అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థిని రూపా శశిధర్ దాదాపు 50174 ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థినిని చిత్తుగా ఓడించారు.

కాంగ్రెస్ అభ్యర్థి హ్యాట్రిక్ విజయం

బంగారుపేట: నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎం.నారాయణస్వామి ఆఖరు నిమిషంలో పోలింగ్‌కు ముందు రోజు నుంచి అస్త్రసన్యాసం చేసి కార్యకర్తలకు కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో పోటీ కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్యన నువ్వా, నేనా? అన్నట్లుగా సాగింది. ఆరంభంలో జేడీఎస్ అభ్యర్థి మల్లేష్‌బాబు, కాంగ్రెస్ అభ్యర్థి ఎస్ఎన్ నారాయణస్వామిపై ఆధిపత్యం సాధించినా ఆఖరు రౌండ్లలోకి వచ్చేసరికి చతికిల పడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి 7976 ఓట్ల మెజార్టీతో జేడీఎస్ అభ్యర్థిపై గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించారు.

పట్టు నిలుపుకున్న జేడీఎస్

శ్రీనివాసపురం: నియోజకవర్గంలో కాంగ్రెస్, జేడీఎస్ సాంప్రదాయక ప్రత్యర్థుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా సాగి చివరికి జేడీఎస్ అభ్యర్థి జీకే వెంకటశివారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ రమేష్‌కుమార్‌పై 9928 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో వరుసగా మూడోసారి గెలవడం ద్వారా హ్యాట్రిక్ విజయం సాధించాలనుకున్న రమేష్‌కుమార్ ఆశలు గల్లంతయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైన ఆయన గెలిచి ఉంటే మంత్రివర్గంలో చోటు లభించి ఉండేది. ఇక్కడ ఆప్, బీజేపీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు.

జేడీఎస్‌కు పూర్వవైభవం

ముళబాగిలు: ముళబాగిలు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థి సమృద్ధి మంజునాథ్ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి ఆదినారాయణపై 23080 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ నియోజకవర్గం గతంలో జేడీఎస్‌కు కంచుకోటగా ఉండేది. అయితే కొత్తూరు మంజునాథ్ 2013లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసినప్పటి నుంచి జేడీఎస్ కనుమరుగైంది. 2018లో కుల ధృవీకరణ పత్రం సమస్య కారణంగా కొత్తూరు మంజునాథ్ ముళబాగిలు నుంచి పోటీ చేయడానికి సాధ్యం కాలేదు. దీంతో ఆయన ఇండిపెండెంట్ అభ్యర్థి హెచ్.నాగేష్‌కు మద్దతు తెలిపి గెలిపించారు. ప్రస్తుత ఎన్నికలో జేడీఎస్ విజయం సాధించడం ద్వారా తన పూర్వ వైభవాన్ని చాటుకుంది.

క్లుప్తంగా

స్వతంత్ర అభ్యర్థి ఘన విజయం


పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: గౌరిబిదనూరులో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్‌హెచ్ శివశంకర్‌రెడ్డి ఓటమిపాలయ్యారు. ఇండిపెండెంట్ అభ్యర్థి పుట్టస్వామి ఘన విజయం సాధించారు. పుట్టస్వామి గౌడ నాలుగేళ్లుగా నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పుట్టస్వామి గౌడకు 83,336 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్‌రెడ్డికి 46,552, మరో స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ కెంపరాజుకు 24,202, జేడీఎస్ అభ్యర్థి నరసింహమూర్తికి 11,125 ఓట్లు, బీజేపీ అభ్యర్థి శశిధర్‌కు 8,131 ఓట్లు వచ్చాయి. పుట్టస్వామి గౌడ శివశంకర్‌రెడ్డిపై 36,784 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు.

మా నాన్న మళ్లీ సీఎం కావాలి

మైసూరు: శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజార్టీ సాధించడంతో తన తండ్రి సిద్దరామయ్య మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆయన కుమారుడు యతీంద్ర సిద్దరామయ్య అన్నారు. వరుణ నుంచి సిద్దరామయ్య విజయం సాధించారని, ఆయన తప్పకుండా మరోసారి ముఖ్యమంత్రి అవుతారనే నమ్మకం ఉందన్నారు. గతంలో తన తండ్రి పాలన చూసి ఆదరించారని, మరోసారి ఆయన సీఎం కావాలని ఆకాంక్షించారు.

కనకపురలో దిమ్మతిరిగే ఫలితాలు

- లక్ష ఓట్ల మెజారిటీతో డీకేశి గెలుపు
- చిత్తుగా ఓడిపోయిన అశోక్


డీకే శివకుమార్, ఆర్ అశోక్

దొడ్డబళ్లాపురం: కనకపురలో హిస్టరీ రిపీట్ అయ్యింది. ప్రజలు బీజేపీ దిమ్మతిరిగేలా ఫలితాలు ఇచ్చారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ లక్ష ఓట్ల మెజారిటీతో ఆర్ అశోక్‌పై విజయం సాధించారు. కనకపురలో డీకే శివకుమార్‌కు చెక్ పెట్టాలని భావించిన బీజేపీ ఆర్ అశోక్‌ను పోటీలో దించింది. అయితే ప్రజలు ఊహించని షాక్ ఇచ్చారు. డీకే శివకుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. కనకపుర డీకే బ్రదర్స్‌కు కంచుకోట అని మరోసారి రుజువు చేసారు.

బెట్టింగ్, ఏడుగురిపై కేసు

మైసూరు: మైసూరు జిల్లా హెచ్.డి.కోటె నియోజకవర్గంలో కాంగ్రెస్, జేడీఎస్ అభ్యర్థుల జయపజయాలపై బెట్టింగ్‌లు కట్టిన ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జయరామ్ నాయక, ప్రకాశ్, శివరాజ్ మధ్య బెట్టింగ్ అగ్రిమెంట్ కూడా జరిగింది. ప్రకాశ్, శివరాజ్ జేడీఎస్ అభ్యర్థికి మద్దతుగా, జయరామ్ నాయక్ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా తలా రూ. 5 లక్షల అగ్రిమెంట్ చేసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ చిక్కమాదు, జేడీఎస్ అభ్యర్థి జయప్రకాశ్ జయపజయాలపై రూ. 10 లక్షల నగదు బెట్టింగ్ కట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తండ్రి, కుమారుడు విజయం

మైసూరు: అసెంబ్లీ ఎన్నికల్లో మైసూరు జిల్లాలో తండ్రి, కుమారుడు విజయం సాధించారు. జేడీఎస్ పార్టీ నుంచి జీటీ దేవెగౌడ చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి విజయం సాధించగా ఆయన కుమారుడు హరీశ్‌గౌడ అదే పార్టీ నుంచి హుణసూరు నుంచి విజయం అందుకున్నారు. కుమారుడి విజయంపై దేవెగౌడ సంతోషం వ్యక్తం చేశారు.

రామనగరలో జేడీఎస్ కోటకు బీటలు

- ఘోరంగా ఓటమిపాలైన నిఖిల్

దొడ్డబళ్లాపురం: ఎన్నో ఏళ్లుగా రామనగర జిల్లాను కంచుకోటగా భావిస్తున్న జేడీఎస్‌కు ఈసారి ఘోర పరాజయం ఎదురైంది. జిల్లాలో నాలుగు స్థానాలపైకి మూడు స్థానాల్లో కాంగ్రెస్ విజయ బావుటా ఎగురవేసింది. రామనగర నియోజకవర్గంలో మాజీ సీఎం కుమారస్వామి కుమారుడు నిఖిల్‌కుమారస్వామి ఘోరంగా ఓటమిపాలయ్యాడు. దీంతో జేడీఎస్ కంచుకోటకు బీటలు పడ్డాయి. అనూహ్యంగా రామనగరలో కాంగ్రెస్ అభ్యర్థి, డీకే శివకుమార్ ఆప్తుడు ఇక్బాల్ హుసేన్ విజయం సాధించారు. మాగడిలో హెచ్‌సీ బాలక్రిష్ణ, కనకపురలో డీకే శివకుమార్ విజయం సాధించారు. ఒక్క చెన్నపట్టణలో మాత్రం కుమారస్వామి ఎలాగో గట్టెక్కారు. చెన్నపట్టణలో అపర భగీరథుడిగా పిలవబడే ఎమ్మెల్సీ యోగేశ్వర్ పరాజయం పాలవడం చర్చనీయాంశంగా మారింది.

సిద్దరామయ్య ఇంట విషాదం

మైసూరు: కాంగ్రెస్ సీనియర్ నేత సిద్దరామయ్య ఇంట విషాదం నెలకొంది. సిద్దు సొంత సోదరి శివమ్మ భర్త రామేగౌడ (69) శనివారం ఉదయం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. రామేగౌడ సిద్దరామనహుండిలో రేషన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సిద్దరామనహుండిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

బెంగళూరు నగరంలో గెలుపు వీరులు వీరే


బెంగళూరు కాంగ్రెస్ కార్యాలయం వద్ద కార్యకర్తల సందడి


బెళగావిలో కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

బనశంకరి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగించింది. బెంగళూరు నగరంలోని 28 నియోజకవర్గాల్లో 15 నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించగా 13 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించింది. దీంతో బెంగళూరు నగరంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ కార్యకర్తలు బాణసంచా పేలుస్తూ సందడి చేశారు.

ఆ 16 మందిలో గెలిచింది ఆరుగురే !

2019లో కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలను వీడి బీజేపీలో చేరి యడియూరప్ప ప్రభుత్వం ఏర్పాటుకు కారణమైన 16 మందిలో కేవలం ఆరుగురు మాత్రమే గెలుపొందగా మిగిలిన వారు ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో హెచ్. విశ్వనాథ్ పోటీ చేయలేదు. రమేశ్ జారకిహొళి, మునిరత్న, శివరాంహెబ్బార్, ఎస్టీ సోమశేఖర్, బైరతి బసవరాజు, గోపాలయ్య గెలుపొందారు. మహేశ్ కుమటళ్లి, శ్రీమంతగౌడ పాటిల్, (ఆనంద్‌సింగ్ కుమారుడు సిద్దార్దసింగ్ ఓటమి) బీసీ.పాటిల్, డాక్టర్ కే.సుధాకర్, కేసీ.నారాయణగౌడ, ఎంబీటీ.నాగరాజు, ప్రతాప్‌గౌడపాటిల్, ఎస్.మహేశ్, ఆర్.శంకర్ ఓటమిపాలయ్యారు.

15 నియోజకవర్గాలో బీజేపీ, 13 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం

1. బసవనగుడి - రవిసుబ్రమణ్య (బీజేపీ)
2 .బొమ్మనహళ్లి - సతీశ్‌రెడ్డి (బీజేపీ)
3. పద్మనాభనగర-ఆర్.అశోక్ (బీజేపీ)
4. యలహంక -ఎస్ఆర్.విశ్వనాథ్ (బీజేపీ)
5. కృష్ణరాజపురం-బైరతిబసవరాజు (బీజేపీ)
6. రాజాజీనగర -సురేశ్‌కుమార్ (బీజేపీ)
7.చిక్‌పేటే -ఉదయ్‌గరుడాచార్ (బీజేపీ)
8.యశవంతపుర-ఎస్‌టీ.సోమశేఖర్ (బీజేపీ)
9.మహాలక్ష్మీలేఔట్-గోపాలయ్య (బీజేపీ)
10.సీవీ.రామన్‌నగర ఎస్.రఘు (బీజేపీ)
11.రాజరాజేశ్వరినగర-మునిరత్న (బీజేపీ)
12.బెంగళూరుదక్షిణ-ఎం.కృష్ణప్ప (బీజేపీ)
13.మల్లేశ్వరం-అశ్వత్థనారాయణ (బీజేపీ)
14.మహదేవపుర-ఎస్.మంజుల (బీజేపీ)
15.దాసరహళ్లి -మునిరాజు (బీజేపీ)
16.బీటీఎంలేఔట్-రామలింగారెడ్డి (కాంగ్రెస్)
17.చామరాజపేటే-జమీర్ అహ్మద్ (కాంగ్రెస్)
18.పులకేశినగర-ఏసీ.శ్రీనివాస్ (కాంగ్రెస్)
19.శాంతినగర-ఎన్ఏ.హ్యారీస్ (కాంగ్రెస్)
20.జయనగర-సౌమ్యారెడ్డి (కాంగ్రెస్)
21.విజయనగర-కృష్ణప్ప (కాంగ్రెస్)
22.బ్యాటరాయనపుర-కృష్ణబైరేగౌడ (కాంగ్రెస్)
23.సర్వజ్ఞనగర -కేజే.జార్జ్ (కాంగ్రెస్)
24.గోవిందరాజనగర (కాంగ్రెస్)
25..గాంధీనగర- దినేశ్‌గుండూరావ్ (కాంగ్రెస్)
26.హెబ్బాల-బైరతి సురేశ్ (కాంగ్రెస్)
27.శివాజీనగర-రిజ్వాన్ హర్షద్ (కాంగ్రెస్)
28.అనేకల్-శివణ్ణ (కాంగ్రెస్)

దొడ్డలో వికసించిన కమలం

- 30 వేలపైగా ఓట్ల మెజారిటీతో ధీరజ్ గెలుపు

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో కమలం పార్టీ వికసించకపోయినా దొడ్డ నియోజకవర్గంలో మాత్రం భారీ మెజారిటీతో గెలిచింది. 31 సంవత్సరాల వయసు కలిగిన అత్యంత చిన్న వయసు గల ధీరజ్ మునిరాజు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అందరూ అనుకున్నట్టుగానే ధీరజ్‌కు 31,375 ఓట్ల మెజారిటీ వచ్చింది. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణయ్య రెండవస్థానం, జేడీఎస్ అభ్యర్థి మునేగౌడ మూడవ స్థానానికి పరిమితమయ్యారు. పోటీ చేసిన మొదటిసారే ధీరజ్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించాడు. దీంతో పార్టీ కార్యకర్తలు దొడ్డ పట్టణంలో బాణసంచా కాల్చి


బీజేపీ విజయోత్సవం

రోడ్‌షో నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ధీరజ్ ఓపెన్ జీపులో పట్టణంలో రోడ్‌షో నిర్వహించి ప్రజలకు ధన్యవాదాలు తెలిపాడు. బీజేపీ అభ్యర్థి ధీరజ్ ప్రతీ రౌండ్ లోనూ లీడ్‌లో కొనసాగారు. 10 వేల ఓట్ల మెజారిటీ రాగానే ఎమ్మెల్యే వెంకటరమణయ్య కౌంటింగ్ హాల్‌లోంచి లేచి వెళ్లిపోయారు.

మండ్యలో జేడీఎస్ ఘోర పరాజయం

మండ్య: జేడీఎస్ పార్టీ కంచుకోటగా ఉన్న మండ్య జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. మొత్తం ఏడు స్థానాల్లో ఐదింటిలో విజయం సాధించింది. గత ఎన్నికల్లో ఏడింటిలోనూ సత్తా చాటిన జేడీఎస్ ఇప్పుడు ఒకస్థానంతో సరిపెట్టుకుంది. ఐదు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా కర్ణాటక సర్వోదయ పార్టీ అభ్యర్థి గెలుపొందారు. నాగమంగళ నుంచి చెలువరాయ స్వామి, మళవళ్లి నుంచి పీఎం నరేంద్ర స్వామి, మండ్య నుంచి రవికుమార్ గౌడ, మద్దూరు నుంచి ఉదయ్, శ్రీరంగపట్టణం నుంచి రమేశ్, మేలుకోటె నుంచి కాంగ్రెస్ మద్దతుదారుడు, సర్వోదయ కర్ణాటక పార్టీ అభ్యర్థి దర్శన్ పుట్టణయ్య, కేఆర్ పేట నుంచి మంజుల గెలిచారు.

శివమొగ్గ జిల్లాలో కాంగ్రెస్ పాగా

శివమొగ్గ: బీజేపీ కంచుకోట అయిన శివమొగ్గ జిల్లాలో కాంగ్రెస్ పాగా వేసింది. ఏడు నియోజకవర్గాల్లో మూడింటిని కై వసం చేసుకుంది. మరో మూడు బీజేపీ, ఒకచోట జేడీఎస్ గెలిచింది. ప్రస్తుత ఎన్నికల్లో శివమొగ్గ నగరం, శికారిపుర, తీర్థహళ్లిలో బీజేపీ గెలుపొందగా భద్రావతి, సాగర, సొరబ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. తీర్థహళ్లి నుంచి బీజేపీ అభ్యర్థి అరగ జ్ఞానేంద్ర, శికారిపుర నుంచి విజయేంద్ర, శివమొగ్గ నగరం నుంచి చెన్నబసప్ప విజయం సాధించారు. భద్రావతి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సంగమేశ్వర, సాగర నుంచి గోపాలకృష్ణ, సొరబ నుంచి మధు బంగారప్ప, శివమొగ్గ గ్రామీణ నుంచి శార పోర్యానాయక్ గెలిచారు.

మోదీ, షా ప్రచారంతో గెలిచిన అభ్యర్థులు

యశవంతపుర: ప్రధాని మోదీ, హోం మంత్రి షా, యూపీ సీఎం యోగి అదిత్యానాథ్‌లు ప్రచారం చేసిన ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. హుమ్నాబాద్-సిద్దు పాటిల్, విజయపుర-బసనగౌడ పాటిల్ యత్నాల్, యలహంక-ఎస్ఆర్ విశ్వనాథ్, బేలూరు-హుల్లహళ్లి సురేశ్, మూడబిదరె-ఉమానాథ్ కోట్యాన్, తుమకూరు గ్రామాంతర-బీ సురేశ్‌గౌడ, బెంగళూరు దక్షిణ-ఎం కృష్ణప్ప, యశవంతపుర-ఎస్‌టీ సోమశేఖర్‌లు గెలిచారు.

ఓడిన బీజేపీ అభ్యర్థులు వీరే

చిత్తాపుర-మణికంఠ రాథోడ్, నంజనగూడు- బీ హర్షవర్దన్, బాదామి-శాంతాగౌడ పాటీల్, హవేరి-గవిసిద్ధప్ప ద్యామణ్ణవర, శివమొగ్గ గ్రామాంతర-అశోక్ నాయక్, చిక్కోడి-రమేశ్‌లు ఓడిపోయారు.

చింతామణిలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు


ప్రమాణపత్రం అందుకుంటున్న సుధాకర్

చింతామణి: విధానసభ ఎన్నికల్లో చింతామణి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాకర్ తన సమీప ప్రత్యర్థి, జేడీఎస్ పార్టీకి చెందిన కృష్ణారెడ్డిపై 28,745 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో ఆయన అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. సుధాకర్‌కు 96,336 ఓట్లు రాగా, కృష్ణారెడ్డికి 67591 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వేణుగోపాల్‌కు 21462 ఓట్లు పోలయ్యాయి. ప్రతి రౌండ్‌లోను సుధాకర్ లీడ్ కనబరిచారు.

చిక్కబళ్లాపురంలో కాంగ్రెస్ జయభేరి



చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ ఈశ్వర్ గెలిచారు. ఈయన తన ప్రత్యర్థి, మాజీ మంత్రి సుధాకర్‌పై విజయం సాధించారు. ఈ సందర్భంగా ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడుతూ...తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో అభివృద్ధిపై దృషిసారిస్తానన్నారు. ప్రదీప్ ఈశ్వర్‌కు 86,224 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి సుధాకర్‌కు 75,582 ఓట్లు వచ్చాయి.

తుమకూరు జిల్లాలో కాంగ్రెస్ ఆధిపత్యం

- ఏడు స్థానాల్లో విజయం
- రెండుచోట్ల బీజేపీ
- మరో రెండుచోట్ల జేడీఎస్ గెలుపు

తుమకూరు: తుమకూరు జిల్లాలో కాంగ్రెస్ ఆధిపత్యం చాటింది. 11 శాసనసభ నియోజకవర్గాల్లో ఏడు స్థానాల్లో కాంగ్రెస్, రెండు బీజేపీ, రెండు జేడీఎస్ పార్టీ కైవసం చేసుకున్నాయి. శనివారం ఉదయం ఇక్కడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపులో మొదటి నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. కొరటిగెరెలో డాక్టర్ పరమేశ్వర్, మధుగిరి-రాజన్న, శిర-టీబీ జయచంద్ర, టిపటూరు-షడక్షరి, కుణిగల్-రంగనాథ్, గుబ్బి-శ్రీనివాస్, పావగడ-వెంకటేశ్ విజయం సాధించారు. జేడీఎస్ నుంచి తురువెకెరె-ఎంటీ కృష్ణప్ప, చిక్కనాయకనహళ్లి-సురేశ్‌బాబు, బీజేపీ నుంచి తుమకూరు నగర


తుమకూరులో కాంగ్రెస్ నేతల విజయోత్సవం

జీబీ జ్యోతిగణేశ్, తుమకూరు గ్రామీణ నుంచి సురేశ్‌గౌడ విజయం సాధించారు.

ఓడిన మంత్రులు : తుమకూరు జిల్లా నుంచి మంత్రులుగా పనిచేసిన వారు ఓటమిపాలయ్యారు. చిక్కనాయకనహళ్లి నుంచి గెలిచి చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన జేసీ మాదుస్వామి, తిపటూరు నుంచి గెలిచి ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా చేసిన బీసీ నాగేశ్ ఈ ఎన్నికల్లో ఓడిపోయారు.

సతీశ్‌రెడ్డి, రామలింగారెడ్డి గెలుపు


డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న సతీష్ రెడ్డి

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సతీశ్‌రెడ్డి గెలిచారు. తన సమీప ప్రత్యర్థి ఉమాపతి శ్రీనివాసగౌడపై 22 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు.


డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న రామలింగారెడ్డి

రామలింగారెడ్డి విజయం..

నగరంలోని బీటీఎం లేఔట్‌లో 8వ సారి కాంగ్రెస్ అభ్యర్థి రామలింగారెడ్డి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి శ్రీధర్ రెడ్డిపై 14 వేల మెజార్టీతో విజయం సాధించారు.

హోసూరు వార్తలు..

కాంగ్రెస్ సంబరాలు


హోసూరులో కార్యకర్తల ఉత్సాహం

హోసూరు: కర్ణాటకలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక మెజార్టీతో గెలుపొందడంతో హోసూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుకొన్నారు. పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని టపాసులు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. డెంకణీకోట, కెలమంగలం, బాగలూరు, బేరికె, సూళగిరి, అంచెట్టి ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు చేసుకున్నారు.

ప్రైవేటు స్కూళ్ల బస్సుల తనిఖీ

హోసూరు: హోసూరు ఆర్డీవో కార్యాలయంలో శనివారం ప్రైవేట్ పాఠశాల వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ దీపక్‌జేకప్, హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య, ఆర్డీవో అధికారులు పాఠశాల బస్సుల నాణ్యతను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ బడుల బస్సులపై పాఠశాల పేరు, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా ముద్రించాలని, డ్రైవర్‌లు జాగ్రత్తగా నడపాలని, వాహనాలను మంచి కండీషన్‌లో ఉండాలని తెలిపారు. వాహనాల్లో తప్పని సరిగా ప్రథమ చికిత్స బాక్స్, అగ్నిప్రమాద నివారణ ఉపకరణాలను ఉంచుకోవాలని, అత్యవసర డోర్ తప్పక ఉండాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ ద్వారా బస్సు డ్రైవర్‌లకు అగ్నిప్రమాదాల నివారణపై చైతన్యం కల్పించారు. 612 వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబుప్రసాద్, ఆర్డీవో దురైస్వామి, మోటార్ వాహన పరిశీలకులు మణిమారన్, జిల్లా విద్యాశాఖాధికారి గోవిందన్ పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరు మృతి

క్రిష్ణగిరి: బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల మేరకు ధర్మపురి జిల్లా పాలకోడు సమీపంలోని చెలియంబట్టి గ్రామానికి చెందిన విజయ్ (27) శుక్రవారం సాయంత్రం హోసూరు-క్రిష్ణగిరి హైవేపై కురుబరపల్లి వద్ద ద్విచక్రవాహనంలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయాలేర్పడిన విజయ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కురుబరపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో కార్మికుడు..

హోసూరు: గుండెపోటు రావడంతో కుంటలో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన కురుబరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు కావేరిపట్టణం సమీపంలోని సందాపురం గ్రామానికి చెందిన ఆనంద్ (46). శుక్రవారం కురుబరపల్లి సమీపంలో కూలిపనులకెళ్లాడు. సాయంత్రం విధులు ముగించుకొని సమీపంలోని నీటికుంటలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండగా గుండెపోటు రావడంతో నీటికుంటలో పడడంతో ప్రాణాలు పోయాయి. కురుబరపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

బాబోయ్.. హంతక ఏనుగులు

క్రిష్ణగిరి: కొన్నిరోజులుగా జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రాంతంలో సంచరిస్తూ వచ్చిన రెండు ఏనుగుల దాడులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ధర్మపురి జిల్లా మారండపల్లి అటవీ ప్రాంతం నుంచి గత కొద్ది రోజుల క్రితం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రాంతానికి చేరుకొన్న రెండు ఏనుగులు వారం కిందట క్రిష్ణగిరి సమీపంలోని దేవసముద్రం చెరువులో చేపలు పడుతున్న జాలరిపై దాడి చేసి చంపాయి. అనంతరం రైతు పంటలపై దాడులు చేస్తూ పంటలను తొక్కి ధ్వంసంచేశాయి. చిత్తూరుజిల్లా సరిహద్దుల్లో ఇద్దరు మహిళలను తొక్కి చంపడంతో పరిసర ప్రాంతాల ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో సంచరిస్తున్న ఈ జంట ఏనుగులు నెలరోజుల్లో 6 మందిని పొట్టనబెట్టుకున్నాయని స్థానికులు తెలిపారు. ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.


సరిహద్దు ప్రాంతంలో సంచరిస్తున్న జంట ఏనుగులు

వేర్వేరుగా ఇద్దరు ఆత్మహత్య

హోసూరు: క్రిష్ణగిరి, డెంకణీకోట ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు జిల్లా కేంద్రం క్రిష్ణగిరి భారతీనగర్‌కు చెందిన కూలి కార్మికుడు ప్రభాకరన్ (26) కుటుంబ కలహాలతో గత 9వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక శుక్రవారం రాత్రి మృతి చెందాడు. డెంకణీకోట తాలూకా ఎస్. కురుబట్టి గ్రామానికి చెందిన వృద్ధుడు మునియప్ప(75) గత కొద్ది రోజుల క్రితం ఓ ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందినా గాయాల నొప్పులు పోలేదు. దీంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ రెండు ఘటనల్లో స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఆత్మవిమర్శ చేసుకోవాలి: యడ్డి

శివాజీనగర: గెలుపోటములు బీజేపీకి కొత్త కాదని, రెండు సీట్ల నుంచి ఆరంభించి, సొంత బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని, ఈ ఫలితాలతో పార్టీ కార్యకర్తలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని యడియూరప్ప అన్నారు. ప్రజాభిమానం కలిగిన ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రగతిపాలనను అందించిందని, అయినా కూడా పార్టీకి తగిన మెజారిటీ లభించలేదు. దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును గౌరవంతో స్వీకరిస్తామని, ఓటర్లకు ధన్యవాదాలని తెలిపారు.

మైసూరులో కాంగ్రెస్ విజయం

కంచుకోటలో పట్టుకోల్పోయిన జేడీఎస్

మైసూరు: తాజా శాసనసభ ఎన్నికల్లో జేడీఎస్ కంచుకోటగా ఉన్న మైసూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. మైసూరు, పాత మైసూరు ప్రాంతంలో కాంగ్రెస్ విజయం సాధించింది. మండ్య జిల్లాలో ఏడు స్థానాలకు గాను ఐదు స్థానాల్లో విజయం సాధించిన కాంగ్రెస్, మైసూరులోనూ అదే హవా కొనసాగించింది. చామరాజనగర జిల్లాలో జేడీఎస్‌కు అవకాశం లేకుండా చేసింది. ఈసారి జేడీఎస్ టి నరిసిపుర, కేఆర్ నగర, పిరియా పట్టణాల్లో తన పట్టు కోల్పోయింది. హుణసూరు, చాముండేశ్వరిలో మాత్రం విజయం సాధించింది.

ఫలించని సినీ నటులు ప్రచారం

యశవంతపుర: విధానసభ ఎన్నికలలో బీజేపీ తరపున నటులు సుదీప్, దర్శన్ ప్రచారం చేసిన అనేక చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి చెందారు. ప్రచారానికి ప్రజలు వచ్చారు కానీ నటుల ముఖాలు చూసి ఓట్లు పడలేదు. సుదీప్, దర్శన్‌లు బీజేపీ తరపున కాళ్లకు బలపాలు కట్టుకొని రాష్ట్రమంతా తిరిగారు. ప్రజలు రావటంతో అభ్యర్థులు గెలుస్తారానే భావనలో ఉన్న వీరికి ఓటర్ల తీర్పుతో కంగుతిన్నారు. రాష్ట్రమంతటా ప్రచారం చేసిన దర్శన్, సుదీప్‌ల ప్రభావం ఎక్కడ కనిపించలేక పోయింది. రాజకీయాలు వేరు, సినిమారంగం వేరంటూ ఓటర్లు సమాధానం ఇచ్చారు. బీజేపీ నాయకులు సుదీప్‌కు హెలికాప్టర్ కేటాయించారు. నటులను ముందర పెట్టుకుని గెలవాలనే ప్రయత్నంలో బీజేపీ ఘోరంగా విఫలమైంది. ఇక దర్శన్ అనేక చోట్ల ప్రచారం చేశారు. ప్రచారం చివరి రోజున దొడ్డబళ్లాపురలో జేడీఎస్ అభ్యర్థి మునేగౌడ, బెంగళూరు రాజరాజేశ్వరనగర బీజేపీ అభ్యర్థి మునిరత్న తరపున ప్రచారం చేశారు. అయితే సీఎం బసవరాజ బొమ్మై మినహా అనేక చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు ఓటమిపాలయ్యారు. ఇక చిక్కబళ్లాపుర బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలుగు హాస్య నటుడు బ్రహ్మానందం లాంటి వారిని పిలిపించి ప్రచారం చేసినా ఆయనకు ఓటమి తప్పలేదు.

యలహంకలో బీజేపీ సంబరాలు


విజయోత్సవాల్లో విశ్వనాథ్

బనశంకరి: యలహంక నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎస్ఆర్.విశ్వనాథ్ జయకేతనం ఎగురవేశారు. ఆయన 1,26,294 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి కేశరాజణ్ణకు 70,534, జేడీఎస్ 38,102 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. శనివారం ఫలితాలు వెలువడగానే విశ్వనాథ్ బీజేపీ కార్యకర్తలతో కలిసి ఊరేగింపుగా వెళ్లి కెంపేగౌడ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తన గెలుపునకు కృషిచేసిన బీజేపీ నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

ఓటమికి బాధ్యత వహిస్తా: కటీల్

శివాజీనగర:విధానసభ ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తానని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్ తెలిపారు. ఫలితాల గురించి ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర ప్రజలకు ఉత్తమ పరిపాలనను అందించిందని, మాజీ సీఎం యడియూరప్ప, సీఎం బొమ్మై అత్యుత్తమ పరిపాలన చేశారు. ప్రజోపయోగ పథకాలను అమల్లోకి తీసుకొచ్చారు. అయినా కూడా ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయి. ప్రజా తీర్పును శిరసావహిస్తామన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

హోసూరు: ఆరోగ్యశాఖలో తాత్కాలిక మహిళా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని శనివారం హోసూరు పట్టణంలోని ఆగ్రా మహల్లో జరిగిన మండల సమావేశంలో తీర్మానించారు. సంఘ అధ్యక్షురాలు మేనక అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ముఖ్య అతిథిగా తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ పాల్గొని మాట్లాడారు. ఏఐటియూసీ కార్మిక సంఘం 1920వ సంవత్సరం అక్టోబర్ 31వ తేదీలోనే ప్రారంభమైందని, ఈ సంఘంలో క్రిష్ణగిరి, ధర్మపురి జిల్లాలో 400 వేల మందికి పైగా మహిళలు ఆరోగ్యశాఖలో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. నెల జీతం రూ. 24 వేలకు పెంచాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఉద్యోగ నేతలు పాల్గొన్నారు.

స్వల్ప ఓట్లతో దినేశ్ గుండూరావ్ గెలుపు

శివాజీనగర: గాంధీనగర విధానసభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన దినేశ్ గుండూరావు అతి కష్టంమీద గెలుపు సాధించారు. తన ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థిపై కేవలం 113 ఓట్లతో గెలిచారు. దినేశ్ గుండూరావ్‌కు 53,980 ఓట్లు రాకగా బీజేపీ అభ్యర్థికి 53,867 ఓట్లు వచ్చాయి. వరుసగా ఐదుసార్లు గెలిచిన దినేశ్ గుండూరావ్ ఆరోసారి బరిలో దిగారు. స్వల్ప మెజార్టీతో గట్టెక్కారు. జేడీఎస్ నుంచి నారాయణస్వామి, స్వతంత్ర అభ్యర్థిగా కృష్ణయ్య శెట్టి గట్టి పోటీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో మంత్రి స్థానం లభిస్తుందనే విశ్వాసంలో దినేశ్ గుండురావు ఉన్నట్లు తెలుస్తోంది.

సీఎం క్యాంప్ కార్యాలయంలో నాగుపాము

యశవంతపుర: ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై వరుసగా నాలుగోసారి విషయం సాధించారు. అయితే శిగ్గాంవిలోని సీఎం క్యాంప్ కార్యాలయం ఆవరణంలో నాగుపాము కనిపించింది. ఒకవైపు ఎన్నికల లెక్కింపు జరుగుతుండగా క్యాంప్ ఆఫీసులో నాగుపాము కనిపించటంతో అందరూ హడలిపోయారు. పైకప్పు నుంచి పాము కిందకు దిగుతుండగా గమనించి చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అదే సమీపంలో సీఎం బసవరాజ బొమ్మై ఎన్నికల ఫలితాలను టీవీలో చూస్తుండగా ఈ ఘటన జరిగింది.

ఫలితాలపై స్పందన

వచ్చే లోక్‌సభ ఎన్నికలతో మొదలయ్యే బీజేపీ అంతానికి ఆరంభం ఇది. దారుణ నిరంకుశ, ఆధిపత్య రాజకీయాలను జనం అంతం చేశారు.
–తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ

ఇకపై తమ పాచికలు పారవని బీజేపీ ఇకనైనా గుర్తించాలి.
–ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి పూర్తి బాధ్యత నాదే. మెరుగైన ఎన్నికల వ్యూహం కాంగ్రెస్ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి కావొచ్చు
–కర్ణాటక మాజీ సీఎం బొమ్మై

ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతికి వ్యతిరేకంగా కొత్త సానుకూల భారత్ దిశగా ప్రజలిచ్చిన తిరుగులేని తీర్పు
– ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడింది. మోదీతో ఏదైనా సాధ్యమనే నినాదాన్ని ప్రజలు తిప్పికొట్టారు.
– ఎన్‌సీపీ చీఫ్ శరద్‌పవార్

కాంగ్రెస్‌కు చరిత్రాత్మక విజయాన్ని అందించిన కర్ణాటక ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ ఎన్నికల్లో గెలవడమంటే కర్ణాటక రాష్ట్రాభివృద్ధే ముఖ్యమన్న ఆలోచనకు జై కొట్టడమే. దేశాన్ని ఐక్యం చేసే రాజకీయ గెలుపు ఇది. పార్టీ కోసం చెమట చిందించి పనిచేసిన కార్యకర్తలకు ప్రజలు చెల్లించిన మూల్యమిది. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు పార్టీ అవిశ్రాంతంగా పనిచేస్తుంది. రాహుల్ భారత్ జోడో పాదయాత్ర వెంటే విజయం పాదం కదిపింది.
– ప్రియాంక గాంధీ

వాడిపోయిన కమలం



సాక్షి, నేషనల్ డెస్క్

కర్ణాటకలో ఆనవాయితీ మారలేదు. అధికార పార్టీ వరుసగా రెండోసారి అధికారంలోకి రాలేకపోయింది. శాసనసభ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఘోర పరాజయం చవిచూసింది. మొత్తం 224 స్థానాలకు గాను 2018లో 104 స్థానాలు సాధించిన ఆ పార్టీ ఈసారి కేవలం 65 స్థానాలతో సరిపెట్టుకుంది. కనీసం అధికారానికి చేరువగా కూడా రాలేదు. ఈ ఓటమిని బీజేపీ పెద్దలు ఏమాత్రం ఊహించలేకపోయారు. హేమాహేమీలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మా కూడా గట్టెక్కించలేదు. రాష్ట్రంలో బీజేపీ పేలవమైన పనితీరుకు ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి.

కర్ణాటకలో బీజేపీ ఓటమికి ఎన్నో కారణాలు

- బీజేపీ ప్రభుత్వ అవినీతిపై విసుగెత్తిపోయిన ఓటర్లు
- కాషాయ పార్టీ పట్ల దళితులు, ఆదివాసీలు, ఓబీసీల విముఖత

కర్ణాటకలో బీజేపీని ముందుండి నడిపించడానికి బలమైన నాయకులు లేకుండాపోయారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం దాకా.. అంతా అధిష్టానం కనుసన్నల్లోనే సాగింది. ముఖ్యమంత్రి పదవి నుంచి యడియూరప్పను తొలగించి బసవరాజ్ బొమ్మైని గద్దెనెక్కించడం బీజేపీకి నష్టం చేకూర్చింది. ముఖ్యమంత్రిగా బసవరాజ్ బొమ్మై ప్రజలను ఏమాత్రం మెప్పించలేకపోయారు. బొమ్మై పరిపాలనపై రగిలిన అసంతృప్తి సెగలు బీజేపీ కొంపముంచాయి.

ఇతర వర్గాలపై చిన్నచూపు

రాష్ట్రంలో లింగాయత్, ఒక్కళిగ వంటి ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు కొల్లగొట్టడమే లక్ష్యంగా బీజేపీ పలు హామీలు ఇచ్చింది. రిజర్వేషన్ల అస్త్రాన్ని ప్రయోగించింది. కానీ, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, మైనార్టీలను ఆకట్టుకోవడంలో విఫలమైంది. ఇంతచేసినా లింగాయత్‌లు, ఒక్కళిగలు బీజేపీని ఆదరించలేదు. ముస్లింలు, దళితులు, ఓబీసీలు మాత్రమే కాకుండా లింగాయత్‌లు, ఒక్కళిగలు సైతం కాంగ్రెస్‌కే ఓటేశారు.

పెచ్చరిల్లిన అవినీతి.. కమీషన్ల దందా

'40 శాతం ప్రభుత్వం'అంటూ బీజేపీ సర్కారు కమీషన్ల దందాపై కాంగ్రెస్ చేసి ప్రచారం ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ నేతలు నిప్పులు చెరిగారు. ఎన్నికల ప్రచారంలో అవినీతి అంశం ప్రముఖంగా తెరపైకి వచ్చింది. జనంలో విస్తృతంగా చర్చ జరిగింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కేఎస్ ఈశ్వరప్ప మంత్రి పదవికి రాజీనామా చేయడం బీజేపీకి ఇబ్బందికరంగా పరిణమించింది. అవినీతి బాగోతం, కమీషన్ల వ్యవహారంపై కర్ణాటక కాంట్రాక్టర్ల సంఘం ప్రధానికి ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది.

ప్రభుత్వ వ్యతిరేకత

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వంపై జనంలో వ్యతిరేకత నానాటికీ పెరిగింది. ఎన్నికల్లో ఓటమికి ఇదో ప్రధాన కారణమని చెప్పొచ్చు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోవడంతోపాటు బీజేపీ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం జనాన్ని నిరాశపర్చింది. ప్రజా వ్యతిరేకతను తగ్గించుకొనే ప్రయత్నాలేవీ బీజేపీ పెద్దలు చేయలేదు. బీజేపీ ఇంకా అధికారంలో కొనసాగితే ఒరిగేదేమీ లేదన్న నిర్ణయానికి ప్రజలు వచ్చారు. అందుకే ఇంటికి సాగనంపారు. ప్రధాని మోదీ కర్ణాటకలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రైల్వే ప్రాజెక్టులు, జలవనరుల పథకాలు, రోడ్డు నిర్మాణాలు, ఎక్స్‌ప్రెస్ వే వంటివి చేపట్టినా ప్రజలు పట్టించుకోలేదు.

పనిచేయని హిందూత్వ కార్డు

హలాల్, హిజాబ్, అజాన్, జై భజరంగ బలి, హనుమాన్ చాలీసా.. ఇవన్నీ కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ నమ్ముకున్న ఆయుధాలు. కర్ణాటకలో తలెత్తిన హలాల్, హిజాబ్, అజాన్ వివాదాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ మతాన్ని వాడుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తాయి. కానీ, అవేవీ బీజేపీని కాపాడలేకపోయాయి. బీజేపీ హిందూత్వ కార్డు కర్ణాటకలో ఎంతమాత్రం పనిచేయలేదని స్పష్టంగా తేలిపోయింది.

బీజేపీ పెద్దల శ్రమ నిష్ఫలం

సాక్షి బెంగళూరు: కర్ణాటక ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ హైకమాండ్ పూర్తిగా తలకెత్తుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేశారు. వారి రోడ్ షోలు, బహిరంగ సభలు బీజేపీని కాపాడలేకపోయాయి. బీజేపీ పెద్దల ర్యాలీలకు ప్రజలు భారీగా తరలివచ్చినా అధికారం మాత్రం దక్కలేదు. రాష్ట్రంలో యడియూరప్ప నేతృత్వంలో కాకుండా తొలిసారిగా బీజేపీ అధిష్టానం నేతృత్వంలో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొన్నారు. పార్టీ అగ్రనేతలు రాష్ట్రంలోని కీలక ఆరు ప్రాంతాలను చుట్టేస్తూ ఎన్నికల ప్రచారం సాగించారు. అమిత్ షా రెండున్నర నెలల్లో 17 సార్లు రాష్ట్రానికి వచ్చారు. ప్రధాని మోదీ 10 సార్లకుపైగా వచ్చారు. మరో 31 మంది ఇతర రాష్ట్రాల బీజేపీ ప్రతినిధులు, నాయకులు కర్ణాటకలో ప్రచారంలో పాలుపంచుకున్నారు. నరేంద్ర మోదీ 19 బహిరంగ సభలు, 6 రోడ్డు షోలలో పాల్గొనగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 10 బహిరంగ సభలు, 16 రోడ్డు షోలలో పాల్గొన్నారు. ఇక అమిత్ షా 16 బహిరంగ సభలు, 17 రోడ్డు షోలు నిర్వహించారు. రాజధాని బెంగళూరులో మోదీ నిర్వహించిన మెగా రోడ్డు షో అందరి దృష్టిని ఆకర్షించింది. అగ్రనేతలు ఇంతగా శ్రమించినా ఫలితం దక్కలేదు. బీజేపీ ఓటమిని మూటగట్టుకుంది.

'కింగ్‌మేకర్' కలలు భగ్నం

- చతికిలపడిన జేడీ(ఎస్)
- కేవలం19 స్థానాలకు పరిమితం
- దెబ్బతీసిన కుటుంబ వివాదాలు

సాక్షి, బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రాంతీయ పార్టీ అయిన జేడీ(ఎస్)ను పూర్తిగా నిరాశపరిచాయి. ఆ పార్టీ కేవలం 19 సీట్లు గెలుచుకుంది. మరోసారి 'కింగ్‌మేకర్' అవ్వాలన్న జేడీ(ఎస్) కలలు భగ్నమయ్యాయి. కర్ణాటకలో 2004, 2018లో హంగ్ ప్రభుత్వాలు ఏర్పడి జేడీ(ఎస్) అధికారంలోకి వచ్చింది. హంగ్ వచ్చిన ప్రతిసారీ ఆ పార్టీ కింగ్‌మేకర్ అవతారం ఎత్తుతూ వచ్చింది. 2004లో బీజేపీతో, 2018లో కాంగ్రెస్‌తో జతకట్టింది.

కంచుకోటలో ప్రభావం అంతంతే

2018 ఎన్నికల్లో 37 స్థానాల్లో గెలుపొందిన జేడీ(ఎస్) ఈసారి మాత్రం 19 సీట్లకే పరిమితం అయింది. తమ కంచుకోటగా భావించే పాత మైసూరు ప్రాంతంలోనూ జేడీ(ఎస్) పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఎన్నికల ముందు 'పంచరత్న రథయాత్ర' పేరిట జేడీ(ఎస్) నేత, మాజీ సీఎం కుమారస్వామి చేసిన రాష్ట్ర వ్యాప్తంగా చేసిన బస్సు యాత్ర సత్ఫలితాన్ని ఇవ్వలేదు. 87 ఏళ్ల రాజకీయ దురంధరుడు హెచ్‌డీ దేవెగౌడ వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో విరివిగా పాల్గొన్నారు. అధికారం అప్పగిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలను వేడుకున్నారు. అయినా ఉపయోగం కనిపించలేదు. రాష్ట్రంలో జేడీ(ఎస్) ఓట్ల శాతం క్రమంగా పడిపోతోంది. 2004లో ఆ పార్టీకి 20.8 శాతం, 2018లో 18 శాతం, ఈసారి దాదాపు 13 శాతం ఓట్లు లభించాయి.

నిఖిల్ గౌడ పరాజయం

దేవెగౌడ కుటుంబంలోని లుకలుకలు కూడా ఈ ఎన్నికల్లో జేడీ(ఎస్)ను దెబ్బతీశాయి. దేవెగౌడ పెద్ద కోడలు భవానీ రేవణ్ణ.. హాసన్ అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆ స్థానాన్ని తన వదినకు ఇచ్చేందుకు కుమారస్వామి సానుకూలంగా లేకపోవడంతో కుటుంబంలోని విభేదాలు బహిర్గతమయ్యాయి. ఇలా కుటుంబంలో వివాదాలు, పార్టీలో కుటుంబ పెత్తనం అనే అపవాదులు జేడీ(ఎస్)ను దెబ్బతీశాయి. దేవెగౌడ కుటుంబం నుంచి ముగ్గురు పోటీ చేయగా, ఇద్దరు గెలిచారు. కుమారస్వామి కుమారుడు నిఖిల్ రామనగరలో పోటీ చేసి చిత్తుగా ఓడిపోయారు. 2019 లోకసభ ఎన్నికల్లో ఓటమిని పరాజయం పాలైన నిఖిల్ తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓడిపోవడం గమనార్హం. హాసన్‌లో దేవెగౌడ కుటుంబాన్ని సవాలు చేసిన బీజేపీ అభ్యర్థి ప్రీతం గౌడ తన ప్రత్యర్థి హెచ్‌పీ స్వరూప్‌ను ఓడించారు. చెన్నపట్టణలో కుమారస్వామి స్వల్ప మెజారిటీతో గట్టెక్కడం జేడీ(ఎస్) కొంతలో కొంత ఊరట కలిగించింది. హోలెనరసిపురలో దేవెగౌడ పెద్ద కుమారుడు హెచ్‌డీ రేవణ్ణ గెలుపొందారు.

జలంధర్ లోక్‌సభ ఉప పోరులో ఆప్ విజయం

చండీగఢ్: పంజాబ్‌లోని జలంధర్ లోక్‌సభ సీటుకు జరిగిన ఉప ఎన్నికలో ఆప్ అభ్యర్థి సుశీల్ రింకు విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్‌కు చెందిన కరంజీత్ కౌర్ చౌధరిపై ఈయన 58 వేల పైచిలుకు ఓట్ల తేడాతో గెలుపొందారు. రింకుకు 3,02,279 ఓట్లు, చౌధరికి 2,43,,588 ఓట్లు వచ్చాయని ఈసీ తెలిపింది. కరంజీత్ కౌర్ భర్త, సిట్టింగ్ కాంగ్రెస్ ఎంపీ సంతోష్ సింగ్ చౌదరి ఈ ఏడాది జనవరిలో మృతి చెందడంతో ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 10న జరిగింది. కాగా, ఈ విజయంతో పంజాబ్, ఢిల్లీల్లో అధికారంలో ఉన్న ఆప్‌కు ఏకైక ఎంపీ సీటు మళ్లీ దక్కినట్లయింది. ఇది తమ పార్టీకి దక్కిన చారిత్రక విజయమని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ఆప్‌కు 10 మంది సభ్యులున్నారు. సంగ్రూర్ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న భగవంత్‌మాన్ ఎంపీ పదవికి రాజీనామా చేసి పంజాబ్ సీఎం అయ్యారు.

గాలి సోదరుల్లో ఒకరి గెలుపు

సాక్షి, బళ్లారి: ఈసారి ఎన్నికల్లో సతీమణి, ఇద్దరు సోదరులతో వేర్వేరు నియోజకవర్గాల్లో బరిలో నిలిచినప్పటికీ మాజీ మంత్రి, ఒకప్పటి మైనింగ్ మహరాజుగా పేరొందిన గాలి జనార్దన రెడ్డి ఒక్కరే విజయం సాధించారు. సతీమణి, ఇద్దరు సోదరులు ఓడిపోయారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని హరపనహళ్లి నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసిన గాలి కరుణాకర రెడ్డి ఓటమి పాలయ్యారు. ఇక్కడ స్వతంత్ర మహిళా అభ్యర్థి గెలిచారు. బళ్లారి నగర నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున పోటీ చేసిన గాలి సోమశేఖరరెడ్డి సైతం ఓటమిని చవిచూశారు. కొప్పళ జిల్లాలోని గంగావతి నియోజకవర్గం నుంచి సొంత పార్టీ అయిన కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) తరపున పోటీ చేసిన గాలి జనార్దనరెడ్డి ఒక్కరే ఘన విజయం సాధించారు. సమీప ప్రత్యర్థిపై 8,266 ఓట్ల తేడాతో గెలుపొందారు.

పరాజితుల్లో 14 మంది మంత్రులు

బెంగళూరు: ఎన్నికల్లో సీఎం బొమ్మై కేబినెట్‌లోని 14 మంది మంత్రులు ఓడారు. పరాజయం పాలైన వారిలో బి.శ్రీరాములు, కె.సుధాకర్, జేసీ మధుస్వామి, గోవింద్ కర్జోల్, ఎంటీబీ నాగరాజ, కేసీ నారాయణ గౌడ, బీసీ పాటిల్, శంకర్ పాటిల్ మునెన కొప్ప, హాలప్ప ఆచార్, బీసీ నాగేశ్, మురుగేశ నిరానీ ఉన్నారు. మంత్రి వి.సోమన్న పోటీకి దిగిన రెండుచోట్లా ఓటమి పాలయ్యారు. మరో మంత్రి ఆర్.అశోక్ రెండు చోట్ల నుంచి బరిలోకి దిగి పద్మనాభనగర్‌లో గెలిచారు.

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి ఓటమి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే అయిన సీటీ రవి చిక్‌మగళూరులో ఓటమి పాలయ్యారు. బీజేపీ మాజీ నేత, సీటీ రవికి ఒకప్పటి సన్నిహితుడు హెచ్‌డీ తమ్మయ్య ఇక్కడ 5,926 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఏబీవీపీ నేతగా ఉన్న రవి 2018 ఎన్నికల్లో గెలిచి, యడియూరప్ప కేబినెట్‌లో మంత్రి అయ్యారు. బీజేపీ చీఫ్ జేడీ నడ్డా సూచనల మేరకు మంత్రి పదవికి రాజీనామా చేసి పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి అయ్యారు.

విజయం సాధించిన ముఖ్య నేతలు

ఎన్నికల సంఘం ఇప్పటి వరకు విజేతలుగా ప్రకటించిన వారిలో సీఎం బస్వరాజ్ బొమ్మై, కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ డీకే శివకుమార్, కేంద్ర మాజీ మంత్రి మునియప్ప తదితరులు ఉన్నారు. షిగ్గావ్ స్థానం నుంచి సీఎం బొమ్మై కాంగ్రెస్‌కు చెందిన సమీప ప్రత్యర్థి యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్‌ను 35,978 ఓట్ల తేడాతో ఓడించారు. అదేవిధంగా, కంచుకోట వంటి కనకపురలో కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ డీకే శివకుమార్ జేడీఎస్‌కు చెందిన బి.నాగరాజ్‌పై 1,22,392 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. కొరటగెరెలో రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం, కేపీసీసీ మాజీ చీఫ్ జి.పరమేశ్వర 14,347 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరి అథని నుంచి పోటీకి దిగిన మాజీ డిప్యూటీ సీఎం లక్ష్మణ్ సవాడి 76 వేల పైచిలుకు ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిపై గెలిచారు.

సిద్దరామయ్య తొమ్మిదోసారి..

మైసూరు: మాజీ సీఎం సిద్దరామయ్య 9వ సారి అసెంబ్లీలోకి అడుగు పెట్టనున్నారు. వరుణ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన ఆయన 46,006 ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన ప్రత్యర్థి వి.సోమన్నపై గెలిచారు. 5 పర్యాయాలు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి సోమన్న బెంగళూరులోని తన సొంత నియోజకవర్గంను వీడి సిద్దరామయ్యను కంచుకోటలో ఢీకొట్టారు.

'కనకపుర రాక్'డీకే శివకుమార్

డీకే శివకుమార్ 1989 నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహతంగా గెలుస్తూ వస్తున్నారు. తాజాగా ఆయన ఎనిమిదోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో 79,909 ఓట్ల ఆధిక్యంతో గెలిచిన శివకుమార్ ఈసారి అంతకుమించి 1,21,595 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఇక్కడ బీజేపీకి చెందిన ఆర్.అశోక 19,602 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. 2008లో కనకపుర నియోజకవర్గం ఏర్పాటైంది.

ధాన్యం సేకరణపై అపోహలు వద్దు

- తడిసిన, రంగు మారిన . ధాన్యాన్ని కూడా సేకరిస్తున్నాం
- రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రారెడ్డి



కాకినాడ: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి స్పష్టం చేశారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎటువంటి అభ్యంతరాలు లేకుండా సేకరిస్తున్నామన్నారు. శనివారం ఇక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీలో 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 9 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తయిందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ పారదర్శక విధానాల వల్ల రైతులతో, ఆర్బీకేలతో మిల్లర్లకు ఎటువంటి ప్రత్యక్ష సంబంధాలు లేవన్నారు. గోదావరి జిల్లాలతో పాటు కొన్నిచోట్ల బొండాలు రకం (బాయిల్డ్) అధికంగా సాగు చేయడంతో తమ సూచన మేరకు ముందుగానే సీఎం వైఎస్ జగన్ కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి వాటిని కూడా కొనేందుకు అనుమతి తెచ్చారన్నారు. దీనివలన ప్రస్తుత రబీలో 5 లక్షల టన్నుల వరకు బొండాలు రకం ధాన్యం సేకరణకు అవకాశం ఉందని, ఇప్పటివరకు 38,000 టన్నులు ప్రభుత్వం కొన్నదని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో మిల్లర్ల కారణంగా రైతులకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారం వాస్తవం కాదని, తమపై బురదజల్లవద్దని కోరారు. రైతులు కూడా దళారి వ్యవస్థపై ఆధారపడకుండా ఆర్బీకేల ద్వారా ధాన్యం విక్రయించాలని చెప్పారు. ఈ సమావేశంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, తూర్పు గోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు మోహనరెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలపై సీపీఐ, సీపీఎం హర్షం

సాక్షి, అమరావతి: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సీపీఐ, సీపీఎం హర్షం వ్యక్తంచేశాయి. ఈ మేరకు ఉభయ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బీజేపీ నిరంకుశ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కన్నడ ప్రజలు ఇచ్చిన తీర్పు ఇది అని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ఈ ఫలితాలు ఒక మలుపు అని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో బీజేపీ నిరంకుశ పాలనకు గోరీ కట్టడానికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నాంది అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రధాన రాజకీయ పార్టీలు అవకాశవాదంతో బీజేపీతో అంటకాగడం మానుకుని ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని కోరారు.

రైతుకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత సీఎం జగన్‌దే

మంత్రి కారుమూరి



తణుకు నరేంద్ర సెంటర్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తణుకు అర్బన్/అత్తిలి : ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థ లేకుండా రైతుకు గిట్టుబాటు ధరను నేరుగా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వర రావు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ఇబ్బందులు పడుతున్న రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రతి గింజనూ కొనుగోలు చేసి వారి బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేసిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తన ధాన్యం కొనలేదు.. గిట్టుబాటు ధర ఇవ్వలేదు.. అని ఏ ఒక్క రైతూ అననప్పటికీ తగుదునమ్మా అని తణుకులో చంద్రబాబు నిర్వహించిన రైతు పోరుబాట పాదయాత్ర, సభ జనాదరణ లేక అట్టర్ ఫ్లాప్ షో అయ్యాయని చెప్పారు. తన సామాజికవర్గానికి చెందిన తణుకు టీడీపీ నాయకుడిని ఎమ్మెల్యేగా గెలిపించాలనే తపనతో ఏదోరకంగా జాకీ లేసి పైకి లేపేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నం కూడా బెడిసికొట్టిందని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోళ్లపై నాలుగేళ్లపాటు మాట్లాడని చంద్రబాబు.. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రాజకీయ దురుద్దేశంతో తణుకుకు రెండుసార్లు వచ్చాడని దుయ్యబట్టారు. చంద్రబాబు యాత్రలో రైతులు లేకపోగా దూరప్రాంతాల నుంచి తీసుకొచ్చిన జనంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని ఎద్దేవా చేశారు. బీసీలను ఓటు యంత్రంగా వాడుకునే చంద్రబాబుకు రానున్న రోజుల్లో బీసీలే తగిన పాఠం చెబుతారని హెచ్చరించారు. జనం లేని సభలో టీడీపీ నాయకులు మీడియాపై కూడా దాడులకు దిగే హీనస్థితికి దిగజారిపోయారని మంత్రి కారుమూరి మండిపడ్డారు.



మంత్రి కారుమూరి

చంద్రబాబు దిష్టిబొమ్మల దహనం

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు చేపట్టిన రైతు పోరుబాట యాత్రలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ.. మంత్రికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం అత్తిలి, తణుకులో చంద్రబాబు దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అత్తిలి మండల అధ్యక్షుడు రంభ సూరిబాబు, పార్టీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ తదితరులు చంద్రబాబు తీరును తీవ్రంగా ఖండించారు. అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో, తణుకు నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించి చంద్రబాబు దిష్టిబొమ్మలను దహనం చేశారు.

కాపులను మరోసారి మోసం చేసిన పవన్

- చంద్రబాబు లబ్ధికే జనసేన పార్టీ పెట్టారు
- రంగాను చంపిన వారితో పొత్తుకు పవన్ తహతహ
- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ: పవన్ కళ్యాణ్ కాపులను మరోసారి మోసం చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్‌కు ఎలాంటి విజన్ లేదని, చంద్రబాబుకి లబ్ధి చేకూర్చేందుకే పార్టీ పెట్టాడని అన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ఒకవైపు, ఎన్టీఆర్‌ని గద్దె దింపిన నాదెండ్ల భాస్కరరావు కుమారుడు మనోహర్‌ను మరోవైపు పెట్టుకుని కార్యకర్తలను మోసం చేస్తున్నారని చెప్పారు. వంగవీటి మోహన రంగాని చంపించిన వారితో పొత్తు పెట్టుకోవడానికి పవన్ తహతహలాడుతున్నారని అన్నారు. ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని పోలీసులు హింసించినప్పుడు పవన్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. నాదెండ్ల మనోహర్‌ని ఎవరన్నా ఏమైనా అంటే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని చెప్పడం పవన్ అవివేకానికి నిదర్శనమన్నారు. లోకేశ్ పాదయాత్ర కోసం వారాహి వాహనాన్ని మూలన పెట్టారని విమర్శించారు. పవన్ ఎప్పుడూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను విమర్శిస్తుంటారని, అమ్మ ఒడి, నాడు–నేడు, రైతు భరోసా, విలేజ్ క్లినిక్‌లు వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేయడం రాక్షస పాలన అవుతుందా... అని ప్రశ్నించారు.

జర్నలిస్టుల కోసం ప్రధాన నగరాల్లో ఉచిత హెల్త్ క్యాంప్‌లు

- విజయవాడ హెల్త్ క్యాంప్‌నకు విశేష స్పందన
- త్వరలో విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతిలోనూ నిర్వహణ
- మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విడదల రజిని



జర్నలిస్ట్ హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, విడదల రజిని

సాక్షి, అమరావతి/గుణదల(విజయవాడ తూర్పు): జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. విజయవాడలోని ఆంధ్ర లయోలా ఇంజినీరింగ్ కాలేజీలో జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యుల కోసం సమాచార శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంత్రులు ప్రారంభించారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జర్నలిస్టులకు ప్రధాన నగరాల్లో ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. త్వరలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతిలో కూడా నిర్వహిస్తామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా నిలిచే విషయంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ శిబిరాల ద్వారా ప్రతి ఒక్కరికీ రూ.10 వేల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవో హరీంధిరప్రసాద్, సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు ఈ ఉచిత హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడాదిలో ఎన్నిసార్లు ఆరోగ్య పరమైన ఇబ్బందులు తలెత్తినా.. ప్రతిసారి రూ.2 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వీలుగా అతి తక్కువ ప్రీమియంతో జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌ను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందుకోసం జర్నలిస్టులు రూ.1,250 చెల్లిస్తే, ప్రభుత్వం మరో రూ.1,250 చెల్లిస్తోందని చెప్పారు.

అనూహ్య స్పందన..

జర్నలిస్టుల ఉచిత హెల్త్ క్యాంపునకు మొదటి రోజు అనూహ్య స్పందన లభించింది. ఆంధ్ర హాస్పిటల్, అమెరికన్ అంకాలజీ అండ్ ఇండో బ్రిటిష్ హాస్పిటల్, ఉషా కార్డియాక్ సెంటర్, క్యాపిటల్, కామినేని, సెంటినీ, పిన్నమనేని, హెచ్‌సీజీ క్యూరీ సిటీ క్యాన్సర్ సెంటర్ అండ్ హార్ట్ కేర్ సెంటర్, సన్‌రైజ్, అను, స్వర ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులు 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన వెయ్యి మందికి పైగా అక్రిడిటెడ్ జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని వివిధ పరీక్షలు చేయించుకున్నారు. ఈ క్యాంప్ ఆదివారం కూడా కొనసాగనుంది.

సముద్రంలో మునిగి ఇద్దరు బాలుర మృతి

- సముద్రంలో స్నానాలకు దిగడంతో దుర్ఘటన
- అదే సమయంలో అల్లకల్లోలంగా సాగరం





మృతిచెందిన ఇషాంత్, సత్య శ్యామ్‌కుమార్

జగదాంబ (విశాఖ దక్షిణ): సముద్రంలో స్నానాలకు దిగిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తూ మునిగి మరణించారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హార్బర్ సమీపంలోని గంగాలమ్మ ఆలయం వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. భూలోకమ్మ ఆలయం సమీపంలోని ఆఫీస్ కాలనీకి చెందిన దలా ఇషాంత్ (14) 8వ తరగతి చదువుతున్నాడు. కొత్త జాలారిపేటకు చెందిన పట్నాయక్ సత్యశ్యామ్‌కుమార్ (15) 10వ తరగతి పాసయ్యాడు. శనివారం మధ్యాహ్నం భోజనానంతరం ఇద్దరు ఆడుకున్నారు. అనంతరం 3 గంటల సమయంలో హార్బర్ సమీపంలోని గంగాలమ్మ ఆలయం వెనుక సముద్రంలో స్నానాలకు దిగారు. కానీ, ఆ సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో ఇద్దరు కొట్టుకుపోయారు. సమీపంలో ఉన్న మత్స్యకారులు ఇది గమనించి వెంటనే వారిద్దరినీ పట్టుకున్నారు. కానీ, ఇషాంత్‌ను ఒడ్డుకు చేర్చేటప్పటికే చనిపోయాడు. సత్య శ్యామ్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ రేవతమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని రాష్ట్రాల ఫలితాలు ఒకేలా ఉండవు: జీవీఎల్



సాక్షి, న్యూఢిల్లీ : అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికల ఫలితాలు ఒకేలా ఉండవని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించారు. దక్షిణాదిలోని కర్ణాటకలో తమకు అనుకూల ఫలితాలు రానంతమాత్రాన తెలంగాణలో విజయావకాశాలను కొట్టిపారేయలేమని ఆయన అన్నారు. జీవీఎల్ శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి దక్షిణాదిన కొత్త మార్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కర్ణాటకలో ఓట్ల శాతం తగ్గలేదని, లోక్‌సభ ఎన్నికల్లో 28 స్థానాలూ గెలుచుకుంటామని ఆయన చెప్పారు.

సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగిస్తాం

టీడీపీ నేత నారా లోకేశ్



ఆత్మకూరు(నంద్యాల): రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగిస్తామని టీడీపీ నేత నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం ఆత్మకూరు పట్టణ శివారులో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని.. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంతో పాటు రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సీఎం జగన్ బోర్లకు మీటర్లు బిగిస్తున్నారని.. సంతకాలు పెట్టకుండా వాటిని పగలగొట్టాలని రైతులను చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్‌ను కొనసాగిస్తామన్నారు. తడిసిన ధాన్యాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.5 లక్షలు దాటితే 10 శాతం కమీషన్ తీసుకుంటారని ఆరోపించారు. వర్ధన బ్యాంక్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు మోసం చేశారని.. టీడీపీ అధికారంలోకి వస్తే ఆ డబ్బు తిరిగి కట్టిస్తామన్నారు.

ప్రభుత్వ పనితీరుపై చార్జ్‌షీట్ వేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



గుంటూరు మెడికల్: గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై చార్జిషీట్ వేస్తున్నామని, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో చార్జిషీట్ సమావేశాలు నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. శనివారం గుంటూరు మార్కెట్‌సెంటర్‌లో బీజేపీ ప్రజా చార్జిషీట్ కార్యక్రమం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సోమువీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెల్లూరులో సీఎం కాన్వాయ్‌ని అడ్డుకున్న బీజేపీ నేతలపై పోలీసులు దాష్టికం ప్రదర్శించారని, ఈ విధంగా వ్యవహరిస్తే ప్రతి ప్రాంతంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ జరుగుతోందని, కేంద్రం నిధులు ఇచ్చినా ప్రభుత్వం అభివృద్ధి చేయడం లేదని ఆరోపించారు. 19న గన్నవరంలో జరిగే సమావేశంలో రాష్ట్ర స్థాయి చార్జిషీట్ ప్రకటిస్తామన్నారు. బీజేపీతోనే ఉన్నానని జనసేన నేత పవన్ కల్యాణ్ చెప్పారని, పవన్ వ్యక్తపరిచిన అభిప్రాయాన్ని కేంద్ర పెద్దలకు తెలియజేస్తామన్నారు. అమరావతి రాజధాని అనేది బీజేపీ విధానమని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 14-5-2023

వైరల్

ఈ పిల్లి 'మామ్' అంటుంది!



ఈ పిల్లి 'మ్యావ్' అంటుందా? 'మామ్' అంటుందా? అనే విషయం కాస్త కన్‌ఫ్యూజ్‌గా ఉన్నప్పటికీ 'మామ్' అంటుందనే శబ్దభ్రమను కలిగిస్తుంది. ముంబైకి చెందిన ఒక మహిళ పిల్లిని పెంచుకుంటుంది. ఆమె పేరేమిటో తెలియదుగానీ పిల్లి పేరు జగ్గు. ఒక విధంగా చెప్పాలంటే ఈ జగ్గు ఆమెకు కన్న కొడుకుగా మారిపోయి, ఆమెను నీడలా అనుసరిస్తోంది. వీరి బంధాన్ని ప్రతిబింబించే వీడియో ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అయింది. ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'జగ్గు పాటిల్'లో జగ్గు ప్రతి మూమెంట్‌ను డాక్యుమెంట్ చేశారు. 'మదర్స్ లవ్ ఈజ్ యూనివర్శల్' 'ఎందరో తల్లులు. ప్రేమ మాత్రం ఒక్కటే' 'భావోద్వేగాలు మనుషులకు మాత్రమే పరిమితమైనవి కావు' 'ఇలాంటి ప్రేమ మన దేశంలోని తల్లులకు మాత్రమే సాధ్యపడుతుంది. భగవంతుడు కోరుకునేది ఇదే' 'నిజమైన ప్రేమకు నిలువెత్తు సంతకం... తల్లి'... అంటూ నెటిజనులు స్పందించారు.

ఒక తల్లి అడిగిన మదర్స్ డే గిఫ్ట్‌లు



మదర్స్ డే సందర్భంగా తల్లికి గిఫ్ట్‌లు ఇవ్వడానికి పిల్లలు రకరకాలుగా ప్లాన్‌లు చేస్తుంటారు. అయితే ఈ పంజాబీ మహిళ మాత్రం 'మీరు ఇచ్చే గిఫ్ట్‌లు నాకు వద్దుగాక వద్దు' అంటోంది. 'అదేమిటి!' అని ఆశ్చర్యపోయేలోపే 'నేను అడిగిన గిఫ్ట్‌లు మాత్రం ఇవ్వాలి' అన్నది. ఆమె అడిగిన గిఫ్ట్‌లు...● సెల్‌ఫోన్‌తో గంటలు గంటలు గడపవద్దు. అదే లోకంగా బతకవద్దు ● పొద్దుపోయాక బద్ధకంగా నిద్ర లేవడం కాదు, ఉదయాన్నే హుషారుగా లేవాలి ● ఆన్‌లైన్ ఫుడ్ పార్శిల్స్ వద్దు. ఇంటి తిండే ముద్దు. 'ఇవి డిమాండ్సా? గిఫ్ట్‌లా?' అని ఒక యూజర్ సందేహం రైజ్ చేస్తే, మరో యూజర్ ఇలా స్పందించాడు... 'డిమాండ్స్‌కు పిల్లలు ఓకే అంటే అవే గిఫ్ట్‌లుగా మారిపోతాయి. పిల్లల మంచి భవిష్యత్‌కు మించి తల్లికి కావల్సిన గొప్ప గిఫ్ట్ ఏదీ లేదు!' సోనియా కత్రి అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అవుతోంది.

అమ్మా... నేను ఉన్నాను కదా... డోన్ట్ వర్రీ



'అయ్యో! అప్పుడే మన్‌డే వచ్చేసిందా' అని మన్‌డే బ్లూస్‌కు గురయ్యే ఉద్యోగులు చాలామందే ఉంటారు. ఒక మహిళా ఉద్యోగి 'ఈరోజు నాకు ఆఫీసుకు వెళ్లాలని లేదు' అని భయం నటిస్తూ తన చిట్టికొడుకు యువాన్ష్ భరద్వాజ్‌తో అన్నది. మామూలుగానైతే పిల్లలు పెద్దగా స్పందించరు. అయితే యువాన్ష్ మాత్రం పెద్దరికం అద్దె తెచ్చుకొని 'అలా అంటే ఎలా?' అన్నట్లుగా ఫేస్ ఫీలింగ్ ఇచ్చాడు. అంతే కాదు. 'అలా అనవద్దు. ఆఫీసుకు వెళ్లక తప్పదు కదా!' అన్నాడు తల్లికి ధైర్యం చెబుతూ. వైరల్ అవుతున్న ఈ వీడియో ఇప్పటికే డెబ్బైలక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'రివర్స్ గేర్. మామూలుగానైతే పిల్లలు బడికి పోను అని మారాం చేస్తుంటే తల్లులు బుజ్జగిస్తారు. ఇక్కడ మాత్రం కొడుకు తల్లిని బుజ్జగిస్తున్నాడు. పిల్లాడిలో ఎంత పెద్దరికం కనిపిస్తుందో. శబ్బాష్' అంటూ నెటిజనులు స్పందించారు.

నవ్వితే పోయేదేమీ లేదు... 100 టన్నుల టెన్షన్ తప్ప!



'మనకు నవ్వు తప్ప అన్ని గుర్తుండి పోతున్నాయి. మనకు నవ్వు తప్ప అన్ని ముఖ్యం అవుతున్నాయి' అంటూ మనం నవ్వుకు దూరం అవుతున్న తీరుపై, నవ్వు ప్రాముఖ్యతపై నయబ్ మిదా అనే యువతి చేసిన కవితాగానం వీడియో సోషల్ మీడియాలో 'వాహ్వా వాహ్వా' అంటూ వైరల్ అయింది. 'మరిచిపోయిన నవ్వును మళ్లీ గుర్తు చేసింది' అని ప్రశంసిస్తూ ఈ వీడియోను రైల్వే ఉన్నతాధికారి అనంత్ రూపన్‌గూడి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.


నవ్వు గురించి నయబ్ తన కవిత్వంలో ఇలా అంటోంది...
'హాయిగా నవ్వండి... మీరు ఏదైనా కోల్పోయినప్పుడు.
ఎందుకంటే... మీరు కోల్పోయింది అవసరంలో ఉన్నవారికి దొరికి ఉండవచ్చు!'
'హాయిగా నవ్వండి... ఓటమి ఎదురైనప్పుడు.
ఎందుకంటే ఆ విజయం నీ కంటే అతడికే ఎక్కువ అవసరం కావచ్చు!'
'మీ గ్లాస్ ఖాళీగా ఉందా? మీ నవ్వులతో దాన్ని నింపండి!'

ధోని కుమారీ... విరాట్ రాణి



ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లి ఉన్నట్టుండి అందమైన అమ్మాయిలుగా మారితే? 'అదెట్లా సాధ్యమండీ' అనే సౌండ్ రాకముందే- 'ఇదిగో ఇట్లా' అని ఆర్టిస్ట్ అబూ షాహిద్ ఏఐ టెక్నాలజీతో వారిని అందమైన అమ్మాయిలుగా మార్చాడు. ఈ ఫొటో ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయింది. ఈ అందమైన పోస్ట్‌ను లైక్ చేస్తూ యూజర్‌లు 'కలయా నిజమా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

మై డియర్ పప్పీ... నా మాట వింటావా!



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎంత బిజీగా ఉన్నాసరే వ్యాయామానికి మాత్రం విరామం ఇవ్వరు. తన ముద్దుల పప్పీని చేతుల్లోకి తీసుకొని, దాని కళ్లల్లోకి కళ్లు పెట్టి మాట్లాడుతూ ట్రెడ్‌మిల్‌పై వాకింగ్ చేస్తున్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పోస్ట్ చేసింది. ఇరవైనాలుగు గంటల లోపే ఈ వీడియో వేలాది లైకులు, వందలాది షేర్‌లను సొంతం చేసుకుంది. 'కొన్ని సమయాల్లో మనకు అదనపు ప్రేరణ అవసరం' అంటూ ఈ వీడియోకు కాప్షన్ ఇచ్చింది దీదీ. 'మాకు తెలుసు. ఆ ప్రేరణ, శక్తి మీకు రోజువారి వ్యాయామం నుంచే వస్తుందని'

'మమతాజీ, పప్పీతో ఏదో మాట్లాడుతుంది. ఎప్పుడూ మడమ తిప్పవద్దు అని పప్పీకి చెబుతుందేమో!'

'ఎంత ఫైర్‌బ్రాండ్ అయినా సరే, చేతిలో ముద్దుల పప్పీ ఉంటే కూల్ కావల్సిందే'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో యూజర్స్ నుంచి వచ్చాయి.

రాణివాసం కన్నా... సమాజమే మిన్న...

భంజ్ యువరాణులు మృణాళిక, అక్షితలు రాజవంశంలో పుట్టినా సాధారణ యువతుల్లాగే భిన్న రంగాల్లో తమను తాము నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. వీరిద్దరూ ఫిక్కీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు పంచుకున్న విశేషాలు వారి మాటల్లోనే...



మా ప్యాలెస్...టూరిస్ట్ ప్లేస్‌గా...

మా జిల్లా గురించి గొప్పగా చెప్పుకోలేని పరిస్థితే మా ప్రాంతాన్ని తీర్చిదిద్దే వైపు మమ్మల్ని పురికొల్పింది. అందులో భాగంగా స్థానికుల్ని స్వయం ఉపాధి దిశగా నడిపించడం, స్థానిక హస్తకళలకు చేయూత అందించడం.. వంటివి చేశాం. మా హస్తకళల బ్రాండ్ హసా అటెలియర్ సబాయి గడ్డితో చేసిన సంచుల విక్రయాలకు పేరు. వీటిని తరచు దోక్రాతో (ఒడిశాలోని గిరిజనులు చేసే ఓ రకమైన మెటల్‌వర్క్) జత చేసి విక్రయిస్తాం. ఇలా స్థానికులకు ఉపాధితో పాటు స్థానిక కళలకు కూడా ఖ్యాతి దక్కుతోంది. అదే క్రమంలో 20 ఎకరాల్లో ఉన్న మా ప్యాలెస్‌ను 11 గదుల బోటిక్ హోటల్‌గా మార్చాలని నిర్ణయించుకున్నాం. మా ఇంటిని టూరిస్ట్ ప్లేస్‌గా తీర్చిదిద్దే క్రమంలో మా తండ్రిగారిని ఒప్పించి ఆయన సూచనలు, సహకారంతో ఒక్క ఇటుక కూడా కొత్తగా జోడించకుండా, చారిత్రక ఆనవాళ్లేమీ చెరిగిపోకుండానే ప్యాలెస్‌ను ఆధునికంగా తీర్చిదిద్దాం. మేం దీనిని ప్రారంభించిన కొద్ది కాలానికే కోవిడ్ వచ్చింది. అయితే కోవిడ్ అనంతరం ప్రారంభమైన రివెంజ్ ట్రావెల్... మాకు అనూహ్యమైన ప్రోత్సాహాన్నిచ్చింది. మా జిల్లాకు ఒక మారుమూల అటవీ ప్రాంతంగా కాకుండా ఓ మంచి పర్యాటక కేంద్రంగా గుర్తింపు వచ్చింది. అయితే ఈ పయనం మాకెన్నో మెలకువలు, పాఠాలూ నేర్పింది.

హైదరాబాద్‌లో ఫలక్‌నుమా ప్యాలెస్ ఉంది, రాజస్థాన్‌లో ఉదయ్‌పూర్ ప్యాలెస్ ఉంది... మరి మయూర్‌భంజ్‌లోని మా ప్యాలెస్‌కే ఎందుకు రావాలి.. అనే ప్రశ్నకు సమాధానంగా మేం మా చరిత్రను కథగా మలచి అతిథులకు పంచుతున్నాం. ప్రత్యేకంగా వికలాంగులకు అనుకూలమైన మరో రెండు గదులను ఇటీవలే జోడించాం. ప్రతి అడుగూ చరిత్రకు అద్దం పట్టేలా తీర్చిదిద్దాం'' అంటూ తమ విజయగాథను పంచుకున్నారు..

ఇదేకాదు.. ఒకరు యోగా టీచర్‌గా రాణిస్తుంటే మరొకరు రచయిత్రిగా... ఇలా భిన్న రంగాల్లో తమను తాము నిరూపించుకుంటున్నారు ఈ యువరాణులు.

– సాక్షి హైదరాబాద్ సిటీ బ్యూరో
ఫొటో: మోహనాచారి

మా ప్రాంతానికి 'కళ'తేవాలని...

మా కుటుంబానికి దాదాపు 1000 సంవత్సరాలు పైబడిన చరిత్ర ఉంది. అయితే ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో ఉన్న 200 ఏళ్ల నాటి పూర్వీకుల ఇల్లు బెల్గాడియా ప్యాలెస్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం దగ్గర నుంచి చేసిన ప్రతి పనీ మేం రాజకుటుంబ వారసత్వం అనే పరదాల నుంచి బయటకు వచ్చి చేసినవే. అంతర్జాతీయ కళాకారులను ఆహ్వానిస్తూ మయూర్ భంజ్ ఆర్ట్స్ - కల్చర్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తున్నాం. మా ప్యాలెస్‌ని ఆర్టిస్ట్ రెసిడెన్సీగా మార్చాం.

-మృణాళిక, అక్షిత

హెల్త్

పెదవులు పదిలం?



ఎన్నో రకాల వ్యాధుల గురించి తెలుసుకుంటాం కానీ... రోజూ కనిపించే పెదవుల గురించి అంతగా పట్టించుకోం. ఏ చలికాలంలోనో పెదవులు పగిలితే కాస్త వాజిలెన్ రాసుకుంటాం తప్ప... వాటి ఆరోగ్యంపై పెద్దగా అవగాహన పెంచుకోం. కానీ పెదవులకూ చాలా సమస్యలొస్తుంటాయి. ఆరోగ్యపరంగానే కాదు... కొన్ని లుక్స్‌నూ తగ్గించేస్తాయి. పెదవులకు సంబంధించిన వైద్యసమస్యల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఉపయోగపడేదే ఈ కథనం.

కొన్ని ఆరోగ్య సమస్యల తాలూకు లక్షణాలు పెదవుల ద్వారా వ్యక్తమైతే మరికొన్ని నేరుగా పెదవులకే వస్తాయి. ఆ సమస్యల్లో కీలకమైన కొన్ని ఇవి...

నేరుగా పెదవులకే వచ్చేవి...

▸ **కాంటాక్ట్ కీలైటిస్ :** కొందరు మహిళలు లిప్‌స్టిక్, లిప్‌గ్లాస్ వాడుతుంటారు. కొందరికి అవి సరిపడవు. అప్పుడు పెదవులు పొడిబారిపోయి చీలిపోతూ ఉంటాయి. ఈ సమస్యను అధిగమించడానికి తమకు సరిపడే లిప్‌స్టిక్‌నే కొనుక్కోవాలి.

▸ **యాక్టినిక్ కీలైటిస్ :** కొందరి పెదవులు నేరుగా సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ అయినప్పుడు అలర్జీ వస్తుంది. పెదవులు పొడిబారతాయి, పెదవులపై పొట్టులా రాలడం, పొక్కులూ రావచ్చు. వీళ్లు నేరుగా సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ కాకూడదు.

▸ **యాంగ్యులార్ కీలైటిస్ :** కొందరిలో పెదవుల చివరల్లో ఎర్రబారి, పెదవుల మూలల్లో చీలినట్లుగా అవుతుంది. ఈ సమస్య చాలావరకు పోషకాహార లోపంతోనే అందునా విటమిన్లు లోపించడం వల్ల వస్తుంది. కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు అంటే... క్యాండిలా, స్టెఫలోకాకస్, స్ట్రెప్టోకాక్సి వంటి వాటి వల్ల కూడా రావచ్చు. ఈ సమస్య ఏ కారణంగా వచ్చిందో తెలుసుకుని దానికి తగిన చికిత్స చేయాలి.

▸ **లిప్ లికింగ్ డర్మటైటిస్ :** ఈ సమస్య చిన్న పిల్లల్లో ఎక్కువ. ప్రధానంగా చలికాలంలో! పిల్లలు తమ పెదవుల్ని నాలుక సాయంతో పదేపదే లాలాజలంతో తడుపుకోవడం వల్ల పెదవుల చుట్టూ ఎర్రగా, అంచుల చుట్టూ పొడిగా, తర్వాత నల్లగా మారుతుంది. నివారణ కోసం పెదవులు పొడిబారనివ్వకూడదు.

▸ **ఎక్స్‌ఫోలియేటెడ్ కీలైటిస్ :** ఇది కూడా చలికాలంలో వచ్చే సమస్యే గానీ అందర్లోనూ కనిపిస్తుంది. పెదవులు పొడిబారి, ఎర్రగా మారి, చర్మం పొట్టులా పొరలు పొరలుగా రాలిపోతుంటుంది. కొందరు లాలాజలంతో తడిచేస్తూ ఉంటారు. దాంతో మరింత పొడిబారతాయి. ఈ సమస్య నివారణకు కొందరు పెదవులకు కొబ్బరినూనె కూడా రాస్తుండే విషయం తెలిసిందే. అలాగే వెన్న, పెట్రోలియం జెల్లీ, లిప్ బామ్ రాయడం కూడా దీన్ని నివారిస్తుంది.

ఇతర కారణాలతో సమస్య వచ్చి పెదవులపై వ్యక్తమయ్యేవి...

▸ **హెర్పిస్ సింప్లెక్స్ :** ఈ సమస్య హెర్పిస్ అనే వైరస్ వల్ల వస్తుంది. ఇదో అంటువ్యాధి కూడా. ఈ సమస్య ఉన్నవారిలో పెదవుల మీద చిన్న చిన్న నీటి చుక్కల్లా, ఎర్రగా, నొప్పిగా ఉండే పొక్కులు వస్తాయి. మొదటిసారి జ్వరంతో వస్తుంది. మళ్లీ మళ్లీ తిరగబెడుతూ ఉంటుంది. కానీ జ్వరం ఉండదు. ఒకే టవల్ వాడుతుండటం, కప్పులు, ప్లేట్లతోనూ వ్యాపిస్తుంది. యాంటీవైరల్ చికిత్సతో ఇది తగ్గుతుంది.

▸ **హెర్పిస్ జోస్టర్ :** చికెన్‌పాక్స్ వైరస్ వల్ల ఇది వస్తుంది. ఇందులో పెదవుల మీద నీటిగడ్డల్లా కనిపిస్తుంటాయి. నొప్పి ఉంటుంది. చికెన్‌పాక్స్ లాగే ఇదీ జీవితంలో ఒక్కసారే వస్తుంది. కానీ... వ్యాధినిరోధక శక్తి తగ్గినవారిలో రెండోసారీ రావచ్చు. దీనికి యాంటీవైరల్ చికిత్స అవసరం.

▸ **యాంజియోన్యూరోటిక్ ఎడిమా :** ఒక్కోసారిగా పెదవుల్లో వాపు రావడంతో పాటు చర్మం మీద కూడా దద్దుర్లు వస్తాయి. ఆహారంతో అలర్జీలు, ఇన్ఫెక్షన్లు, ఒత్తిడి వల్ల ఈ సమస్య వస్తుంది. చాలా అరుదుగా ఇది ప్రమాదకారిగా మారి హాస్పిటల్‌లో చేరాల్సి రావచ్చు.

▸ **స్టీవెన్ జాన్సన్ సిండ్రోమ్ :** కొన్ని మందులు సరిపడకపోవడం వల్ల వచ్చే సమస్య ఇది. వీళ్లలో చర్మం మీద, అరచేతులు, పాదాలు, పెదవుల మీద పెద్ద నీటి బుగ్గలు వస్తాయి. ఒక్కోసారి ప్రమాదకరం కూడా. అందుకే మందులు వాడే ముందు అవి సరిపడతాయా లేదా అని కూడా తెలుసుకోవాలి.

▸ **ఫిక్స్‌డ్ డ్రగ్ ఎరప్షన్స్ :** ఇది కూడా మందులు సరిపడకపోవడం వల్ల వచ్చే సమస్యే. నిర్దిష్టమైన మందులతోనే ఇలా జరుగుతుంటుంది. కాబట్టి విషయం తెలిసిన డాక్టర్లు మళ్లీ అదే తరహా మందుల్ని సూచించరు.

▸ **లిప్ విటిలిగో :** బొల్లి మచ్చలు చర్మం మీదనే కాకుండా పెదవులపైనా వస్తాయి. చికిత్స తర్వాత మిగతా మచ్చలు తగ్గినప్పటికీ, పెదవులపై మాత్రం ఒక పట్టాన తగ్గవు.

▸ **కీలైటిస్ గ్రాండ్యులారిస్ :** పెదవుల్లో వాపు వస్తూ పోతూ ఉంటుంది. కొన్నాళ్ల తర్వాత ఆ వాపు ఎప్పటికీ ఉండిపోతుంది. లాలాజల గ్రంథులతో పాటు కనిపించే సమస్య ఇది.

▸ **లైకెన్ ప్లానస్ :** ఈ సమస్య ఉన్న కొందరిలో నోట్లో, పెదవులపై పర్పుల్ రంగు మచ్చలు వస్తాయి.

▸ **పెదవులపై కణుతులు:** మిగతా శరీర భాగాల్లోలాగే కొందరిలో పెదవులపైనా కణుతులు పెరగవచ్చు. అవి ఫైబ్రోమావంటి క్యాన్సర్ కణుతులయ్యే అవకాశాలూ ఎక్కువే.

▸ **పెదవుల క్యాన్సర్ :** పెదవుల విషయంలో స్క్వామోజా సెల్ కార్సినోమా, బేసల్ సెల్ కార్సినోమా వంటి క్యాన్సర్లు కనిపిస్తుంటాయి.

పైన పేర్కొన్న సమస్యల్లో కొన్నింటికి కారణాన్ని బట్టి చికిత్స అందించాల్సి ఉంటుంది.


డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెదవుల విషయంలో సాధారణ జాగ్రత్తలివి...

● ఆరెంజ్ జ్యూస్, ఫైనాపిల్ జ్యూస్ తాగిన తర్వాత పెదవులపై కాస్త దురదగా అనిపించడం చాలామందికి అనుభవంలోకి వచ్చే విషయమే. ఇలాంటి జ్యూస్‌లు తాగాల్సివచ్చినప్పుడు సాధ్యమైనంతగా పెదవులకు అంటకుండా జాగ్రత్త వహించాలి. అంటే స్ట్రా వాడటం మంచిది. ● లిప్‌స్టిక్‌లోని బ్రొపైల్ గ్యాలేట్ అనే పదార్థం వల్ల అలర్జీలు వచ్చే అవకాశం ఎక్కువ. అందుకే లిప్‌స్టిక్ కొనుగోలు సమయంలోనే అందులో ఈ ఇన్‌గ్రేడియెంట్ లేదని నిర్ధారణ చేసుకోవడం మంచిది. ● కొన్ని రకాల టూత్‌పేస్ట్‌లు సరిపడక కూడా కొందరిలో పెదవులపై దురద రావచ్చు. అప్పుడు అవి కాకుండా వేరే బ్రాండ్స్ వాడాలి. ● సిగరెట్లు తాగేవారిలో పెదవులు నల్లగా మారడం తెలిసిందే. పొగతాగడం అన్నది పెదవులకే కాకుండా ఆరోగ్యానికీ హానికరం. ఆ అలవాటు పూర్తిగా మానేయాలి.

పెదవుల ఆరోగ్యం కోసం...

● అన్ని పోషకాలు ఉండే సమతులాహారం తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగుతూ, హైడ్రేటెడ్‌గా ఉండాలి. ● పెదవులు తడి ఆరిపోకుండా చూసుకోవాలి. అయితే నాలుకతో తడి చేయకూడదు. ● బాగా చలి వాతావరణానికి, బాగా వేడిగా ఉన్న వాతారణానికి నేరుగానూ, తక్షణం ఎక్స్‌పోజ్ కాకూడదు. ● లిప్‌స్టిక్ రాసుకునేవారు నిద్రకు ఉపక్రమించే ముందు శుభ్రంగా కడుక్కోవాలి.

అవాంఛిత రోమాలు కనిపిస్తుంటే..?



వెంట్రుకలు మామూలుగా కాకుండా అబ్‌నార్మల్‌గా పెరగడాన్ని హైపర్ ట్రైకోసిస్‌గా పేర్కొంటారు. ఇక ఆడవాళ్లలో, అందునా యువతుల్లో పురుషుల మాదిరిగా వెంట్రుకలు పెరగడాన్ని 'హిర్సుటిజమ్' అంటారు.

టీనేజీ యువతుల్లో వెంట్రుకలకు సంబంధించిన రుగ్మతలు ప్రధానంగా హార్మోన్లు, దేహంలో విడుదలయ్యే జీవరసాయనాల్లో హెచ్చుతగ్గుల వల్ల, జీవక్రియల్లో (మెటబాలిక్) మార్పుల కారణంగా ఎక్కువగా కనిపిస్తుంటాయి.

'హిర్సుటిజమ్' కండిషన్ ఉన్నవారిలో ప్రధానంగా ముఖం మీద... అలాగే గడ్డం, రొమ్ము, కడుపు మీద కూడా వెంట్రుకలు పెరుగుతుంటాయి. దాదాపు 10 శాతం మంది మహిళల్లో ఈ కండిషన్ కనిపిస్తుంటుంది. ఇది తీవ్రమైన జబ్బుకు సూచన కానప్పటికీ, యుక్తవయసు(ప్యూబర్టీ)కు ముందుగా ఇలా అవాంఛిత రోమాలు కనిపిస్తుంటే దీనికి కారణాన్ని తెలుసుకోవాలి. హిర్సుటిజమ్ లక్షణాలు కనిపించడాన్ని సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం లేదుగానీ... ఈ లక్షణాలతో పాటు రుతు సంబంధమైన సమస్యలుగాని, స్థూలకాయం పెరుగుతున్నా, పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ (పీసీఓఎస్), హైపోథైరాయిడిజమ్ ఉన్నా, కొద్ది వ్యవధిలోనే రోమాల పెరుగుదల ఎక్కువగా ఉన్నా ఆ పరిస్థితిని కాస్త సీరియస్‌గానే తీసుకోవాలి. అలాగే ఇలాంటివాళ్లలో ముఖం మీద మొటిమలు ఎక్కువగా వస్తుండటం, గొంతు చుట్టూ నలుపుగా మారడం, బరువు పెరగడం, తల మీద వెంట్రుకలు పలచబడటం వంటి లక్షణాలూ ఉండవచ్చు. ఈ లక్షణాలు హార్మోన్ల అసమతౌల్యతకు సూచనగా భావించి, చికిత్స చేయాల్సి ఉంటుంది.

ఇతర సమస్యలూ ఉండవచ్చు: ఇలాంటి యువతుల్లోనే ఎండోక్రైన్ సమస్యలు అంటే థైరాయిడ్, ఓవేరియన్ గ్రంథుల సమస్య, ఎడ్రినల్ ట్యూమర్స్, పీసీఓడీ సమస్యలతో పాటు కొన్ని జన్యుపరమైన సమస్యలూ ఉన్నాయేమో కూడా చూడాలి. కొన్ని మందులు ముఖ్యంగా స్టెరాయిడ్స్ వాడటం వల్ల కూడా శరీరంలో కొన్ని భాగాల్లో రోమాల పెరుగుదల ఎక్కువగా ఉండవచ్చు.

చికిత్స: షేవింగ్, వ్యాక్సింగ్ వంటి సాధారణ ప్రక్రియలతో కేవలం వెంట్రుకలను తొలగించవచ్చు గానీ... వాటిని తగ్గించడం జరగదు. కాస్త అడ్వాన్స్‌డ్ డర్మటాలజీ ప్రక్రియలైన ఎలక్ట్రాలిసిస్, లేజర్ ప్రక్రియల ద్వారా ఆ అవాంఛిత రోమాలను చాలావరకు తగ్గించవచ్చు. కాస్త అడ్వాన్స్‌డ్ చికిత్సలు ఏవైనా అవి డర్మటాలజిస్ట్ లేదా ఎండోక్రైనాలజిస్ట్‌ల ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుంది.

మెడి టిప్

రక్తపోటు తరుగు... ఆరోగ్యం పెరుగు!



మన జీర్ణవ్యవస్థ పొడవునా మన ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియా కోటానుకోట్ల సంఖ్యలో ఉంటాయి. వీటినే ప్రోబయోటిక్స్ అంటారు. ఇటీవల కడుపు ఆరోగ్యం బాగుపడటానికి డాక్టర్లు కూడా వీటినే మందుగా సూచిస్తుంటారు. అయితే 'పెరుగు' నిండా మనకు మేలు చేసే బ్యాక్టీరియా చాలా పెద్ద మొత్తంలోనే ఉంటుంది. అందుకే ఇది స్వాభావికమైన సహజ 'ప్రోబయాటిక్'.

పెరుగులో ఉండే పొటాషియమ్, మెగ్నీషియమ్‌లకు రక్తపోటు (హైబీపీ)ని నియంత్రించే గుణం ఉంది. అందుకే మిగతావారితో పోలిస్తే... ఆహారంలో భాగంగా క్రమం తప్పకుండా పెరుగు తినేవారిలో హైబీపీ కాస్త తక్కువ. పరిశోధనల్లో సైతం ఇది నిరూపితమైంది. మిగతావారితో పోలిస్తే పెరుగు తినేవారిలో హైబీపీ వచ్చే అవకాశాలు ముప్పై శాతం తక్కువగా ఉంటాయని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనల్లో వెల్లడైంది. అంతేకాదు... పెరుగులో ఉండే పోషకాలు మన వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఫలితంగా ఎన్నో వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ప్రతి రోజూ కనీసం రెండువందల గ్రాముల పెరుగు తినేవారిలో రోజూ యాంటీబయాటిక్స్ మాత్ర వేసుకున్నంత ప్రభావం ఉంటుందనీ, పైగా ఇది స్వాభావికమైన రోగనిరోధక శక్తి కావడంతో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఉండవంటూ యూనివర్సిటీ ఆఫ్ వియన్నా (ఆస్ట్రియా) శాస్త్రవేత్తలు నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది.



రిథమ్ ప్రపంచ రికార్డు... అయినా పతకానికి దూరం

ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ రిథమ్ సాంగ్వాన్ కొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది. అజర్‌బైజాన్‌లోని బాకులో జరుగుతున్న ఈ పోటీల్లో మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో రిథమ్ 595 పాయింట్లు స్కోరు సాధించి రికార్డును నమోదు చేసింది. అయితే ఈ పోటీల క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఆమె ఈ కొత్త ఘనతను ప్రదర్శించింది. రికార్డు స్కోరుతో ఫైనల్ చేరిన రిథమ్ అసలు సమరంలో మాత్రం విఫలమైంది. సత్తా చాటలేకపోయిన ఆమె చివరగా ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే ఈవెంట్ క్వాలిఫయింగ్ ఇతర భారత షూటర్లు ఇషాసింగ్, మను భాకర్ వరుసగా 13వ, 27వ స్థానాల్లో నిలిచి ఆరంభంలోనే నిష్క్రమించారు. పురుషుల 50 మీటర్ల 3 పొజిషన్ రైఫిల్ ఈవెంట్‌లో కూడా భారత షూటర్లెవరూ ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.

ప్రభ్‌సిమ్రన్ 'హీరో'చితం

- పంజాబ్‌కు కీలక విజయం
- 31 పరుగులతో ఢిల్లీ ఓటమి
- 'ప్లే ఆఫ్స్' రేసునుంచి క్యాపిటల్స్ అవుట్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రభ్‌సిమ్రన్

న్యూఢిల్లీ: ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ సత్తా చాటింది. శనివారం జరిగిన కీలక పోరులో పంజాబ్ 31 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రభ్‌సిమ్రన్ సింగ్ (65 బంతుల్లో 103; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఒంటిచేత్తో జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. ఐపీఎల్‌లో అతనికి ఇది తొలి సెంచరీ సాధించడం విశేషం. శిఖర్ ధావన్ (7), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ శర్మ (5), షారుఖ్ (2) చేతులెత్తేయగా... ప్రభ్‌సిమ్రన్‌కు స్యామ్ కరన్ (20) కాసేపు అండగా నిలిచాడు. అనంతరం హర్‌ప్రీత్ బ్రార్ (4/30) మాయాజాలంతో పంజాబ్ పైచేయి సాధించింది. హర్‌ప్రీత్ స్పిన్ ఉచ్చులో పడిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లన్నీ ఆడి 8 వికెట్ల నష్టానికి 136 పరుగులే చేయగలిగింది. డేవిడ్ వార్నర్ (27 బంతుల్లో 54; 10 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే అర్ధసెంచరీతో జట్టు పరువు నిలిపాడు. ఎలిస్, రాహుల్ చహర్ చెరో 2 వికెట్లు తీశారు. **ఈ ఓటమితో ఢిల్లీ క్యాపిటల్స్ అధికారికంగా 'ప్లే ఆఫ్స్'కు దూరమైన తొలి జట్టుగా నిలిచింది.**

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (బి) ముకేశ్ 103; శిఖర్ ధావన్ (సి) రోసో (బి) ఇషాంత్ 7; లివింగ్‌స్టోన్ (బి) ఇషాంత్ 4; జితేశ్ (బి) అక్షర్ 5; స్యామ్ కరన్ (సి) అమన్ హకీమ్ (బి) ప్రవీణ్ దూబే 20; హర్‌ప్రీత్ (సి) మార్ష్ (బి) కుల్దీప్ 2; షారుఖ్ రనౌట్ 2; సికందర్ రజా నాటౌట్ 11; రిషి ధావన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1–10, 2–32, 3–45, 4–117, 5–129, 6–154, 7–165. **బౌలింగ్:** ఖలీల్ 4–0–36–0, ఇషాంత్ 3–0–27–2, అక్షర్ 4–0–27–1, ప్రవీణ్ దూబే 3–0–19–1, కుల్దీప్ యాదవ్ 4–0–32–1, మార్ష్ 1–0–21–0, ముకేశ్ 1–0–3–1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్‌ప్రీత్ 54; ఫిల్ సాల్ట్ (బి) హర్‌ప్రీత్ 21; మార్ష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహర్ 3; రోసో (సి) సికందర్ రజా (బి) హర్‌ప్రీత్ 5; అక్షర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చహర్ 1; అమన్ హకీమ్ (సి) హర్‌ప్రీత్ (బి) ఎలిస్ 16; మనీశ్ పాండే (బి) హర్‌ప్రీత్ 0; ప్రవీణ్ దూబే (బి) ఎలిస్ 16; కుల్దీప్ యాదవ్ నాటౌట్ 10; ముకేశ్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 136. వికెట్ల పతనం:** 1–69, 2–74, 3–81, 4–86, 5–86, 6–88, 7–118, 8–123. **బౌలింగ్:** రిషీ ధావన్ 1–0–10–0, స్యామ్ కరన్ 2–0–18–0, హర్‌ప్రీత్ 4–0–30–4, ఎలిస్ 4–0–26–2, అర్ష్‌దీప్ 4–0–32–0, రాహుల్ చహర్ 4–0–16–2, సికందర్ రజా 1–0–3–0.

'ధోని ఇలాగే కొనసాగాలి'

(సునీల్ గావస్కర్)

క్రికెట్ అనిశ్చితికి మారుపేరు కాగా, టి20ల్లో ఇది మరీ ఎక్కువ. గత సీజన్‌లో చివరి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ సారి టాప్‌-3లో ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఆరంభంలో సరిగా స్టార్ట్ కాని కారు ఇంజన్ తరహాలో ఉండే ముంబై ఇండియన్స్ ఇప్పుడు అందరికంటే ముందుగా క్వాలిఫై అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెరుగ్గా మొదలు పెట్టినా మధ్యలో స్పీడ్ బ్రేకర్లతో కాస్త ఇబ్బంది పడ్డ చెన్నై కూడా అగ్రస్థానంలో నిలవవచ్చు. గుజరాత్‌పై ముంబై గెలవడం కూడా ఆ జట్టుకు మేలు చేసింది.

కోల్‌కతాపై గెలిచి ఇదే జోరు కొనసాగిస్తే చెన్నై టాప్‌కు చేరవచ్చు. యువ యశస్వి చేతిలో కోల్‌కతా పూర్తిగా చిత్తయింది. ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ మాత్రమే అతను శతకం పూర్తి చేసుకుంటే అదో అద్భుతమయ్యేది. యశస్వి సెంచరీ పూర్తి కాకుండా ఉండేందుకు కోల్‌కతా బౌలర్ ఒకరు ఉద్దేశపూర్వకంగా వైడ్ బాల్ వేసేందుకు ప్రయత్నించడం ఆ జట్టు పరిస్థితిని చూపిస్తోంది. ఆ విషయాన్ని సదరు బౌలర్‌కు ఎవరైనా చెప్పి ఉంటారని ఆశిస్తున్నా. సరైన ఆరంభాలు లభించకపోవడం కోల్‌కతా సమస్య కాగా, వారి వైఫల్యంతో మిడిలార్డర్‌పై తీవ్ర ఒత్తిడి పడుతోంది. మిడిల్‌లో చెన్నై స్పిన్నర్లు వారిని కట్టడి చేయగలరు. చెన్నై వెలుగులోకి తెచ్చిన పతిరణ స్లాగ్ ఓవర్లలో తన విభిన్న శైలి బౌలింగ్‌తో చెలరేగుతున్నాడు. ప్రతీసారి చెన్నైకి రుతురాజ్, కాన్వే శుభారంభాలు అందిస్తున్నారు. శివమ్ దూబేను సీఎస్‌కే సమర్థంగా వాడుకోగలిగింది. సాధారణ ఆటగాళ్లనుంచి కూడా స్థాయికి మించిన ప్రదర్శన రాబట్టడం ధోని కెప్టెన్సీ గొప్పతనం. స్వయంగా తానే ఆకట్టుకునే సిక్సర్లు బాది అందరినీ అలరిస్తున్నాడు. ధోని జోరు ఈ సీజన్‌కే పరిమితం కారాదని ఆశిద్దాం.

సన్‌రైజర్స్ ఆశలు గల్లంతు!



ప్రేరక్, పూరన్ గెలుపు సంబరం



ప్రేరక్

- సొంతగడ్డపై ఐదో ఓటమి
- 'ప్లే ఆఫ్స్' అవకాశాలు దాదాపు దూరం
- 7 వికెట్లతో లక్నో గెలుపు

ఉప్పల్ పిచ్‌పై 182 పరుగుల స్కోరు మెరుగైందే... బౌలర్లు కూడా సత్తా చాటడంతో 15 ఓవర్లదాకా మ్యాచ్ హైదరాబాద్ చేతుల్లోనే ఉంది. అప్పటికి లక్నో స్కోరు 114/2. ఓవర్‌కు దాదాపు 14 పరుగుల చొప్పున 30 బంతుల్లో 69 పరుగులు కావాలి. అయితే తర్వాతి ఓవరే హైదరాబాద్‌ను ముంచింది. మ్యాచ్ ఫలితాన్నే తారుమారయ్యేలా చేసింది. అభిషేక్ శర్మ వేసిన ఈ ఓవర్లో స్టొయినిస్, పూరన్ కలిసి 5 సిక్సర్లతో పండుగ చేసుకున్నారు. వైడ్‌తో కలిపి 31 పరుగులు రాగా సమీకరణం 24 బంతుల్లో 38 పరుగులుగా మారి లక్నో విజయాన్ని సులువుగా మార్చింది. ఈ ఓటమితో హైదరాబాద్ ప్లేఆఫ్స్ అవకాశాలకు దాదాపు తెర పడినట్లే!

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై సన్‌రైజర్స్ అభిమానులకు మళ్లీ నిరాశే ఎదురైంది. సన్‌రైజర్స్‌కు ఇది ఏడో పరాజయం కాగా, ఇందులో ఐదు మ్యాచ్‌ల్ని సొంతగడ్డపైనే ఓడటం గమనార్హం. శనివారం జరిగిన పోరులో హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో పరాజయం చవిచూసింది. ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (29 బంతుల్లో 47; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 37 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన లక్నో 19.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రేరక్ మన్కడ్ (45 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా, నికోలస్ పూరన్ (13 బంతుల్లో 44 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) దంచేశాడు.

ధాటిగా ఆడినా...

పవర్‌ప్లేలోనే సన్‌రైజర్స్ 2 కీలక వికెట్లను కోల్పోయినా పరుగుల ధాటి మాత్రం కొనసాగింది. అన్మోల్‌ప్రీత్ (27 బంతుల్లో 37; 7 ఫోర్లు), మార్క్‌రమ్ (20 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) స్కోరు బోర్డును పరుగెత్తించారు. అయితే కృనాల్ పాండ్యా వరుస బంతుల్లో మార్క్‌రమ్, ఫిలిప్స్ (0)లను అవుట్ చేసి ఇన్నింగ్స్ వేగానికి కళ్లెం వేశాడు. అనంతరం క్లాసెన్, సమద్‌లు సిక్సర్లతో విరుచుకుపడి బలమైన స్కోరుకు బాట వేశారు.

ఆ ఓవర్‌తోనే తారుమారు!

పిచ్ సహకారంతో, సొంతగడ్డ అనుకూలతలతో ఆరంభంలో హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. కైల్ మేయర్స్ (2) విఫలం కాగా, డికాక్ (19 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్), ప్రేరక్ కలిసి జట్టును ఆదుకున్నారు. 15వ ఓవర్ పూర్తయ్యేసరికి లక్నో చేసింది 114/2 స్కోరే. తర్వాతి ఓవర్‌ను అభిషేక్‌కు అప్పగించడంతో మ్యాచ్ సీనే మారిపోయింది. 2 సిక్స్‌లు కొట్టిన స్టొయినిస్ (25 బంతుల్లో 40; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మూడో బంతికి అవుటైతే... పూరన్ వచ్చి 3 బంతుల్నీ సిక్సర్లుగానే మలిచాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్మోల్‌ప్రీత్ (సి అండ్ బి) మిశ్రా 36; అభిషేక్ (సి) డికాక్ (బి) యుద్‌వీర్ 7; త్రిపాఠి (సి) డికాక్ (బి) యశ్ 20; మార్క్‌రమ్ (స్టంప్డ్) డికాక్ (బి) కృనాల్ 28; క్లాసెన్ (సి) మన్కడ్ (బి0 అవేశ్ 47; ఫిలిప్స్ (బి) కృనాల్ 0; సమద్ నాటౌట్ 37; భువనేశ్వర్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1–19, 2–56, 3–82, 4–115, 5–115, 6–173. **బౌలింగ్:** యుద్‌వీర్ 3–0–24–1, మేయర్స్ 1–0–11–0, కృనాల్ పాండ్యా 4–0–24–2, అవేశ్ 2–0–30–1, యశ్ ఠాకూర్ 4–0–28–1, అమిత్ మిశ్రా 4–0–40–1, రవి బిష్ణోయ్ 2–0–23–0.

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) మార్క్‌రమ్ (బి) ఫిలిప్స్ 2; డికాక్ (సి) అభిషేక్ (బి) మార్కండే 29; ప్రేరక్ నాటౌట్ 64; స్టొయినిస్ (సి) సమద్ (బి) అభిషేక్ 40; పూరన్ నాటౌట్ 44; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19.2 ఓవర్లలో 3 వికెట్లకు) 185. వికెట్ల పతనం:** 1–12, 2–54, 3–127. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–30–0, ఫారుఖీ 3.2–0–32–0, ఫిలిప్స్ 2–0–10–1, నటరాజన్ 4–0–31–0, మార్కండే 3–0–39–1, అభిషేక్ 3–0–42–1.

మైదానంలోకి 'బోల్ట్'



ఉప్పల్ మ్యాచ్‌లో ప్రేక్షకుల అనుచిత ప్రవర్తన కారణంగా కొద్ది సేపు ఆటకు అంతరాయం కలిగింది. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో అవేశ్ వేసిన 19వ ఓవర్ మూడో బంతిని ఎత్తు కారణంగా అంపైర్ నోబాల్‌గా ప్రకటించాడు. దీనిపై లక్నో రివ్యూ కోరగా, సుదీర్ఘ సమయం తీసుకున్న థర్డ్ అంపైర్ అది 'సరైన బంతి' అంటూ వారికి అనుకూలంగా తీర్పిచ్చాడు. అదే ఓవర్లో బౌండరీ వద్ద లక్నో ఫీల్డర్లు ప్రేక్షకుల ప్రవర్తనపై ఫిర్యాదు చేయడంతో ఆట ఆగిపోయింది. ఒక ప్రేక్షకుడు కుర్చీకి ఉండే నట్ బోల్ట్‌ను మైదానంలోకి విసిరాడు. ఆ బోల్ట్ ప్రేరక్ తలకు తగిలింది. దాంతో లక్నో సహాయక సిబ్బంది కూడా మైదానంలోకి వెళ్లి తమ అసంతృప్తిని వ్యక్తం చేసింది. అంపైర్లు వెతికి చూడగా గ్రౌండ్‌లో ఆ ఇనుప బోల్ట్ కనిపించింది. పోలీసులు స్టాండ్స్‌లోకి వెళ్లి విచారించినా ఆ వ్యక్తిని గుర్తించలేకపోగా, కొద్ది సేపటికి ఆట మళ్లీ మొదలైంది. **నోబాల్ విషయంలో అంపైర్లపై బహిరంగ నిరసన వ్యక్తం చేసిన క్లాసెన్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా పడింది.**

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	12	8	4	0	16	0.761
చెన్నై	12	7	4	1	15	0.493
ముంబై	12	7	5	0	14	-0.117
లక్నో	12	6	5	1	13	0.309
రాజస్తాన్	12	6	6	0	12	0.633
పంజాబ్	12	6	6	0	12	-0.268
బెంగళూరు	11	5	6	0	10	-0.345
కోల్‌కతా	12	5	7	0	10	-0.357
హైదరాబాద్	11	4	7	0	8	-0.471
ఢిల్లీ	12	4	8	0	8	-0.686

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ x బెంగళూరు (మ. గం. 3:30 నుంచి)
చెన్నై x కోల్‌కతా (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సినిమా



● శ్రీనివాసా చిట్టూరి, వెంకట్ ప్రభు, నాగచైతన్య, కృతీ శెట్టి

ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్ - నాగచైతన్య

''రొటీన్‌గా కాకుండా కొత్తగా చేయాలని 'కస్టడీ' చేశాను'' అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'కస్టడీ'. తెలుగు, తమిళ భాషల్లో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో నాగచైతన్య మాట్లాడుతూ– ''కస్టడీ'కి మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ లభిస్తోంది. మేం నమ్మి చేసిన అండర్‌వాటర్ యాక్షన్ సీన్, పోలీస్ స్టేషన్‌లో సింగిల్ షాట్ ఫైట్, ట్రైన్ ఫైట్, ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే ఓ సీన్‌కి మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు. ''ఈ చిత్రంలో నేను చేసిన రేవతి పాత్రకు మంచి స్పందన వస్తున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు కృతీ శెట్టి. ''వందశాతం మా కష్టం ఫలించిందని అనుకుంటున్నాను'' అన్నారు వెంకట్ ప్రభు. ''కస్టడీ' బ్లాక్‌బస్టర్ అయినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు శ్రీనివాసా చిట్టూరి.

బర్త్‌డేకి థండర్



● రామ్

''ఫస్ట్ థండర్ రానుంది.. రెడీగా ఉండండి' అంటూ రామ్ నటిస్తున్న తాజా చిత్రం గురించి యూనిట్ పేర్కొంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా రామ్ పుట్టినరోజు (మే 15) సందర్భంగా ఈ సినిమా నుంచి 'ఫస్ట్ థండర్' పేరుతో ప్రత్యేకంగా ఓ అప్‌డేట్ ఇవ్వనున్నట్లు ప్రకటించి, శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ''యాక్షన్, మాస్ ఎంటర్‌టైనర్‌గా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. దసరా సందర్భంగా అక్టోబర్ 20న అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రామ్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే, సమర్పణ: జీ స్టూడియోస్, పవన్‌కుమార్.

అది నాకు బోనస్ - సంతోష్ శోభన్



''గోల్కొండ హైస్కూల్' (2011) చిత్రంలో చైల్డ్ ఆర్టిస్టుగా నటించాను. ఈ సినిమాలోని నా పెర్ఫార్మెన్స్ నాకు చాలా అవకాశాలు తెచ్చిపెడుతుందనుకున్నాను. కానీ అలా జరగలేదు. ఆ తర్వాత మరి కొన్ని సినిమాలు చేసినా దాదాపు నాలుగేళ్లు నాకు అవకాశాలు దక్కలేదు. ఆ తర్వాత వచ్చిన అవకాశాలు, కొన్ని కథలు కరెక్ట్ అని భావించి కొన్ని సినిమాలు చేశాను. అవి వర్కౌట్ కాలేదు. ఇక నా కెరీర్ పరంగా 'అన్నీ మంచి శకునములే' చిత్రం మంచి బిగ్‌స్క్రీన్ మూవీగా నిలుస్తుందని భావిస్తున్నాను'' అని అన్నారు సంతోష్ శోభన్. నందినీ రెడ్డి దర్శకత్వంలో సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. స్వప్నామూవీస్, మిత్రవిందా మూవీస్‌తో కలిసి ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో రిషి పాత్రలో కనిపిస్తాను. 'అలా..మొదలైంది' చూసి నందినీరెడ్డిగారితో ఓ సినిమా చేయాలనుకున్నాను. అలాగే ఓ యాక్టర్‌గా నాకు తొలి అడ్వాన్స్ చెక్ ఇచ్చింది ప్రియాంకా దత్‌గారు. ఇలా.. వీరి కాంబినేషన్స్‌తో నా కెరీర్‌కు కావాల్సిన టైమ్‌లో 'అన్నీ మంచి..' లాంటి సినిమా వస్తుండటం లక్‌గా భావిస్తున్నాను. ఇక ఈ సినిమా అవుట్‌పుట్ బాగా రావడం నాకు బోనస్'' అన్నారు.

మా అమ్మగారు సూపర్ ఉమన్ - శ్రీలీల



● తల్లి స్వర్ణలతతో శ్రీలీల

''నేనెక్కడ ఉంటే మా అమ్మకు అదే ఫేవరెట్ ప్లేస్. మా అమ్మకి నేనంటే ఎంత ప్రేమో చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం ఉంటుంది? ఇంటిని బాగా చూసుకోవడంతో పాటు ఇతరులకు సహాయం చేయడం అమ్మకు ఇష్టం. మా అమ్మ బెస్ట్ పర్సన్'' అన్నారు శ్రీలీల. 'పెళ్లి సందడి'తో తెలుగుకి పరిచయం అయిన ఈ కన్నడ బ్యూటీ ప్రస్తుతం చేతిలో అరడజనకు పైగా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. నేడు 'మాతృదినోత్సవం' సందర్భంగా తన తల్లి స్వర్ణలత గురించి 'సాక్షి'తో ప్రత్యేకంగా శ్రీలీల షేర్ చేసుకున్న విషయాలు ఈ విధంగా..

● మా అమ్మగారు చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవారు. అలానే ఆమెకి చాలా ఓర్పు ఎక్కువ. నాకు ఎప్పుడు స్వేచ్ఛ ఇవ్వాలో.. ఇవ్వకూడదో ఆమెకు బాగా తెలుసు. అలాగే ఏ విషయంలో స్ట్రిక్ట్‌గా ఉండాలో.. ఉండకూడదో కూడా బాగా తెలుసు. ● నా స్కూల్ డేస్‌లో చాలా బిజీగా ఉండేదాన్ని. స్కూల్ అవ్వగానే డ్యాన్స్ క్లాస్, స్విమ్మింగ్.. ఇలా గడిచిపోయేది. కానీ నాకేమో అల్లరి చేయాలని ఉండేది. అయితే దానికి చాన్స్ ఉండేది కాదు. ఎందుకంటే మా అమ్మ కళ్లన్నీ నా మీదే ఉండేవి. ● తిండి విషయంలో చిన్నప్పుడు నేను చాలా నిర్లక్ష్యంగా ఉండేదాన్ని. స్కూల్‌కి వెళ్లేటప్పుడు అమ్మ ఇచ్చిన లంచ్ బాక్స్ ఇంట్లో సోఫా వెనకాలో, కారు సీటులోనో దాచేసేదాన్ని. తినడానికి ఇష్టపడక అలా చేసేదాన్ని. ● ఇక నా విషయాలను నేను హ్యాండిల్ చేయగలననే నమ్మకం కుదిరాక మా అమ్మ నాకు స్వేచ్ఛ ఇవ్వడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా అమ్మ నాకు మంచి ఫ్రెండ్‌లా అయిపోయారు. ఎప్పుడైతే మా అమ్మ నాకు ఫ్రెండ్‌లా అయ్యారో అప్పట్నుంచి అన్నీ ఆమెతో షేర్ చేసుకుంటున్నాను. రాత్రిపూట జోక్స్ చెప్పుకోవడం, రిలాక్స్ అవ్వడం.. డ్యాన్స్ చేయడం... వాట్ నాట్.. మేం చాలా బాగా టైమ్ స్పెండ్ చేస్తాం. తన కూతురు కావడం నా లక్. ● మా అమ్మగారు మల్టీ టాస్కర్. అందుకే తనకి రెస్ట్ ఇవ్వాలని అనుకుంటుంటాను. అదే విషయం ఆమెతో చెబితే ఒత్తిడికి గురవుతారు. ఎందుకంటే అమ్మకు ఖాళీగా ఉండటం ఇష్టం ఉండదు. ఏదో పని పెట్టుకుని, ఆ పని పూర్తి చేసేంతవరకూ ప్రశాంతంగా ఉండరు. ● మా అమ్మగారు డాక్టర్. పేషెంట్లతో ఎప్పుడూ ఫుల్ బిజీ. కొన్నేళ్ల పాటు ఆవిడ డాక్టర్‌గా సర్వీస్ చేశారు. పైగా శ్రద్ధగా చేయడంతో ఎందరో పేషెంట్స్ ఆమెతో చాలా సన్నిహితంగా ఉండేవారు. చాలా గౌరవించేవారు. ఇవన్నీ స్వయంగా చూసిన నాకు మా అమ్మంటే చాలా గౌరవం.. గర్వం.. స్ఫూర్తి కూడా. నేను ఆవిడ్ని 'సూపర్ ఉమన్' అంటాను. ఆవిడ సెమినార్స్‌లో పాల్గొన్నప్పుడు నేను చాలా ఆరాధనగా చూసేదాన్ని. ఆవిడకున్న నాలెడ్జ్ సూపర్. ● మా అమ్మ నాలో భాగం. నా కెరీర్‌లోనూ ఆమె సగ భాగం. చాలా అర్థం చేసుకుంటారు. నా కెరీర్‌కి ఎంత హెల్ప్ చేయాలో అంతా చేస్తారు. నేనివాళ ఇంత బిజీగా సినిమాలు చేయగలుగుతున్నానంటే ఆమె సపోర్ట్ కారణం. ● ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు 'వాట్ నెక్స్ట్' అంటారామె. కొంచెం కూడా బాధపడరు. నేనేమో 'సెన్సిటివ్'. చిన్న విషయాలకు కూడా బాధపడిపోతుంటాను. నేను ఆ బాధ మరచిపోయేలా ఆమె కౌన్సిలింగ్ ఇస్తారు. అమ్మ స్పిరిచ్యువాలిటీ పర్సన్. ప్రతిరోజూ దేవుడిని పూజిస్తుంటారు. ఆ పూజలు నాకు ధైర్యాన్నిస్తాయి. ఆవిడ ఆశీర్వాదం తీసుకున్నప్పుడు నా ధైర్యం రెట్టింపు అవుతుంది. ● 'మదర్స్ డే'కి మా అమ్మ కోసం స్పెషల్‌గా ఒకటి ప్లాన్ చేశాను. అది సీక్రెట్.

నేడు మదర్స్ డేని పురస్కరించుకుని శోభన్ మాట్లాడుతూ – ''నేను ఇండస్ట్రీకి వచ్చి 13 ఏళ్లవుతోంది. నటుడిగా నాకు అవకాశాలు తగ్గినప్పుడు అమ్మ నమ్మకమే నాకు ధైర్యాన్ని ఇచ్చింది. ఆ ధైర్యంతోనే నేను సినిమాలు చేస్తున్నాను. మాకు సొంత ఇల్లు లేదు. త్వరలోనే మా అమ్మకు సొంత ఇంటిని గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్నాను'' అన్నారు.



ఇక సినిమాలకు అంకితం - మురళీమోహన్

'నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయ్యాయి. 1973 మార్చిలో నా సినిమా ('జగమే మాయ') షూటింగ్ మొదలైంది. నన్ను హీరోగా పరిచయం చేసిన అట్లూరి పూర్ణచంద్రరావు, పీపీ సుబ్బారావుగార్లకు నా కృతజ్ఞతలు'' అన్నారు నటుడు మురళీమోహన్. చిత్రపరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మురళీమోహన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ– ''ఓ 15 ఏళ్లు ఇండస్ట్రీలో ఉంటాననుకున్నాను. అందరి సహకారానికి అదృష్టం తోడవ్వడంతో 50 ఏళ్లు ఉండగలిగాను. తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వెళ్లినందువల్ల పదేళ్లు సినిమాలకు బ్రేక్ వచ్చింది. ఇక పూర్తిగా సినిమాలకు అంకితమవ్వాలనుకుంటున్నాను. నేను అక్కినేని నాగేశ్వరరావుగారి ఫ్యాన్‌ని. చనిపోయేంతవరకు సినిమాల్లో నటిస్తుంటానని, ఆ మాటను నిజం చేశారాయన. ఏయన్నార్‌గారి స్ఫూర్తితో ఇక నటనకే అంకితం అవుతాను'' అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా 'మిథునం' చిత్ర సంగీత దర్శకుడు వీణాపాణి రాసిన 'అమ్మే దైవం' పాట వీడియోను రిలీజ్ చేశారు మురళీమోహన్.

కొత్త వారితో మేమ్ ఫేమస్



● సార్య, సుమంత్ ప్రభాస్, శరత్ చంద్ర, చంద్రు మనోహర్, అనురాగ్

సుమంత్ ప్రభాస్, మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య, సిరి రాసి, నరేంద్ర రవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. సుమంత్ ప్రభాస్ దర్శకత్వంలో ఛాయ్ బిస్కెట్, లహరి ఫిలింస్ పతాకాలపై శరత్ చంద్ర, అనురాగ్ రెడ్డి, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ సినిమా టీజర్, 'అయ్యయయ్యో..' పాటను ప్రదర్శించారు. అనంతరం ఈ చిత్ర హీరో, దర్శకుడు సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ– ''మా సినిమా ప్రమోషన్స్‌కు ప్రముఖ హీరోలంతా హెల్ప్ చేస్తుండటంతో నాకు మంచి పేరు వచ్చింది. అందరికీ కనెక్ట్ అయ్యేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''18 ఏళ్ళకే టిక్ టాక్‌లు చేసిన సుమంత్ 23 ఏళ్ళకే డైరెక్టర్ అయ్యాడు. అంతా యూత్ చేసిన సినిమా ఇది. ఆడియన్స్‌కు నచ్చుతుంది'' అన్నారు అనురాగ్ రెడ్డి. ''ఈ సినిమాతో 30 మందికిపైగా నటీనటులను పరిచయం చేయడం గర్వంగా వుంది'' అన్నారు 'లహరి ఫిలింస్' చంద్రు మనోహర్. ''వైజాగ్‌లో అన్నపూర్ణ స్టూడియోస్, రెండు రాష్ట్రాల్లో మిగిలిన ప్రాంతాల్లో గీతా ఆర్ట్స్, ఓవర్‌సీస్‌లో సరిగమల ద్వారా మా సినిమా విడుదలవుతుంది'' అన్నారు శరత్ చంద్ర.

ఏడు భాషల్లో...



● శశిధర్, శ్రేయాస్, రాధికా, రవి రాజ్

బాలీవుడ్ యాక్టర్ శ్రేయాస్ తల్పడే హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్న సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'అజాగ్రత్త'. రాధికా కుమారస్వామి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎం. శశిధర్ దర్శకత్వంలో రవి రాజ్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం శనివారం జరిగింది. తొలి సీన్‌కి నిర్మాత ఠాగూర్ మధు కెమెరా స్విచ్చాన్ చేయగా, ఏఎం రత్నం క్లాప్ ఇచ్చారు. శ్రేయాస్ తల్పడే మాట్లాడుతూ– ''ప్రేక్షకులకు నచ్చేలా 'అజాగ్రత్త' సినిమాను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు. ''ఈ సినిమాను ఏడు భాషల్లో తెరకెక్కిస్తున్నాం'' అన్నారు ఎం. శశిధర్. ''నేను నిర్మాతగా ఉండాల్సిన ఈ సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్నాను. స్క్రిప్ట్ విని షాక్ అయ్యాను. అంత నచ్చింది'' అన్నారు రాధికా కుమారస్వామి. రావు రమేష్, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: శ్రీహరి, సహనిర్మాత: యాదవ్.

శాపానికి గురైతే...



● కౌశిక్, యశ్, అపూర్వ రావు, అనిల్ పల్లాల

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో సిల్లీ మాంక్స్, హామ్స్ టెక్ ఫిల్మ్స్ పతాకాలపై అనిల్ పల్లాల నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ''నా నిగ్రహాన్ని పరీక్షించుకోవడానికి వస్తే నా పరువు తీస్తావా. ఇక నీకు మిగిలింది నిగ్రహమే', 'బాబా శాపం ఇచ్చాడా?' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. టీజర్ రిలీజ్ సందర్భంగా హీరో యశ్ మాట్లాడుతూ– ''ఇది నాకు మూడో సినిమా. పిల్లాడి నుంచి వ్యక్తిగా మారే కథే ఈ చిత్రం'' అన్నారు. ''మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ ఇది'' అన్నారు కౌశిక్. ''సినిమా బాగా వచ్చింది. ఆడియన్స్‌కు నచ్చుతుంది'' అన్నారు అనిల్. ''ఒంగోలులో పుట్టి గుజరాత్, గల్ఫ్‌లో పెరిగాను. స్టడీస్ తర్వాత హైదరాబాద్ వచ్చాను. ఇది నా తొలి చిత్రం'' అన్నారు అపూర్వ. ''ఈ జనరేషన్‌లోని అబ్బాయి ఓ బాబా శాపానికి గురైతే అతని పరిస్థితి ఏంటి? అన్నదే ఈ సినిమా కథ'' అన్నారు కెమెరామేన్ అశోక్.

గర్భిణులకు అత్యాధునిక 'టిఫా' స్కానింగ్

- 18 నుంచి 22 వారాల గర్భస్థ దశలో టిఫా స్కానింగ్
- దీని ద్వారా గర్భస్థ దశలో బిడ్డలో లోపాలు గుర్తింపు
- వెంటనే సరిదిద్దేందుకు అవకాశం
- దీంతోపాటు మరో రెండు సాధారణ స్కానింగ్‌లు ఉచితం
- అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో టిఫా, సాధారణ స్కాన్‌లు
- టిఫా స్కానింగ్‌కు రూ.1100, సాధారణ స్కానింగ్‌కు రూ. 250 వ్యయం

ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు అయిన గర్భిణులకు ఉచితం



సాక్షి, అమరావతి: గర్భిణులు, తల్లీ బిడ్డల సంరక్షణకు ఇప్పటికే పలు రకాల కార్యక్రమాలను చేపడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఇప్పుడు గర్భిణులకు అత్యాధునిక టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ అనామలీస్ (టిఫా) స్కానింగ్ సేవలను ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. తల్లి గర్భంలో ఉండగానే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని, పిండం ఎదుగుదలలో లోపాలను గుర్తించడానికి ఈ పరీక్ష దోహద పడుతుంది. ఖరీదైన ఈ స్కాన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కార్డుదారులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన గర్భిణులకు ప్రభుత్వం ఉచితంగా నిర్వహించనుంది. ఒక్కో టిఫా స్కాన్‌కు రూ.1,100, అల్ట్రాసోనోగ్రామ్ స్కాన్‌కు రూ.250 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.

ఈ లోపాలున్న వారికి టిఫా స్కాన్

మేనరికం వివాహాలు చేసుకున్న వారికి, బ్యాడ్ అబ్‌స్టెట్రిక్ హిస్టరీ (గర్భం దాల్చిన రోజు నుంచే వివిధ సమస్యలుండటం), క్రోమోజోమ్స్, మానసిక లోపాలు (మెంటల్ డిజెబిలిటీ), సింగిల్ జీన్ డిజార్డర్స్, 35 ఏళ్ల తర్వాత గర్భం దాల్చడం వంటి సమస్యలు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఇలాంటి లోపాలన్నింటినీ టిఫా స్కాన్‌తో గుర్తించే అవకాశం ఉంది. శిశువు గర్భంలో ఏ పొజిషన్‌లో ఉంది? జరాయువు/మావి (ప్లాసెంటా) ఏ ప్రాంతంలో ఉంది? ఉమ్మ నీరు స్థితి, శిశువులో ఇతరత్రా లోపాలను దీని ద్వారా గుర్తించి, వెంటనే సరిదిద్దడానికి వీలుంటుంది. జరాయువు, బొడ్డుతాడు ఉన్న స్థితిని బట్టి సాధారణ/సిజేరియన్ ప్రసవం అవసరం అవుతుందా అన్నది కూడా అంచనా వేయవచ్చు. 18 నుంచి 22 వారాల గర్భస్థ దశలో ఈ స్కానింగ్ చేస్తారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో లబ్ధిదారులైన గర్భిణులకు పై సమస్యలు ఉంటే వైద్యుల సూచన మేరకు ఒక టిఫా స్కాన్, రెండు అల్ట్రాసోనోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. సమస్యలేమీ లేని వారికి మూడు అల్ట్రాసోనోగ్రామ్ స్కాన్‌లు చేస్తారు.

ఇప్పటికే పలు రకాలుగా అండగా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే తల్లీ బిడ్డల సంరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చి ఆస్పత్రి నుంచి ఇంటికి క్షేమంగా తిరిగి వెళ్లేంత వరకు అండగా ఉంటోంది. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామాల్లోనే గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు చేయిస్తోంది. అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తోంది. పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళలను 108 అంబులెన్స్‌ల ద్వారా నిమిషాల్లో ఆస్పత్రులకు చేరుస్తోంది. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ కింద డెలివరీ సేవలు పొందిన మహిళలకు ఆస్పత్రి నుంచి ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేలు సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్న వారిలో గర్భిణులు రెండో స్థానంలో ఉన్నారు. 2022–23లో ఆరోగ్యశ్రీ కింద 2.31 లక్షల మంది గర్భిణులు ప్రసవం సేవలు పొందారు. మరోవైపు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవానంతరం గర్భిణులను వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా క్షేమంగా ఇళ్లకు చేరుస్తున్నారు.


గర్భిణుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ



గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ క్రమంలోనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తూ టిఫా స్కాన్‌ను ఉచితంగా చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను సైతం ఏర్పాటు చేశాం. హై రిస్క్ గర్భిణులను డెలివరీ డేట్‌కు ముందే ఆస్పత్రికి తరలిస్తున్నాం. తద్వారా వారికి మెరుగైన వైద్య సంరక్షణ అందించి తల్లి, బిడ్డకు ఎటువంటి ప్రమాదం లేకుండా ప్రసవానికి అవకాశం ఉంటోంది.

– జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

శిక్షణ పూర్తయింది



గర్భిణులకు టిఫా, అల్ట్రాసోనోగ్రామ్ స్కాన్ చేయడానికి వీలుగా ప్రొసీజర్‌లను ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. ఏ విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనే విషయంపై నెట్‌వర్క్ ఆస్పత్రుల మెడికోలు, డేటాఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చాం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులైన మహిళలు అందరూ ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

– ఎం.ఎన్. హరేంధిరప్రసాద్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో

వేడుకగా గంగమ్మకు వెంకన్న సారె సమర్పణ

తిరుపతి కల్చరల్: శ్రీవారి చెల్లెలుగా పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మకు వేడుకగా తిరుమల శ్రీవారి సారె శనివారం సమర్పించారు. గంగమ్మ జాతర ప్రారంభమైన నాలుగో రోజు శ్రీవారి నుంచి సారె సమర్పించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయ అర్చకులు, అధికారులు సారెను శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్ పూజలు నిర్వహించి సారెను శిరస్సుపై ఉంచుకొని మేళతాళాలు,మంగళ వాయిద్యాలు, కళాబృందాల ప్రదర్శనల నడుమ సారెను ఊరేగించారు. అశ్వస్వారీ సాగుతుండగా దేవతామూర్తుల వేషధారణలు, డప్పులు, తప్పెట గుళ్లు, కొమ్మకొయ్య, తీన్‌మార్, కీలు గుర్రాలు, పులి వేషాలు, బోనాలు, గరగలు వంటి కళా ప్రదర్శనలతో ఊరేగింపు కోలాహలంగా సాగింది. భక్తులు పసుపు నీరు చల్లుతూ, హారతులు పట్టి కొబ్బరి కాయలు సమర్పించి సారెకు మొక్కుకున్నారు. శ్రీగోవిందరాజస్వామి ఆలయం నుంచి కర్నాల వీధి, భేరి వీధి, కృష్ణాపురం ఠాణా, నాలుగు కాళ్ల మండపం, పద్దకాపు లేఔట్ ద్వారా గంగమ్మ ఆలయం వరకు సారె శోభాయాత్ర జరిగింది. గంగమ్మ ఆలయానికి చేరుకున్న వీరికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గంగమ్మ ఆలయంలో ఆలయ అర్చకులకు సారెను అందజేసి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారెను తీసుకువస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం,ఎమ్మెల్యే భూమన తదితరులు

రేపటి తరం కోసం 'మిషన్ లైఫ్'

- బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవర్



సాక్షి,అమరావతి: 2028కి దేశంలో 80% గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలను పర్యావరణ అనుకూలమైనవిగా మార్చాలని కేంద్ర విద్యుత్, పర్యావరణ మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) సెక్రటరీ మిలింద్ దేవర్ తెలిపారు. అన్ని రాష్ట్రాల డిజిగ్నేటెడ్ ఏజెన్సీ (ఎస్‌డీఏ)లతో శనివారం జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5 వరకూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని బీఈఈ మిషన్ లైఫ్ (పర్యావరణానికి జీవనశైలి) నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి ఎస్‌డీఏలకు లక్ష్యాలను నిర్దేశించినట్లు చెప్పారు. విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఆహార వ్యవస్థ, స్వచ్ఛత, ఆరోగ్యకర జీవనశైలి, ఈ–వ్యర్థాల తగ్గింపు వంటి 7 కేటగిరిల్లో అవగాహన కార్యకలాపాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. గృహాలు, వ్యవసాయ రంగాల్లోనే కాకుండా,విద్యార్థులతో ఎనర్జీ క్లబ్‌ల ద్వారా విద్యుత్ సామర్థ్యం, విద్యుత్ పరిరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని నోడల్ ఏజెన్సీగా ఎంపికైన ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డికి సూచించారు. భవిష్యత్ తరాలకు లైఫ్‌లైన్‌గా లైఫ్ ఉద్యమాన్ని పరిగణిస్తున్నామని, రైతుల కోసం నిర్వహణ కార్యక్రమం, మునిసిపాలిటీల కోసం డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్,ప్రజల కోసం ఎలక్ట్రిక్ వెహికల్ ప్రచారం,ఉపకరణాల రిటైలర్ల కోసం రిటైలర్ల శిక్షణ కార్యక్రమాలు జరపాలని కోరారు. ఇందుకు 'మేరీ లైఫ్' అనే యాప్, పోర్టల్‌ని రూపొందించామని, ఇక్కడ ఎస్‌డీఏలు తమ కార్యక్రమాల వివరాలు నమోదు చేయాలన్నారు.

పెట్టుబడి పెట్టు.. ఈబీ-5 వీసా పట్టు



అమెరికాలో కొనసాగేందుకు భారతీయుల తాజా మంత్రం

- కనీస పెట్టుబడి ఎనిమిది లక్షల యూఎస్ డాలర్లు
- ఎక్కువగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు
- ఈబీ-5 వీసాల్లో రెండోస్థానంలో భారతీయులు
- 2016 నుంచి 400 శాతం పెరిగిన ఈ వీసాల జారీ

సాక్షి, అమరావతి: ఈబీ-5 వీసా.. ఇదీ ప్రస్తుతం అమెరికాలోని భారతీయ వృత్తి నిపుణుల సరికొత్త తారకమంత్రం. అమెరికాలోని ఐటీ కంపెనీలు భారీగా ఉద్యోగాల్లో కోత విధిస్తుండటంతో ఆ దేశంలో కొనసాగేందుకు భారతీయ వృత్తి నిపుణులకు కనిపిస్తున్న మరో ప్రత్యామ్నాయం. అమెరికాలో వృత్తి నిపుణులుగా కొనసాగేందుకు ఆ దేశంలో పెట్టుబడిదారులుగా మారుతున్నారు. ఇందులో భాగంగా అక్కడ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెడుతున్నారు. ఆ కేటగిరీలో ఈబీ-5 వీసాల కోసం అమెరికాలోని భారతీయులు అత్యధికంగా దరఖాస్తులు చేస్తున్నారని 'యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రియల్ ఎస్టేట్‌లో మన వాళ్ల పెట్టుబడులు..

ఆర్థిక మాంద్యం ఛాయలు ప్రస్ఫుటంగా కనిపిస్తుండటంతో అమెరికాలోని దిగ్గజ ఐటీ కంపెనీలతోపాటు ఇతర కంపెనీలు భారీగా ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. దాంతో హెచ్1బీ వీసా మీద ఆ దేశం వెళ్లిన భారతీయులు వెనక్కి వచ్చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అమెరికాలోనే కొనసాగాలంటే మరో కంపెనీల్లో ఉద్యోగం దక్కించుకోవాలి. అందుకు అవకాశాలు కూడా పెద్దగా లేకపోవడంతో భారతీయ వృత్తి నిపుణులు ఈబీ-5 వీసా కోసం దరఖాస్తులు చేస్తున్నారు. అందుకోసం ఆ దేశంలో పెట్టుబడులు పెట్టే కన్సల్టెన్సీలతో భాగస్వాములుగా మారుతున్నారు. ఎక్కువగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతున్నారు. కన్సల్టెన్సీలు కనీసం 20 మందిని ఓ గ్రూప్‌గా ఏర్పరచి ఒక్కొక్కరి నుంచి 8 లక్షల అమెరికన్ డాలర్ల చొప్పున 16 మిలియన్ డాలర్లు (భారతీయ కరెన్సీలో రూ.131.39 కోట్లు) నిధిని సేకరిస్తున్నాయి. ఆ నిధులను వివిధ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ చేపడుతున్న రెంటల్ అపార్ట్‌మెంట్లు, భవనాలు, హోటళ్లు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడిగా పెడుతున్నాయి. ఆ విధంగా పెట్టుబడి పెడుతున్న వారు ఆ వ్యాపారంలో క్రియాశీలకంగా ఉండటంగానీ ప్రత్యక్షంగా ఎవరికీ ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరంగానీ లేదు. వారు పాసివ్ పెట్టుబడిదారులుగా ఉంటారు. పెట్టిన పెట్టుబడిపై వారికి వడ్డీ లభిస్తుంది కూడా. దాంతోపాటు పెట్టుబడిదారు హోదా దక్కుతుంది. ఆ హోదాపై ఈబీ-5 వీసాకు దరఖాస్తు చేసి పొందుతున్నారు. ఆ వీసాపై అమెరికాలో ఏ ప్రాంతంలోనైనా పనిచేసేందుకు వారికి అవకాశం దక్కుతుంది. ఈబీ-5 వీసా కింద ఐదుగురు కుటుంబ సభ్యులు అమెరికాలో నివసించేందుకు అవకాశముంది.

పెరుగుతున్న ఈబీ-5 వీసాలు

భారతీయులకు ఈబీ-5 వీసాల జారీ క్రమంగా పెరుగుతోంది. 2019లో 756 మంది భారతీయులు ఈబీ-5 వీసాలు పొందగా.. 2022లో ఏకంగా 1,381 మందికి వీటిని జారీ చేయడం విశేషం. 2016తో పోలిస్తే ఈబీ-5 వీసాలు పొందిన భారతీయుల సంఖ్య 400 శాతం పెరిగింది. 2022లో అమెరికా మొత్తం 10,885 ఈబీ-5 వీసాలు జారీచేసింది. వాటిలో 1,381 వీసాలతో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో వియత్నాం ఉన్నాయి. ఇక 2023లో 14,200 ఈబీ-5 వీసాలు జారీ చేయాలని యూఎస్‌సీఐఎస్ భావిస్తోంది. దాంతో సహజంగానే ఈసారి కూడా భారతీయులు అత్యధికంగా ఈ వీసాల కోసం దరఖాస్తు చేస్తున్నారు.

ఈబీ-5 వీసా అంటే..

అమెరికాలో గ్రీన్‌కార్డ్‌కు దాదాపు సమానమైన గుర్తింపు ఉన్నదే ఈబీ-5 వీసా. అంతటి ప్రాధాన్యమున్న ఈ వీసా పొందాలంటే వ్యక్తులు అమెరికాలో కనీసం 8 లక్షల అమెరికన్ డాలర్లను (భారతీయ కరెన్సీలో రూ.6.57 కోట్లు) పెట్టుబడిగా పెట్టడంతోపాటు కనీసం 10 ఉద్యోగాలను కల్పించాలి. దాంతో వారికి పెట్టుబడిదారుల హోదా కింద ఈబీ-5 వీసాను జారీచేస్తారు. ఈబీ-5 వీసాకు దరఖాస్తు చేయాలంటే గతంలో 5 లక్షల అమెరికన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాలని నిబంధన ఉండేది. కానీ, ఈ వీసాల కోసం డిమాండ్ పెరుగుతుండడంతో యూఎస్‌సీఐఎస్ ఈ కనీస పెట్టుబడి మొత్తాన్ని 2022లో 8 లక్షల డాలర్లకు పెంచింది.

వావ్.. ఫ్లవర్ షో!



తమిళనాడులోని నీలగిరుల్లో పుష్ప ప్రదర్శన కనువిందు చేస్తోంది. ఈ ఏడాది వేసవి ఉత్సవాల సీజన్‌లో భాగంగా ఊటీ బొటానికల్ గార్డెన్‌లో రోజా పువ్వులతో పుష్ప ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఇందులో 40,000 రోజాలతో ఏర్పాటు చేసిన ఈఫిల్ టవర్, ఏనుగుల ఆకృతి, ఊటీ ఆవిర్భవించి 200 ఏళ్లు కావడాన్ని పురస్కరించుకుని ఊటీ-200 పేరిట ఏర్పాటు చేసిన అతి పెద్ద పుష్ప అలంకరణ పర్యాటకులను ఆకర్షిస్తోంది.

– సేలం (తమిళనాడు)

భద్రాద్రిలో నిత్యాన్నదానానికి ప్రభాస్ రూ.10 లక్షల విరాళం

భద్రాచలం: తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి ప్రముఖ సినీ నటుడు ప్రభాస్ శనివారం రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి కాశ్యపస గోత్రం పేరుతో ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు. కాగా, ప్రభాస్ తరఫున యూవీ క్రియేషన్స్ బాధ్యులు ఉప్పలపాటి వెంకట సత్యనారాయణ ఆలయ ఈఓ రమాదేవికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ వారికి కృతజ్ఞతలు తెలిపి రశీదు ఇచ్చారు. కాగా, ప్రభాస్ రాముడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఆదిపురుష్'వచ్చే నెల 23న విడుదల కానుంది.

క్లుప్తంగా...

రేపటి నుంచి ఈఏపీసెట్

- 23 వరకు పరీక్షల నిర్వహణ
- దరఖాస్తు చేసుకున్నవారు 3,37,733
- హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నవారు 3,17,480 మంది
- 47 పట్టణాల్లో 136 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

సాక్షి, అమరావతి/అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్)-2023కి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అన్ని ఏర్పాట్లు చేసింది. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ఈ నెల 15 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో ఈఏపీసెట్‌ను నిర్వహించనుంది. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్ శనివారం విడుదల చేశారు. ఈ ఏడాది ఎంపీసీ విభాగంలో 2,37,193 మంది, బైపీసీ విభాగంలో 99,557 మంది, రెండు విభాగాల్లో మరో 983 మంది కలిపి మొత్తం 3,37,733 మంది దరఖాస్తు చేశారు. ఇప్పటిదాకా 3,17,480 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. మరో రెండు రోజులు సమయం ఉండడంతో పరీక్షకు హాజరయ్యేవారి సంఖ్య పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు. అభ్యర్థుల కోసం 47 పట్టణాల్లో 136 పరీక్ష కేంద్రాలను (తెలంగాణలో సికింద్రాబాద్, ఎల్బీనగర్‌తో సహా) ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుంచి 19 వరకు ఎంపీసీ విభాగంలో 9 సెషన్స్‌లో ఆన్‌లైన్‌లో ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. అలాగే 22, 23 తేదీల్లో బైపీసీ విభాగంలో నాలుగు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు సరైన గుర్తింపు కార్డులు/పత్రాలను ఆయా పరీక్ష కేంద్రాల వద్ద చూపించాలని నజీర్ అహ్మద్ సూచించారు.

వాసిరెడ్డి పద్మకు ఘన సత్కారం



వాసిరెడ్డి పద్మ 35 ఏళ్ల ప్రజా జీవితం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అన్యాయానికి గురైన వారికి తానున్నానంటూ ముందుకు వచ్చిన వాసిరెడ్డి పద్మ ఆకాంక్షలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నెరవేరుతున్నాయని రాష్ట్ర బీసీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ప్రజాజీవితంలో 35 ఏళ్లు పూర్తిచేసుకున్న మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆనంద్ రీజెన్సీలో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా.. 'వాసిరెడ్డి పద్మ 35 ఏళ్ల ప్రజా ప్రస్థానం' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. సత్కార గ్రహీత వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కార్యక్రమాలతో పేదల జీవితాల్లో వెలుగులు ఎలా ప్రసరిస్తున్నాయో గుర్తు చేయడానికే తాను వచ్చానన్నారు. ప్రజల కోసం ఉద్యమాలు చేయడం, వారి సమస్యలు తీర్చే దిశగా కృషి చేయడమే తన లక్ష్యమన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని సహకారాన్ని అందిస్తుందన్నారు. అనంతరం వాసిరెడ్డి పద్మ, కేఎస్ వెస్లీ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు.

పాక్ చెర నుంచి జాలర్ల విడుదల!

- రాష్ట్రానికి చెందిన ముగ్గురికి విముక్తి
- వీరిలో ఒకరు శ్రీకాకుళం, ఇద్దరు తూర్పు గోదావరి వాసులు
- 2018లో పాక్ కోస్ట్‌గార్డ్‌కు చిక్కిన భారత మత్స్యకారులు
- సీఎం జగన్ కేంద్రంపై ఒత్తిడి తేవడంతో 2020 జనవరిలో 20 మంది విడుదల

సాక్షి, విశాఖపట్నం/ఎచ్చెర్ల క్యాంపస్: బతుకుదెరువు కోసం గుజరాత్‌లోని వీరావల్ ప్రాంతానికి చేపల వేటకు వెళ్లారు. వీరిలో ఏపీకి చెందిన 22 మంది మత్స్యకారులు అరేబియా సముద్రంలో చేపలవేట సాగిస్తూ 2018 నవంబర్‌లో పాకిస్తాన్ కోస్ట్‌గార్డ్‌కు చిక్కారు. అనంతరం వీరిని అక్కడి అధికారులు పాకిస్తాన్ జైళ్లలో ఉంచారు. 2019లో గుజరాత్ తీరం నుంచి పాక్ సముద్ర జలాల్లో చేపల వేటకు వెళ్లిన మైలపిల్లి భాస్కరరావు కూడా పాకిస్తాన్ కోస్ట్‌గార్డ్ సిబ్బందికి పట్టుబడ్డాడు. పాక్ జైళ్లలో చిక్కిన ఆంధ్ర మత్స్యకారుల విడుదలకు సీఎం వైఎస్ జగన్ కేంద్రంపై ఒత్తిడి తేవడంతో అక్కడ జైళ్లలో మగ్గుతున్న 20 మంది ఉత్తరాంధ్ర మత్స్య కారులను 2020 జనవరి 5న విడిచిపెట్టారు. సాంకేతిక కారణాల వల్ల మరో ముగ్గురు విడుదలకు నోచుకోలేదు. భారత్-పాకిస్తాన్ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు తాజాగా శుక్రవారం రాత్రి 199 మంది భారతీయ మత్స్యకారులను కరాచీలోని లాండీ జైలు నుంచి విడుదల చేశారు. వీరిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరానికి చెందిన ముద్దే అన్నవరం, పెమ్మిడి నారాయణరావు,



భాస్కరరావు


శ్రీకాకుళం జిల్లా బడివానిపేటకి చెందిన మైలపల్లి భాస్కరరావు కూడా ఉన్నారు. వీరిని భారత్-పాక్ సరిహద్దు ప్రాంతం వాఘా-అట్టారీ వద్ద భారత్ అధికారులకు అప్పగించారు. అనంతరం అధికారులు వీరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి గుజరాత్‌లోని వీరావల్‌కు తీసుకెళ్లారు. తాజాగా.. ఈ ముగ్గురు విడుదలతో పాక్ జైళ్లలో ఇప్పుడు ఒక్క మత్స్యకారుడు కూడా లేరు.

నాలుగైదు రోజుల్లో రాష్ట్రానికి..

పాక్ జైలు నుంచి విడుదలైన రాష్ట్రానికి చెందిన ముగ్గురు మత్స్యకారులు ఈ నెల 17 లేదా 18 తేదీల్లో వీరిని విజయవాడకు తీసుకువస్తారని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ 'సాక్షి'కి చెప్పారు. 2020లో పాక్ జైళ్ల నుంచి విడుదలైన ఒక్కో మత్స్యకారునికి రూ.5 లక్షల చొప్పున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయం అందించారని, ఇప్పుడు విముక్తి లభించిన ముగ్గురికి కూడా రూ.5 లక్షలు చొప్పున అదనపు నెలవారీ జీవన భృతి కింద మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, కమిషనర్ కన్నబాబు చెల్లిస్తారని తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారన్నారు.

తెలంగాణ కొత్త ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వొద్దు

- కేంద్రానికి మరోసారి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- కేంద్ర జల్ శక్తి శాఖకు జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి లేఖ



సాక్షి, అమరావతి: గోదావరి నదీ జలాల్లో రెండు రాష్ట్రాలకు వాటాలు తేల్చే వరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సీతారామ ఎత్తిపోతల, కాళేశ్వరం ద్వారా మూడో టీఎంసీ తరలింపు సహా కొత్త ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకూడదని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం మరో మారు విజ్ఞప్తి చేసింది. విభజన చట్టం ప్రకారం ట్రిబ్యునల్ ద్వారా నీటి వాటాలు తేలాలని లేదా నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరాకే కొత్త ప్రాజెక్టులకు అనుమతివ్వాలని గుర్తు చేసింది. కానీ.. నిబంధనలను తుంగలో తొక్కి రోజుకు రెండు టీఎంసీల గోదావరి జలాలు తరలించేలా కాళేశ్వరం ఎత్తిపోతలకు 2018 జూన్ 6న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) అనుమతి ఇచ్చిందని ఎత్తిచూపింది. ఆ అనుమతిని పునఃసమీక్షించాలని, తెలంగాణ చేపట్టిన కొత్త ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకూడదని కేంద్రాన్ని కోరింది. వాటాలు తేలకుండానే ఎగువ రాష్ట్రాల ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే దిగువ రాష్ట్రమైన ఏపీ హక్కులను హరించినట్లేనని తేల్చిచెప్పింది. ఏపీ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని తెలిపింది. ఈ మేరకు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్‌కు రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ లేఖ రాశారు. దమ్ముగూడెం ఆనకట్టకు 200 మీటర్లు దిగువన 36.57 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సీతమ్మసాగర్ బ్యారేజీ, దానికి అనుబంధంగా 320 మె.వా జలవిద్యుత్ కేంద్రం నిర్మించి.. రోజుకు 9 వేల క్యూసెక్కుల చొప్పున 70 టీఎంసీలను తరలించి 6.74 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా సీతారామ ఎత్తిపోతలను తెలంగాణ చేపట్టింది. ఈ ప్రాజెక్టుకు అనుమతి కోరుతూ డీపీఆర్ ను గోదావరి బోర్డుకు అందజేసింది. నీటి కేటాయింపు లేకుండా ప్రాజెక్టు ఎలా చేపడతారని తెలంగాణ సర్కార్‌ను బోర్డు నిలదీసింది. ఈ పథకం చేపడితే పోలవరం ప్రాజెక్టు ఆయకట్టుపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని బోర్డు కోరింది. ఈ నేపథ్యంలో తెలంగాణ కొత్త ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వొద్దని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో సారి కోరింది.

రాష్ట్ర అవసరాలు 1238.436 టీఎంసీలు

గోదావరి బేసిన్‌లో ఇప్పటికే పూర్తయినవి, నిర్మాణంలో ఉన్నవి, భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులకు 1,238.436 టీఎంసీలు అవసరమని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసింది. ఇందు లో ఇప్పటికే పూర్తయి, వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల తోపాటు పోలవరానికి 737.156 టీఎంసీలను బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టి, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 165.280 టీఎంసీలు అవసరం. మొత్తం 902.436 టీఎంసీలు అవసరం. బచావత్ ట్రిబ్యునల్ వరద జలాలను వినియోగించుకునే పూర్తి స్వేచ్ఛను, ఎగువ రాష్ట్రాలకు కేటాయించగా మిగిలిన నికర జలాలను వాడుకునే హక్కును దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి కల్పించింది. విభజన నేపథ్యంలో బేసిన్‌లో దిగువ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవుతుందని సీడబ్ల్యూసీ తేల్చింది. 336 టీఎంసీల వరద జలాలను వాడుకోవడానికి ప్రాజెక్టులు చేపడతామని ఇప్పటికే కేంద్రానికి ఏపీ స్పష్టం చేసింది. గోదావరి జలాలను 2 రాష్ట్రాలకు పంపిణీ చేయాలంటే కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుచేయాలని లేదంటే రాష్ట్రాల మధ్య నీటి వినియోగంపై ఒప్పందం జరగాలని పేర్కొంది.

యూఎస్ మార్కెట్లో మంగంపేట జెండా



బెరైటీస్ ఎగుమతుల్లో సరికొత్త రికార్డు

- అమెరికా మార్కెట్లో 44 శాతం ఏపీఎండీసీ నుంచే
- స్వయంగా ప్రకటించిన అంతర్జాతీయ బెరైటీస్ అసోసియేషన్
- ప్రపంచంలోని ఏదేశానికి అమెరికా మార్కెట్లో దక్కని ఇంత వాటా
- తొలిసారి ఆస్థాయి మార్కెట్ చేజిక్కించున్న రాష్ట్ర సంస్థ
- ఫలితంగా ఏపీఎండీసీకి ఈ ఏడాది రూ.1,300 కోట్ల ఆదాయం

సాక్షి, అమరావతి: బెరైటీస్ ఎగుమతుల్లో ఏపీఎండీసీ సరికొత్త రికార్డు సృష్టించింది. అమెరికా(యూఎస్ఏ) బెరైటీస్ మార్కెట్లో రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఏపీఎండీసీ 44 శాతం వాటాను సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ బెరైటీస్ అసోసియేషన్ ఇటీవల వెల్లడించింది. అమెరికా మార్కెట్‌లో ఒక దేశంగానీ, సంస్థగానీ ఇంత శాతం మార్కెట్‌ను చేజిక్కించుకోవడం ఇదే ప్రథమం అని బెరైటీస్ అసోసియేషన్ తెలిపింది. గత సంవత్సరం అమెరికా మార్కెట్‌లో 30 శాతం వాటా దక్కించుకున్న ఏపీఎండీసీ.. ఈ సంవత్సరం దానిని మరో 14 శాతం పెంచి ప్రపంచ మార్కెట్‌లో సుస్థిర స్థానం సాధించింది.

కొత్త లక్ష్యాలతో సత్ఫలితాలు

బెరైటీస్‌కు అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉత్పత్తి, మార్కెటింగ్ లక్ష్యాలను కొత్తగా నిర్దేశించుకుంది. మంగంపేట బెరైటీస్‌కు అంతర్జాతీయ బ్రాండింగ్ తీసుకువచ్చేందుకు అమెరికాలోని పలు చమురు ఉత్పత్తి సంస్థలతో ఏపీఎండీసీ ద్వారా ఒప్పందాలు చేసుకుంది. అప్పటివరకు కొన్ని ప్రైవేటు ఏజెన్సీల ద్వారా బెరైటీస్‌ను అంతర్జాతీయ మార్కెట్‌కు విక్రయించేది. బెరైటీస్ అవసరం ఉన్న చమురు సంస్థలకే నేరుగా ఖనిజాన్ని అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా మార్కెటింగ్‌లో ముందడుగు వేసింది. గత ప్రభుత్వంలో ఉన్న ఎగుమతుల ఒప్పందాన్ని సంవత్సరం నుంచి మూడేళ్లకు పొడిగించింది. ఒకసారి ఒప్పందం చేసుకుంటే మూడేళ్లు స్థిరంగా ఎగుమతులు చేసే అవకాశాన్ని సృష్టించింది. గత ఏప్రిల్‌లో 25 శాతం ధర పెంచినా ఎగుమతులపై ఎటువంటి ప్రభావం పడలేదు. దీంతో చైనా, మెక్సికో, మొరాకో వంటి బలమైన పోటీదారులను కూడా దాటి 44 శాతం వాటాను ఏపీ దక్కించుకుంది. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం 3 మిలియన్ టన్నుల బెరైటీస్ ఉత్పత్తి లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని సాధించింది. గత సంవత్సరం బెరైటీస్‌పై ఏపీఎండీసీకి రూ. 900 కోట్ల ఆదాయం రాగా ఈ సంవత్సరం అది రూ.1,300 కోట్లకు పెరిగింది. తాజా వ్యూహాలతో డిమాండ్ లేని సీ, డీ గ్రేడ్ బెరైటీస్ ఖనిజానికి డిమాండ్ ఏర్పడింది.

బెరైటీస్ అంటే మంగంపేటే

బెరైటీస్ నిక్షేపాలు అన్నమయ్య జిల్లా మంగంపేటలో విస్తారంగా ఉన్నాయి. చమురు, సహజవాయువుల రంగానికి బెరైటీస్ అత్యంత కీలకం కావడం, అతి తక్కువ దేశాల్లో మాత్రమే ఇది దొరకడంతో అంతర్జాతీయంగా దీనికి డిమాండ్ ఉంది. మన దేశంలో ఉన్న నిక్షేపాల్లో 98 శాతం మంగంపేటలోనే ఉండటం విశేషం. మంగంపేటలో 74 మిలియన్ టన్నుల నిల్వలున్నాయి. ఈ ప్రాజెక్టు నుంచి ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 దేశాలకు బెరైటీస్ ఎగుమతి అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు, సహజవాయువు ఉత్పాదక కంపెనీలకు మంగంపేట నుంచి వెళ్లే బెరైటీస్ వాటా 25 శాతంగా ఉంది. మొత్తం ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న బెరైటీస్‌లో మంగంపేట గనుల నుంచి లభిస్తున్న గ్రే బెరైటీస్ అత్యంత నాణ్యమైనదిగా గుర్తింపు పొందింది. ఇప్పటి వరకు 40 మిలియన్ టన్నుల ఖనిజాన్ని వెలికితీశారు.

కొత్త విధానాల వల్లే మంచి ఫలితాలు

బెరైటీస్ ఉత్పత్తి, మార్కెటింగ్‌లో అనుసరించిన కొత్త విధానాల వల్లే మంచి ఫలితాలు సాధించాం. సీఎం జగన్ సూచనల ప్రకారం ఎప్పటికప్పుడు సరికొత్త పంథాలో పయనించాం. అమెరికా మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని పనిచేయడం ద్వారా ఎగుమతుల్ని బాగా పెంచగలిగాం. అమెరికా బెరైటీస్ మార్కెట్‌లో 44 శాతాన్ని ఏపీఎండీసీ సొంతం చేసుకోవడం సామాన్య విషయం కాదు. చైనా వంటి దేశాలకు మించి బెరైటీస్ ఎగుమతుల్ని చేశాం. స్పష్టమైన ప్రణాళికతో దీన్ని సాధించాం.

– వీజీ వెంకటరెడ్డి, వీసీ అండ్ ఎండీ, ఏపీఎండీసీ

పూజల పేరుతో యువతులకు వల

- నగ్నంగా పూజలు చేస్తే ధనప్రాప్తి కలుగుతుందని మోసం
- మోసాన్ని గ్రహించిన యువతులకు దిశ యాప్ అండ
- రక్షించిన నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో గుంటూరు జిల్లా పొన్నెకల్లుకు చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి సోషల్ మీడియాలో పరిచయమైన చిలకలూరిపేటకు చెందిన ఓ మహిళకు ప్రత్యేక పూజలు చేస్తే డబ్బు వస్తుందని నమ్మించాడు. మహిళలు పూజ చేస్తున్న సమయంలో నగ్నంగా కూర్చోవాలని.. పూజలో కూర్చునే మహిళకు రూ.50 వేల చొప్పున ఇస్తామని నమ్మించాడు. దీంతో ఆ మహిళ కర్నూలు జిల్లా నంద్యాల సమీప గ్రామాలకు చెందిన ఇద్దరు యువతులకు ఈ విషయం చెప్పి పూజలో కూర్చుంటే ఒక్కొక్కరికి రూ. 50 వేలు వస్తాయని ఆశ పెట్టింది. దీంతో వారం రోజుల క్రితం ఆ ఇరువురు యువతులు గుంటూరు వచ్చారు. నాగేశ్వరరావు, ఆ మహిళ చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో వారం రోజులపాటు నగ్నపూజలు చేశారు. ఆ సమయంలో నాగేశ్వరరావుతోపాటు మరికొందరు ఆ మహిళతోపాటు ఇద్దరు యువతులపైనా అత్యాచారానికి పాల్పడినట్టు తెలుస్తోంది. అనంతరం నాగేశ్వరరావు పలాయనం చిత్తగించాడు. తమకు సొమ్ములు ఇవ్వకపోవడంతో ఆ ఇద్దరు యువతులు సదరు మహిళను నిలదీయగా.. ఆమె నాగేశ్వరరావుకు ఫోన్ చేసింది. దీంతో అతడు ఆ మహిళను, ఇద్దరు యువతులను పొన్నెకల్లుకు రావాలని సూచించాడు. ఆ ముగ్గురూ రాగా.. నగదు విషయంలో నాగేశ్వరరావుతో గొడవ జరిగింది. దీంతో ఆ యువతులు దిశ నంబర్‌కు ఫోన్ చేశారు. నాగేశ్వరరావు పరారవగా.. యువతులను నల్లపాడు పోలీసులు రక్షించి స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటికే పోలీసులు సుమారు 20 మందికిపైగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. వివరాలను త్వరలో వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

36 వేల టీచర్ల నియామకం

కలకత్తా హైకోర్టు సంచలన ఉత్తర్వులు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఏడేళ్ల క్రితం ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో నిబంధనావళి ఉల్లంఘన ద్వారా ఉద్యోగాలు పొందిన 36వేల మంది ఉపాధ్యాయుల నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. 3 నెలల్లోపు ఆ పోస్టులను భర్తీచేయాలని తృణమూల్ కాంగ్రెస్ సర్కార్‌ను జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. 'ఇంతటి అవినీతిని పశ్చిమబెంగాల్‌లో ఏనాడూ చూడలేదు. ఉద్యోగాలు కోల్పోయిన ప్రైమరీ టీచర్లు 4 నెలలపాటు విధుల్లో కొనసాగవచ్చు. అప్పటిదాకా పారా టీచర్ల స్థాయిలో తక్కువ జీతమే తీసుకోవాలి' అని జడ్జి జస్టిస్ అభిజిత్ సూచించారు. 'నాటి రాష్ట్ర ప్రాథమిక విద్యా బోర్డు అధ్యక్షుడు మాణిక్ భట్టాచార్య, బోర్డ్ సభ్యులు ఈ నియామకాల ప్రక్రియను ఒక లోకల్ క్లబ్ మాదిరిగా మార్చేశారు' అని జడ్జి ఆగ్రహం వ్యక్తంచేశారు. 2016 నాటి బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల కుంభకోణాన్ని కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు విచారణచేపట్టిన విషయం విదితమే. '2016లో రిక్రూట్ అయిన 42,500 మందిలో 36వేల మంది ఆప్టిట్యూట్ పరీక్ష అర్హత లేకుండా, శిక్షణ లేకుండా ఉద్యోగాలు పొందారు. అందుకే వీరి నియామకం మాత్రమే రద్దయింది' అని ఓ న్యాయవాది చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943